ఆదివారం

ప్రజాశక్తి

25 నవంబర్, 2001

లొంగుబాట్లు, నిరసనల మధ్య

దోహా డ్రామా



ఉత్తరాంధ్రలో ISI ముద్ర కలిగిన ఏకైక సంస్థ
గృహోపయోగమైనా, పరిశ్రమ అయినా బోర్‌వెల్ అయినా నాణ్యతకు
మా శ్రీ వాసవి పి.వి.సి. పైపులనే వాడండి.
శ్రీ వాసవి
పైపులు
తయారు చేయువారు:
Rigid P.V.C. H.D.P.E., S.W.R.,
Blue Threaded, Durawin Pipes and Couplers
శ్రీ వాసవి పాలిమర్స్ ప్రై. లిమిటెడ్
అంతకాపల్లి, పొందూరు రోడ్, రాజాం-532 127, శ్రీకాకుళం జిల్లా. ఫోన్: 08941-51132, 51383. ఫ్యాక్స్: 51382.
విశాఖపట్నం : ఫోన్: 790389, 790366, 790884, విజయవాడ: 562056, 620576,
నెల్లూరు : 334315, 316746 హైదరాబాద్: 4122220
కేసింగ్ పైపులు
మా ప్రత్యేకత
ఉత్తరాంధ్రలో ISI ముద్ర కలిగిన పి.వి.సి. పైపులు తయారు చేయు ఏకైక సంస్థ
20 mm-200 mm, 4kgf/6kgfcm2 లలో లభ్యమగును



రంజాన్, క్రిస్టమస్ మరియు
నూతన సంవత్సర శుభాకాంక్షలు
Bharatgas
YOUR FAVOURITE FUEL
Bharat Petroleum
సత్వర కనెక్షన్ కొరకు సంప్రదించండి :
మదీన ఎంటర్ ప్రైజెస్
భారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్స్,
నంద్యాల రోడ్, తాడిపత్రి, అనంతపురం జిల్లా, ఫోన్ : 26188

చెవి వ్యాధులు - నివారణ ...6, 7

సాక్షి ...18, 19



పిల్లల్లో ఆరోగ్యంపై పరిశుభ్రతా ప్రభావం 10

పల్లె జీవితాలను ఆవిష్కరించిన రాజయ్య కుంచె ...21

ఇంకా...

జీవనశైలి 8
గేయలహరి.... 9
బాలల కథ 11
బాల నేస్తాలు 12, 13
కచేరి 14
టూరిస్ట్ గైడ్ ... 16
అదాలత్ కథలు 22, 23
పలుకుబడి 24
వగైరా........

మేధావి

మనలో మాట

మావాడు గొప్ప మేధావి అంటూ పక్కింటి సుబ్బారావు తన ఫ్రెండును పరిచయం చేశాడు. ఆ మాటకు అతగాడు సుబ్బారావు వంక కోపంగా చూశాడు. ఎందుకలా చూశాడో నాకయితే అర్థం కాలేదుకాని సదరు పెద్దమనిషిని చూస్తే మేధావి అంటేమాత్రం నమ్మబుద్ధి కాలేదు. నీరుకావి బట్టలు, మొరటుగా ఉన్న విగ్రహం. పొట్టకోస్తే అక్షరం ముక్క ఉండే దాఖలాలు లేవు. పైకి అలా ఉన్నా మేధావి కాడన్న రూలేమీ లేదుకదా. అందువల్లనే వివరణ కోసం సుబ్బారావు వైపు చూశాను. తీరా తేలిందేమిటంటే ఆ పల్లెటూరి ఆసామి ఎంతో అన్యోన్యంగా ఉండేవారి మధ్య సైతం తంపులు పెట్టడంలో ఆరితేరిన వాడని, పాలూనీరులా కలిసిపోయే ప్రాణస్నేహితుల మధ్యసైతం ఆరని అగ్నిగుండాన్ని రేపడంలో సిద్ధహస్తుడని తెలిసింది. అందువల్లనే అతగాడు సుబ్బారావు వ్యాఖ్యానానికి గింజుకున్నాడు. అయితే ఒకటి మాత్రం వాస్తవం. మేధావుల్లో రకరకాల వాళ్ళుంటారు.

ఓ రకం మేధావి గురించి ఇక్కడ చూద్దాం. ఆయన పొద్దున్నే దేవాలయంలో భక్తుల నుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తాడు. మధ్యాహ్నం సాంఘిక సేవాసంస్థలో సామాజిక సేవ గురించి ఉధృతంగా ఉపన్యసిస్తాడు. సాయంత్రం విప్లవసభలో వీరావేశంతో ప్రసంగిస్తాడు. మూడుచోట్లా ఆయనకు సమానమైన గుర్తింపు లభిస్తుంది. మరో తరహా మేధావులున్నారు. వీరు సీజన్ల వారీగా వేషాలు మారుస్తుంటారు. అయ్యప్ప సీజన్లో మాల ధరించి నల్లదుస్తుల్లో కాళ్ళకు చెప్పుల్లేకుండా తిరుగుతారు. దీక్ష ముగియగానే శబరిమలై వెళ్ళి వస్తారు. అంతటితో ఆ వేషానికి స్వస్తి. ఆ తర్వాత సాయి భక్తుని అవతారం ఎత్తుతారు. ఓం సాయిరాం అంటూ ఎదురైన వారిని పలకరిస్తుంటారు. ఈ తంతు కొన్నాళ్ళు సాగుతుంది.ఈ వేషాల మధ్యలోనే విప్లవాభిమానుల అవతారాలూ దాలుస్తారు. మెడకు ఎర్రతువ్వాలు మెలివేసుకొని కనిపిస్తారు. ఎప్పటికెయ్యది ప్రస్తుతమో అప్పటికావిధంగా కనిపిస్తూ నెగ్గుకొస్తుంటారు. వీరికీ సమాజంలో గౌరవం మెండుగానే ఉంటుంది.

యూనివర్శిటీలంటే మేధావుల మయమని అనుకుంటాము. అక్కడ అధ్యయనమే దీక్షగా కలిగిన వారూ ఉంటారు. అధ్యయనం తప్ప అన్నపానాదులపై సైతం తమకు ఎంత మాత్రం ఆసక్తి లేదన్నట్లుగా కనిపించే వారూ ఉంటారు. కదిలిస్తే చాలు ఉద్గ్రంథాల నుండి సామాన్య మానవుడనేవాడికి వూహకు కూడ అందని విషయాలు వల్లె వేస్తుంటారు. ఎన్నో విషయాలు తెలిసిన వారిల్లాగ కనిపిస్తారు. కాని అధికారంలో ఉన్నవారిని పల్లెత్తు మాట అనడానికి సైతం సాహసించరు. ఉద్యోగంలో మెట్టుకు మెట్టు ఎలా పైకి వెళ్ళడంపైనే వారి ధ్యాసంతా. ఇదే మేధావులు సర్వీసు నుండి వైదొలగిన తర్వాత వీరవిప్లవ అవతారమెత్తుతారు. ప్రభువులపై నిప్పులు కురిపిస్తారు. ఇప్పుడు ఇది వారికి వాటంగా ఉంటుంది. అభ్యుదయవాది అన్నపేరు మీడియాలో గొప్ప ప్రచారం వారి స్వంతమవుతుంది.

వామపక్షమేధావులమనిచెప్పుకునేవారు కొందరుంటారు. వారికి స్వపక్షంపైకన్నా విపక్షంపైనే నమ్మకం మెండు. తాము చెప్పేదాన్ని నమ్మించాలంటే ప్రపంచ బ్యాంకు లాంటి ఆధారాలనే ఆశ్రయించాలని పూర్తిగా నమ్ముతారు. ధనస్వామ్యవ్యవస్థ దగాకోరు తనాన్ని తెలియచెప్పేందుకు సోరస్ లాంటి అంతర్జాతీయ జూదగాడి రచనలనే ఆధారంగా తీసుకుంటారు. శ్రామికవర్గ మేధావులు వీరి దృష్టికి ఎంత మాత్రం ఆనరు.

నిజమైన మేధావులు వేరే ఉంటారు. వారేమీ పెద్ద పెద్ద గ్రంథాలను ఔపోసన పట్టరు. ప్రజలే వీరి గ్రంథాలు. ప్రజా ఉద్యమాలే వారి విశ్వవిద్యాలయాలు. ఉద్యమాలనుండి నేర్చుకుంటారు. తాము నేర్చిన దాన్ని ఆ ఉద్యమాల అభివృద్ధికే అంకితం చేస్తారు. వీరిని మించిన మేధావులు వేరెవరూ లేరు. వీరు ప్రజా మేధావులు. అసలు మేధావులు వీరే. ★


దేశ భాషలందు తెలుగు లెస్స! తెలుసా!
యస్.. యువా.. ఆర్.. రైట్ బ్రదర్ తెలుగు 'లెస్స'
12TH INTERN... CHILDRENS FESTIVALS
తెలుగు సినిమా లేకుండానే ముగిసిన బాలల చిత్రోత్సవం
GANGADHAR


యుద్ధంలో మేము గెలిచాం
USA
ప్రపంచ మద్దతుకూడా మాకేవుంది!
USA
GANGADHAR


యజమానుల కోరికలు తీర్చవలసిన బాధ్యత మనకు ఉందా లేదా!
పెట్టుబడిదారులు
కార్మిక చట్టం
GANGADHAR

లొంగుబాట్లు, నిరసనల మధ్య

దోహా డ్రామా

విజయరావు



మురసోలి మారన్

మైక్ మూర్

ఖతార్ రాజధాని దోహాలో ఇటీవల జరిగిన డబ్ల్యు.టి.ఓ. మినిస్టీరియల్ సమావేశంలో భారతదేశం ఘన విజయాలు సాధించానని చెప్పుకుంటున్నది. మన దేశం ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి మురసోలి మారన్ 'బిజినెస్ స్టాండర్డ్' పత్రికకు ఇంటర్వ్యూ ఇస్తూ ఆ సంప్రదింపుల్లో తాను బంగారు పతకాలనే కాదు ప్లాటినం పతకాన్ని సైతం గెలుచుకొచ్చానని గర్వంగా ప్రకటించారు. ఆయన మాటలను ఒకసారి పరిశీలిస్తే ఆయన ఎంతగా ఉబ్బితబ్బిబ్బవుతున్నదీ అర్థమవుతుంది. "ఒలిపింక్స్ లాంటి క్రీడల్లో పాల్గొంటున్నపుడు మన విజయాలను బంగారు, వెండి, కాంస్య పతకాలతో కొలుస్తాము. ఈ సంప్రతింపుల్లో నేను సాధించిన బంగారు పతకం గత ఒప్పందం అమలుకు సంబంధించిన అంశాలు. మొదట సంపన్న దేశాలు మనం చెప్పే దాన్ని వినేందుకే సిద్ధపడలేదు. ఆ తర్వాత అలా చేస్తే పాత ఒప్పందాలను తిరగదోడినట్లు అవుతుంది. అలా తాము చెయ్యలేము అని చెప్పారు. కాని చివరకు సమస్య తీవ్రతను గుర్తించి దాన్ని పరిష్కరించాలని అంగీకరించారు...

నేను సాధించిన రెండో పతకం బంగారుది కాదు, ప్లాటినం. వాణిజ్య సంబంధిత మేధోపర హక్కులు (ట్రిప్స్), ప్రజారోగ్యంకు సంబంధించినది ఈ అంశం. 'జాతీయ ఎమర్జెన్సీ, లేదా తీవ్ర అవసరం' ఏర్పడినపుడు ప్రభుత్వాలు ఔషధాలను దిగుమతి చేసుకోవచ్చు. తయారు చేసుకోవచ్చు. ఎమర్జెన్సీ పరిస్థితి ఏర్పడిందని నిర్ణయించేది జాతీయ ప్రభుత్వాలే" మారన్ సాధించినట్లు చెబుతున్న ఈ బంగారు, ప్లాటినం పతకాలు అసలైనవా నకిలీవా అన్న దాన్ని తర్వాత పరిశీలిద్దాం. ముందు దోహాలో ఒప్పందం జరిగిన తీరు గమనిస్తే విజయం సంపన్న దేశాలకా లేక వర్ధమాన దేశాలకా అన్న విషయం బోధపడుతుంది.

1999లో సియాటిల్‌లో జరిగిన డబ్ల్యు.టి.ఓ. మినిస్టీరియల్ సమావేశాలు విఫలమయ్యాయి. దీనికి ఒక కారణం గత ఒప్పందాల అమలులో అవకతవకలను సరి చెయ్యాలని వర్ధమాన దేశాలు పట్టుబట్టడమే. దీనికి మించిన రెండు ప్రధాన కారణాలున్నాయి. ఒకటి సమావేశాలు జరుగుతున్న వేదిక సమీపంలో వేలాది మంది నిరసన ప్రదర్శనలు జరిపి సమావేశాలు జరగకుండా అడ్డుకోవడం. రెండవది సంపన్న దేశాలు ముఖ్యంగా అమెరికా, ఐరోపా యూనియన్‌ల మధ్య వ్యవసాయ సబ్సిడీలపై ఒక ఒప్పందం కుదరకపోవడం. దోహా మినిస్టీరియల్ సదస్సు ఎట్టి పరిస్థితుల్లోనూ విఫలం కాకూడదన్న పట్టుదలతో సంపన్న దేశాలు సన్నాహాలు చేస్తూ వచ్చాయి. అయితే

దోహా సదస్సు వేదిక



వాటి దృష్టి అంతా తమలో తాము ఎలా రాజీ కుదుర్చుకోవాలన్న దానిపైనే. గత ఉరుగ్వే ఒప్పందం అమలులో అన్యాయానికి గురవుతున్న వర్ధమాన దేశాల సంగతిని అవి ఎంతమాత్రం పట్టించుకోలేదు. గత ఒప్పందం అమలు సంగతి మళ్ళీ లేవనెత్తే ప్రసక్తే లేదు, నాలుగేళ్ళు గడిచిపోయాయి కాబట్టి తాజా రౌండు సంప్రతింపులు ఆరంభించాలని ప్రతిపాదిస్తూ వచ్చాయి.

దోహా సదస్సుకు సన్నాహంగా జరిగిన సమావేశాల్లో భారతదేశం పాత ఒప్పందం అమలు సంగతి తేల్చకుండా తాజా రౌండు చర్చల ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చింది. దోహా సదస్సు ప్రారంభ సమావేశంలో కూడా భారత్ తరపున ప్రసంగించిన మారన్ సంపన్న దేశాల వైఖరిపై నిప్పులు కురిపించారు. డబ్ల్యు.టి.ఓ. అంటే గ్లోబల్ గవర్నమెంటని అనుకుంటున్నారా అని నిలదీశారు. ఈ నెల 9న ఆరంభమైన సమావేశాలు రోజురోజుకూ ప్రతిష్టంభన వైపుకు నడుస్తున్నాయా అని అనిపించింది. సవరణలతో కూడిన పలు ప్రతిపాదనలను మారన్ తిరస్కరిస్తూ

డబ్ల్యు.టి.ఓ.కు వ్యతిరేకంగా 'ప్రజాప్రకటన'

దోహాలో డబ్ల్యు.టి.ఓ. మినిస్టీరియల్ సమావేశాలు ప్రారంభించడానికి ముందు నవంబరు 6వ తేదీన న్యూఢిల్లీలో డబ్ల్యు.టి.ఓ.కు వ్యతిరేకంగా పెద్ద ప్రజా ప్రదర్శన జరిగింది. దీనిలో మాజీ ప్రధానులు వి.పి.సింగ్, దేవెగౌడలతో పాటు సి.పి.ఐ.(ఎం) ప్రధాన కార్యదర్శి హరికిషన్‌సింగ్ సూర్జిత్, సి.పి.ఐ. ప్రధాన కార్యదర్శి ఎ.బి.బర్ధన్‌లతో పాటు ఇతర వామపక్షాల, కార్మిక, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. మేధాపాట్కర్, వందనాశివ లాంటి పర్యావరణ పరిరక్షణ ఉద్యమకారులు కూడా పాల్గొన్నారు. ఈ ప్రదర్శన ఒక 'ప్రజాప్రకటన'ను విడుదల చేసింది. దోహా సదస్సులో గొప్ప విజయాన్ని సాధించానని ప్రభుత్వం చెప్పుకుంటున్న సమయంలో ఆ విజయాల బండారాన్ని బేరీజు వేయడానికి దోహదపడే ఆ ప్రకటనను దిగువ ఇస్తున్నాము. డబ్ల్యు.టి.ఓ. పట్ల ఎటువంటి వైఖరి గైకొనాల్సిందీ ఈ ప్రకటన తెలియచేస్తుంది.

☞ 'తాజా రౌండు' చర్చల ప్రారంభాన్ని గట్టిగా వ్యతిరేకించాలి. తాజా రౌండులో పెట్టుబడులు, పోటీ విధానం 'సామాజిక' క్లాజు, పర్యావరణం, వాణిజ్య అనుసంధానాలు, ఇ-కామర్స్‌తో స్వేచ్ఛా మరియు సుంకాలు లేని వాణిజ్యం, ప్రభుత్వ సేకరణ-లాంటి అంశాలు తాజా రౌండులో చోటు చేసుకోకుండా నిరోధించాలి. మన ఆర్థిక సార్వభౌమాధిపత్యాన్ని రక్షించుకోవాలంటే ఇది తప్పనిసరి. ఇప్పటికే నెలకొని వున్న అసమతుల్యతలు, అసమానతలు మరింత అధ్వానం కాకుండా ఉండేందుకే నూతన అంశాలు, నూతన ఒప్పందాలు జరగకుండా జాగ్రత్తపడాలి. పాత ఒప్పందాల అమలు గురించి మొదట ఆలోచించాలి అన్న వర్ధమాన దేశాల డిమాండుకు మద్దతివ్వాలి. అంతేకాకుండా 'అమలు అజెండా'ను ఉరుగ్వే రౌండు ఒప్పందంలోని అనేక అంశాలకు విస్తరించాలి.

☞ 'నూతన అంశాలు'తో 'నూతన రౌండు' చర్చలు ఆరంభం కాకపోయినప్పటికీ మనం ఆందోళన చెందాల్సిన అంశాలున్నాయి. వ్యవసాయం, సర్వీసులపై సంప్రదింపులు కొనసాగించటం వీటిలో ఒకటి. 1995లో ఉరుగ్వే రౌండు ఒప్పందం అమలులోకి వచ్చినపుడు అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యవసాయ పంటల ధరలు పెరిగి మన ఎగుమతులు బాగా పెరిగిపోతాయని చెప్పారు. కాని ఆ ఆశలు అడియాశలయ్యాయి. పైపెచ్చు మనం దిగుమతులపై పరిమాణాత్మక ఆంక్షలన్నింటినీ తొలగించాము. అత్యధిక సబ్సిడీలతో కారు చౌకగా వచ్చిపడే సంపన్న దేశాల వ్యవసాయ ఎగుమతులతో అసమానమైన పోటీకి ఇది మన వ్యవసాయ రంగాన్ని గురి చేసింది. గరిష్ట దిగుమతి సుంకాలు విధించే అవకాశం కూడా మనం వినియోగించుకోలేక పోతున్నాము. ఇటువంటి అవకాశం కూడా లేకుండా చెయ్యాలని అమెరికా నాయకత్వంలోని సంపన్న దేశాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇదే సమయంలో తమ దేశాల్లో వ్యవసాయ సబ్సిడీలను అనేక పరోక్ష రూపాలలో కొనసాగిస్తున్నాయి. ఈ స్థితిలో మనం వ్యవసాయ దిగుమతులపై నిరాఘాటంగా పరిమాణాత్మక ఆంక్షలు విధించే హక్కును సాధించుకోవాలి. ఇది మనకు వాణిజ్యపరమైన అంశం కాదు. ఇది మన దేశంలోని కోట్లాది ప్రజల జీవన భృతికి సంబంధించిన సమస్య. ఈ హక్కును సాధించుకోవడమే కాకుండా దీనికి డబ్ల్యు.టి.ఓ. ఎటువంటి కాలపరిమితి విధించడాన్ని అంగీకరించకూడదు.

☞ సర్వీసులకు సంబంధించి సర్వీసుల్లో సాధారణ ఒప్పందం (గాట్స్)లో వున్న రక్షణలను సడలించడానికి ఎంతమాత్రం అంగీకరించకూడదు. అంతేకాకుండా శ్రమశక్తి అదనంగా వున్న దేశాల నుంచి శ్రమశక్తి కొరతగా ఉన్న దేశాలకు తరలివెళ్ళే అంశాన్ని సంప్రదింపుల్లో భాగమయ్యేట్లు చూడాలి.

☞ ఈ వైఖరికి వర్ధమాన దేశాల మధ్య సంఘీభావం పునాదిగా కల్గిన రాజకీయ వ్యూహం వెన్నుదన్నుగా ఉండాలి. అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలు రూపుదిద్దుకోవడంలో వర్ధమాన, సంపన్న దేశాల మధ్య విభజనే ప్రధాన పాత్ర వహిస్తుందన్న అంశం మన అవగాహనలో ఉండాలి. మనం వర్ధమాన దేశాలలో భాగమన్న విషయాన్ని ఏ క్షణంలోనూ మరచిపోకూడదు. మన దేశపు పరిమాణం, సహజ వనరులు, మానవ వనరులు సవాళ్ళను తట్టుకోగలిగిన శక్తిరీత్యా వర్ధమాన దేశాలలో మనం విశిష్టమైన స్థానంలో వున్నాము. దీన్ని ఆసరా చేసుకొని మనం ఇతర బలహీన వర్ధమాన దేశాలను కూడగట్టి సమిష్టి స్వావలంబన సాధనకు కృషి చెయ్యాలి. వర్ధమాన దేశాల మధ్య సంఘీభావం పునాది మీద డబ్ల్యు.టి.ఓ.లో మన వ్యూహాన్ని రూపొందించుకున్నపుడు, ఆ సంస్థలో లాంఛనపూర్వకంగా వున్న ప్రజాస్వామిక సూత్రాన్ని శక్తివంతమైన వ్యూహాత్మక ఆయుధంగా మలుచుకోవచ్చు. డబ్ల్యు.టి.ఓ.లో జరిగే దాడిని నిలవరించవచ్చు, త్రిప్పికొట్టొచ్చు.

☞ కొత్త ఒప్పందాలు కుదరకపోవచ్చునని మేం గట్టిగా భావిస్తున్నప్పటికీ, రహస్య అవగాహనలు, ఒప్పందాలు కుదిరే అవకాశం వుందని భయపడుతున్నాము. ప్రభుత్వం తనకున్న కార్యనిర్వహణాధికారం ద్వారా ఒప్పందాలు కుదుర్చుకోకుండా అటువంటి అంశాలపై ముందుగా పార్లమెంట్ ముందు, ఆ అంశాలు రాష్ట్రాల లేదా ఉమ్మడి జాబితాలోనివయితే రాష్ట్ర అసెంబ్లీల ముందు పెట్టి ముందుగా అనుమతి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము.

☞ మన వ్యవసాయ విధానానికి చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కార్మికులు కేంద్ర బిందువుగా ఉండాలని మేము విశ్వసిస్తున్నాము. వారి జీవన భృతికి రక్షణ, జీవన ప్రమాణాల పెంపు, వారి ఆర్థిక, సాంకేతిక సామర్థ్యాన్ని పెంచడం, సాగు చేసే వారి మధ్య భూమిని సమానంగా పంపిణీ చెయ్యడంలాంటి అంశాలే మన విధానాలు ఎంతటి విలువైనవో రుజువు చేస్తాయి. అంతేకాని కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయ ఎగుమతులను ఇబ్బడి ముబ్బడిగా పెంచామని చెప్పుకుంటే అది వ్యూహాజనిత విజయమే అవుతుంది.

☞ మన ఆర్థిక విధానాల లక్ష్యం పని చేసే హక్కును కల్పించడం, అంతర్జాతీయ పోటీ వ్యామోహంలోపడి కొట్టుకుపోకుండా ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగడంగా ఉండాలి. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు మనకున్న భౌతిక, మేధా, సాంకేతిక, ఆర్థిక వనరులే తగిన పునాదిని కల్పిస్తాయని మేము విశ్వసిస్తున్నాము. మన అభివృద్ధి, సంక్షేమం భారీగా వచ్చిపడే విదేశీ పెట్టుబడులతో సాధ్యమవుతుందన్న నమ్మకం అనవసరం, అవాంఛనీయం.

☞ డబ్ల్యు.టి.ఓ. అమలు పరుస్తున్న ప్రపంచీకరణ ప్రక్రియ స్వభావరీత్యానే ప్రజాస్వామ్య వ్యతిరేకమైనది. ఇది మన దేశ సమగ్రతనే ప్రమాదంలో పడవేస్తుంది. దీనిని సంపన్న వర్గాలు, మతతత్వ శక్తులు, పెట్టుబడిదారీ శక్తులు బలపరుస్తున్నాయి. అధికారంలో వున్న వారు దీనిని ముందుకు సాగిస్తే ఫాసిస్టు శక్తులు తలెత్తడానికి అవకాశమేర్పడుతుంది. అందువల్ల ప్రపంచీకరణను ప్రతిఘటించడం, ఓడించడమే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి, ముందుకు తీసుకు వెళ్ళడానికి అత్యవసరమని మేము విశ్వసిస్తున్నాము.

☞ ఈ కర్తవ్య సాధనలో మెజారిటీ కష్టజీవులు, ముఖ్యంగా మహిళలు, దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన తరగతుల వారు, మైనారిటీ మతాల వారు, రైతులు, కార్మికులు, కుటీర, చిన్నతరహా పరిశ్రమల్లో పని చేసే వారు, స్వయం ఉపాధి పొందేవారు నిర్ణయాత్మక పాత్ర వహించాలి.

☞ లక్ష్యాన్ని చేరుకునేంతవరకు నిర్విరామ పోరాటం చేస్తామని ప్రతిన బూనుతున్నాము.

వచ్చారు. సమావేశాల్లో భారత ప్రతినిధి బృందం నాయకుని పట్ల విదేశీ మీడియా కూడా ఆసక్తికనపరచ సాగింది. సియాటిల్ సదస్సుకు పట్టిన గతే దోహా సదస్సుకూ పడుతుందా అన్న వార్తలు కూడా వచ్చాయి. షెడ్యూలు ప్రకారం 15వ తేదీన ముగియవలసిన చర్చలు అసాధారణమైన రీతిలో పొడిగించబడ్డాయి. ఆ తర్వాత 'గ్రీన్‌రూం' మంతనాలు ఊపందుకున్నాయి. డబ్ల్యుటిఓ నిబంధనల ప్రకారం సభ్య దేశాలన్నింటికీ సమాన హోదా ఉంటుంది. కాని కీలకమైన లేదంటే పెత్తందారీ దేశాలు తమలో తాము ఒక నిర్ణయానికి రావడానికి తన నిర్ణయాన్ని అంగీకరించని వారిని బలవంతంగా ఒప్పించడానికి ఉపయోగించే ప్రదేశానికి ముద్దు పేరే 'గ్రీన్‌రూం'. దోహాలో 'గ్రీన్‌రూం' వ్యవహారాలను నడిపింది ప్రధానంగా నలుగురు. వారు అమెరికా వాణిజ్య ప్రతినిధి రాబర్ట్ జోలిక్, ఐరోపా యూనియన్ వాణిజ్య కమిషనర్ పాస్కల్ లామీ, డబ్ల్యు.టి.ఓ. డైరెక్టర్ జనరల్ మైక్‌మూర్, ఖతార్ ఆర్థిక మంత్రి వాణిజ్య మంత్రి యూసఫ్ హుసేనీ కామల్. మారన్‌ను ఒప్పించడానికి జరిగిన ప్రయత్నాలను భారత ప్రతినిధి బృందంలోని అధికారి ఒకరు వెల్లడించారు. మొండికేస్తున్న దేశాల ప్రతినిధులను వీరు నల్గురూ ఒకరి తర్వాత మరొకరిని రప్పించుకొని 'గ్రీన్‌రూం'లో మాట్లాడారు. మైక్‌మూర్ బస చేసిన షెరటన్ హోటల్ సూట్ 'గ్రీన్‌రూం'గా మారింది. అందరూ దారికొచ్చారు గాని, మారన్ అంగీకరించ లేదట. ఆ తర్వాత మరోసారి ఈ నల్గురూ మారన్‌తో మాట్లాడారట. భారత ప్రధాని వాజ్‌పేయితో, అమెరికా అధ్యక్షుడు బుష్‌చేత మాట్లాడిస్తామని కూడా చెప్పారట. అయినా మారన్ దారికిరాలేదట. నవంబర్ 14వ తేదీ ఉదయం 7 గంటలకు మారన్ బస చేసి చోటికి ఖాతర్ ఆర్థికమంత్రి వచ్చి మంతనాలు జరిపారు. ఆ మంతనాలలో ఏ రాజీ కుదిరిందో కాని భారత్ చివరికి ఒప్పేసుకున్నది.

'గ్రీన్‌రూం' తంతును దోహా సదస్సును కవర్ చేసిన 'హిందూ' పత్రిక ప్రతినిధి రామమనోహర్ రెడ్డి కూడా చక్కగా వివరించారు. "నవంబర్ 13వ తేదీ అంటే షెడ్యూలు ప్రకారం చివరి రోజు. కాని సంప్రతింపులు కొలిక్కి వచ్చేట్లు కనిపించకపోవడంతో 20 దేశాల వాణిజ్య మంత్రులతో ఐరోపా యూనియన్, అమెరికా, మైక్‌మూర్‌లు విడిగా సమావేశమయ్యారు.. ఈ సమావేశం సాయంత్రం 6 గంటల నుండి తెల్లవారుఝాము 3 గంటల వరకు ఏకధాటిగా కొనసాగింది. ఇతర దేశాల ప్రతినిధులెవ్వరినీ ఆ ఛాయలకు కూడా అనుమతించలేదు. ఉగాండా ప్రతినిధి ఒకరు ఆ సమావేశం లోపలికి ప్రవేశించపోతే నిర్మొహమాటంగా బయటికి వెళ్ళమని చెప్పారు. లోపల వున్న మంత్రులకే చెందిన ఒక అధికారి తమ మంత్రిని కలుసుకుంటానన్నా అంగీకరించలేదు" ఈ 20 మంది దేశాల మంత్రుల మధ్య, వారిలో కూడా కొందరితో విడివిడిగాను జరిపిన సమావేశాల ఫలితంగా చివరికి అంగీకారం లేదంటే రాజీ కుదిరింది. మొత్తం 143 దేశాల ప్రతినిధులు డబ్ల్యు.టి.ఓ. లో ఉంటే చివరికి ఫలితాన్ని తేల్చింది కేవలం 20 దేశాలే. డబ్ల్యు.టి.ఓ.లో ప్రజాస్వామ్యానికి ఇదే చక్కటి నిదర్శనం.

భారతదేశం విజయంగా చెప్పుకుంటున్న అంశాలేమిటి? పెట్టుబడులు, పోటీ, ప్రభుత్వ సేకరణ, వాణిజ్య సదుపాయాలు అన్న నాలుగు అంశాలపై మరో రెండేళ్ళపాటు చర్చలు జరిగేలా చేయకలిగింది. అయితే వీటిని రెండేళ్ళలోగా తేల్చుకోవాలి. లేకపోతే ఆ అంశాలు కూడా భాగంగా తాజా రౌండు చర్చలు ఆరంభమవుతాయి. ఈ రెండేళ్ళలో ఈ అంశాలు పరిష్కారమవుతాయన్న గ్యారంటీ లేదు. పరిష్కారం లభించినా, లభించకపోయినా తాజారౌండు చర్చలు ఆరంభమవుతాయి. భారత్‌తోసహా వర్ధమాన దేశాలు డిమాండ్ చేస్తున్న గత ఒప్పందం అమలు గురించి ఖచ్చితమైన పరిష్కారం లభించలేదు. కాని సంపన్న దేశాలు కోరుకుంటున్నట్లు తాజా రౌండు చర్చలు మాత్రం గ్యారంటీగా రెండేళ్ళలో ఆరంభమవుతాయి. అంటే ఇంకా అనేక రంగాలలోకి సరళీకరణ విస్తరించబడి డబ్ల్యు.టి.ఓ. పేరుతో సంపన్న దేశాలదోపిడీ తీవ్రమవుతుంది. కంపల్సరీ లైసెన్సింగ్ విధానం నుండి ఎయిడ్స్ ఔషధాలకే కాకుండా, మలేరియా, క్షయ లాంటి వ్యాధులకూ ఔషధాలను తయారు చేసుకోవడానికి లభించిన అవకాశమూ ఇటువంటిదే. ఈ అవకాశం కేవలం 2005 వరకు మాత్రమే కొనసాగుతుంది. ఐరోపా యూనియన్, అమెరికాలు, టెక్స్‌టైల్స్ దిగుమతులపై కోటాల పద్ధతిని ఎత్తివేయాలి లేదా కోటాలను పెంచాలన్న విషయంలోనూ భారత్ తన మాట నెగ్గించుకోలేకపోయింది. సంపన్న దేశాలు రకరకాల పేర్లతో కొనసాగిస్తున్న వ్యవసాయ సబ్సిడీలను దశల వారీగా ఎత్తివేస్తామన్న హామీని పొందకలిగామని భారత్ చెబుతున్నది కాని దానికి సంబంధించి పర్యావరణ పేరుతో సంపన్న దేశాల బడుగు దేశాల దిగుమతులపై ఆంక్షలు విధించడానికి అంగీకరించింది. మారన్ సాధించినట్లు చెబుతున్న ప్లాటినం, బంగారు పతకాల బండారం ఇది. నిజానికి ఇది సంపన్న దేశాలకు లొంగుబాటు మాత్రమే.

భారత్ వైఫల్యానికి ప్రధాన కారణం గత మూడేళ్ళుగా వాజ్‌పేయి ప్రభుత్వం అనుసరిస్తున్న అమెరికా అనుకూల, సామ్రాజ్యవాద అనుకూల విదేశాంగ విధానమే. పైకి ఎన్ని మాటలు చెప్పినప్పటికీ చివరికి సంపన్న దేశాలకు భారత్ లొంగిపోతుందని ఇతర వర్ధమాన దేశాలు సహజంగానే భావించాయి. వాటిలో విశ్వాసం కల్పించడానికి భారత్ తగినంత ముందుగా, సరియైన పద్ధతిలో ప్రయత్నాలు చెయ్యలేదు. ఇప్పటికయినా వర్ధమాన దేశాలను సమీకరించి లభించిన రెండేళ్ళ వ్యవధిలోనైనా సమస్యలను పరిష్కరించుకోవడానికి భారత్ ప్రయత్నించాలి. ప్రస్తుత ధోరణిని గమనిస్తే అటువంటి ఆశలు కలగవు.

దోహా సదస్సులో సియాటిల్ అంతటి తీవ్ర స్థాయిలో కాకపోయినప్పటికీ డబ్ల్యు.టి.ఓ. వ్యతిరేక ప్రదర్శనలు జరగటాన్ని ఈ సందర్భంగా పేర్కొనాలి. భారతదేశానికి చెందిన ప్రముఖ పర్యావరణవేత్త మందనా శివ నాయకత్వాన ఒక బృందం దోహాకెళ్ళి నిరసన వ్యక్తం చేయడం విశేషం. ★

చైనా ప్రవేశం ఫలితం ఎలా ఉంటుంది ?

దోహా సమావేశాల్లో ఒక ప్రధాన పరిణామం డబ్ల్యు.టి.ఓ.లో చైనా సభ్యత్వాన్ని లాంఛన పూర్వకంగా ప్రకటించడం. పదిహేనేళ్ళుగా చైనా ఈ సంస్థలో సభ్యత్వం కోసం ప్రయత్నం చేస్తున్నది. సంపన్న దేశాలు ముఖ్యంగా అమెరికా ఇంతకాలం చైనా సభ్యత్వానికి జాప్యం చేస్తూ వస్తున్నాయి. ఒక వైపున భారత్‌తో సహా ఇతర వర్ధమాన దేశాలను డబ్ల్యు.టి.ఓ.లో చేరమని తెగ బలవంతం చేసిన సంపన్న దేశాలు చైనా విషయంలో ఎందుకు ఇలా వ్యవహరించాయి? వర్ధమాన దేశాలు చేరితే కలిగే లాభం చైనా చేరితే ఉండక పోవడమే దీనికి కారణం. ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ చైనాది. అందువల్ల ఈసంస్థలో చేరడం వల్ల ఆదేశానికి లాభాలూ ఇదే మోతాదులో ఉంటాయని పరిశీలకులు భావిస్తున్నారు. 2010 నాటికల్లా చైనా స్థూల జాతీయ ఉత్పత్తి ఈ సభ్యత్వం ఫలితంగా 3 నుండి 5 శాతం వరకు పెరుగుతుందని అంచనా. విదేశీ వాణిజ్యం రెట్టింపవుతుందని, లక్షల సంఖ్యలో కొత్త ఉద్యోగాలు కల్పించబడతాయని భావిస్తున్నారు. ప్రస్తుతం చైనాలో ఎగుమతుల కోసమే ఉత్పత్తి చేసే కంపెనీల ఎగుమతులు చైనా మొత్తం ఎగుమతుల్లో సగం ఉంటున్నాయి. డబ్ల్యు.టి.ఓ.లో సభ్యత్వం తర్వాత మరిన్ని విదేశీ కంపెనీలు చైనాలో ఉత్పత్తిని ఆరంభించడం ద్వారా ఈ తరహా ఎగుమతులు మరింత పెరుగుతాయని చైనా ఆశిస్తున్నది. విదేశీ పెట్టుబడులు కూడా ఇప్పటికన్నా బాగా పెరుగుతాయని భావిస్తున్నారు. 2005 నాటికల్లా చైనాకు విదేశీ పెట్టుబడులు ఏడాదికి పదివేల డాలర్లకు పెరుగుతాయని హాంకాంగ్ బ్యాంకర్లు అంచనా వేస్తున్నారు. చైనా డబ్ల్యు.టి.ఓ.లో ప్రవేశించడం పట్ల ఆగ్నేయాసియా దేశాలు ముఖ్యంగా మాజీ ఆసియా టైగర్లు తెగ భయపడిపోతున్నాయి. పదేళ్ళక్రితం ఆగ్నేయాసియాకు లభించే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో చైనాకు కేవలం నాలుగో వంతు మాత్రమే లభించేవి. ఇప్పుడు చైనాకు లభించే పెట్టుబడుల్లో 20 శాతం మాత్రమే ఈ ప్రాంతానికి లభిస్తున్నాయి. ఇప్పటికే సంక్షోభంలో పడిపోయిన దక్షిణ కొరియా ఇప్పుడు మరింతగా భయపడిపోతున్నది. టోక్యో స్టాక్ ఎక్చేంజ్‌లో నమోదయిన కంపెనీల్లో సగం రానున్న మూడేళ్ళలో తమ ఉత్పత్తి సదుపాయాలను చైనాకు తరలిస్తాయని కూడా భావిస్తున్నారు. ఇక మీదట ఆగ్నేయాసియా ఉత్పత్తి కార్యకలాపాల కన్నా చైనా నుండి వచ్చే పర్యాటకులమీద దృష్టి మళ్ళించడం మెరుగని ప్రపంచ ప్రఖ్యాత మార్కెట్ గురు మార్క్ ఫేబర్ అన్నాడంటే చైనా డబ్ల్యు.టి.ఓ. ప్రవేశం వారిని ఎంతగా హడలెత్తిస్తున్నదీ అర్థం చేసుకోవచ్చు. డబ్ల్యు.టి.ఓ.లో ప్రవేశించడం వల్ల పారిశ్రామికరంగంలో తాను లాభపడ్డప్పటికీ వ్యవసాయ రంగంలో కొంత ప్రతికూల ఫలితాలు ఉంటాయని చైనా అభిప్రాయపడుతున్నది. మిగతా దేశాల సంగతి సరే మరి భారతదేశం మాటేమిటి? మనకు లాభమా, నష్టమా? చైనాకు వ్యవసాయసరుకులను ఎగుమతి చేయవచ్చునని, టెలికాం, ఆటోమొబైల్స్, టెక్స్‌టైల్స్ తదితర రంగాలలో ప్రవేశించగలనని భారత్ ఆశపడుతున్నది. కానీ అదరగండంతో ఏదో విధంగా సబ్సిడీలను కొనసాగిస్తున్న సంపన్న దేశాలు మనకు అవకాశం ఇస్తాయా అన్నది ప్రశ్న. డబ్ల్యు.టి.ఓ.కు సంబంధించి ఒక్క విషయంలో మాత్రం చైనాకు, భారత్ కు తేడా కొట్టొచ్చినట్లు కనపడుతున్నది. డబ్ల్యు.టి.ఓ.లో ప్రవేశించడానికి ముందే చైనా తనను తాను అన్ని విధాలా సమాయత్త పరుచుకున్నది. భారతదేశం మాత్రం హడావిడిగా చేరిపోయి అనేక విధాలుగా నష్టపోయింది.

చెవి వ్యాధులు నివారణ

డా॥ వందన

చెవి వ్యాధిగ్రస్థం అయినపుడు ఆ చెవిలో నీళ్ళు గానీ, నూనె గాని పడకుండా జాగ్రత్త పడాలి. స్నానం చేసేటపుడూ, మొహం కడుక్కునేటపుడూ చెవిలో దూది పెట్టుకోవాలి. కొన్నాళ్ళపాటు ఈత కొట్టడం మానేయాలి.

మధ్య చెవి చీముపడితే అది క్రమేణా దీర్ఘకాలిక వ్యాధిగా పరిణమించటానికి చాలా కారణాలున్నాయి. చికిత్సను సమగ్రంగా చేయించుకోకపోవటం, చెవిని జాగ్రత్తగా శుభ్రం చేయించుకోకపోవటం, ముక్కు-గొంతు తరచుగా వ్యాధిగ్రస్తం అవడం కూడా ఇందుకు కారణాలే.

దీర్ఘకాలిక వ్యాధిగా పరిణమించే మధ్య చెవి వ్యాధుల వలన చాలా ఇబ్బందులున్నాయి. ఇందువలన చెవి నుంచి నిరంతరం చీముకారుతూ చెడువాసన వస్తుంటుంది. వినికిడి శక్తి క్రమేణా తగ్గిపోతుంది. మధ్య చెవిలోని చీము పరిసర ప్రాంతాలకూ, మెదడుకూ, రక్తనాళాలకు పాకి ఒకోసారి ప్రాణహాని జరిగే అవకాశం కూడా వుంది.

మూడు సంవత్సరాలలోపు చిన్న పిల్లల్లో ఇలా చీము రెండు చెవులలో నుండీ కాలం పాటు వచ్చే పక్షంలో వారికి రెండు చెవుల గ్రహణ శక్తి కొరవడుతుంది. ఫలితంగా మాట్లాడే సామర్థ్యం కూడా అభివృద్ధి చెందదు.

మధ్య చెవిలో నుంచి చీము కారుతున్న వారికి రకరకాల చికిత్సలున్నాయి. ముక్కు, గొంతు జబ్బులకు చికిత్స కాకుండా చెవికి సైతం కూడా రకరకాల చికిత్సలు చేయవలసి రావచ్చు. ఒక్కోసారి చెవి నుండి దెబ్బతిన్న భాగాలను, ఎముకలను తొలగించవలసి వుంటుంది. మధ్య చెవికి వినిపించే శక్తిని పెంపొందించటానికి ఆ చెవికి రకరకాల ప్లాస్టిక్ సర్జరీతో మధ్య చెవికి ఉపయోగకరంగా వినియోగింప చేయవచ్చు.

గుండె మార్పిడి చికిత్సలో వలెనే చెవి విషయంలో కూడా చనిపోతున్న వ్యక్తుల కర్ణభేరిని గాని, మధ్య చెవిలో వుండే సన్నని ఎముకలను గాని అవసరాన్ని బట్టి తీసి రోగికి అమర్చవచ్చు.

మధ్య చెవికి చేసే శస్త్రచికిత్సను 'మాస్టాయి డెక్టమీ' ఆపరేషన్ అంటారు. మధ్య చెవికి వినిపించే శక్తిని వృద్ధి చేసేందుకు జరిపే ప్లాస్టిక్ సర్జరీలను 'టిపనో ప్లాస్టీ' ఆపరేషన్లు అంటారు.

బయట చెవి వెనుక భాగంలో ఎత్తయిన ఎముక ఉంటుంది. ఈ ఎముకను మాస్టాయిడ్ ఎముక అని పిలుస్తారు. ఇది మహిళల వక్షస్థలంలా ఎత్తుగా వుంటుంది. నిజానికి ఈ కారణం వలననే దీనికాపేరు వచ్చింది. మధ్య చెవి వ్యాధిగ్రస్థం అయినపుడు చీము పరిసర ప్రాంతాల అవయవాలకు సహజంగానే ప్రాకుతుంది. ఎక్కువగా బయటి చెవి వెనుక భాగంలో వున్న మాస్టాయిడ్ ఎముకకే ఆ చీము చేరుతూ వుంటుంది. ఫలితంగా బయటి చెవి ముందుకు, ప్రక్కకు వాలిపోయి ఒక్కోసారి ఈ వాపు చెవి ముందు కూడా కనిపిస్తుంది. ఈ జబ్బు వలన కనురెప్పలు సైతం వాచిపోయే అవకాశం వుంది. ఈ వ్యాధినే 'మాస్టాయి డైటిస్' అంటారు.

ఈ వ్యాధి సోకినపుడు చెవినుండి ఎక్కువగా చీము కారుతుంది. వినికిడి శక్తి బాగా క్షీణిస్తుంది. జ్వరం వచ్చి నాడి వేగంగా కొట్టుకొంటుంది. ఈ సందర్భంలో ఎక్సరే పరీక్షలు ఎంతో ఉపయుక్తంగా వుంటాయి. ఎక్సరేల వలన ఎముక ఎంత అనారోగ్యానికి గురయినదీ తెలుసుకోవచ్చు.

ఈ వ్యాధి ప్రథమ దశలో యాంటీబయోటిక్ ఉపయోగకారిగా వుంటాయి. ఎముక క్షీణించి చీము ఎక్కువయ్యే దశలో శస్త్ర చికిత్సే శరణ్యం. మొదట ఆ చీమును చిన్న ఆపరేషన్ ద్వారా తీసివేసి, తర్వాత కొద్ది రోజులకు చెడిపోయిన ఎముకను, మాంసాన్ని తొలగిస్తారు.



ఈ ఆపరేషన్‌నే 'సింపుల్ మాస్టాయిడ్ డెక్టమీ' అంటారు.

చెవిలో బాంబు

మధ్య చెవి వ్యాధిగ్రస్థం అయితే, కేవలం మాస్టాయిడ్ ఎముక క్షీణించటంతోనే ఆగిపోదు. మధ్య చెవిలో చెడు మాంసం కూడా ఏర్పడుతుంది. మధ్య చెవిలో వున్న ఎముక సైతం వ్యాధిగ్రస్థం అవుతుంది. ఒకోసారి మధ్య చెవిలో వున్న ఎముక సైతం వ్యాధిగ్రస్థ అవుతుంది. ఒకోసారి మధ్య చెవిలో వున్న నరం దెబ్బతిని మూతి వంకర పోవచ్చు కూడా. ఈ వ్యాధినే 'కొలస్టియటోమా' అంటారు. ఇలాంటి వారి చెవి నుండి వెలువడే చీము దుర్వాసన కొడుతూ భరించలేనిదిగా వుంటుంది. చీముతో పాటు లైనింగ్ తాలూకు సన్నని తునకలు కూడా మధ్య చెవి నుండి బయటకు వస్తుంటాయి.

ఇది చాలా ప్రమాదకరమైన జబ్బు. దీనిని అశ్రద్ధ చేయటం అంటే చెవిలో డైనమైట్‌ను పెట్టుకుని నిర్లక్ష్యం చేస్తున్నట్లే లెక్క. ఈ వ్యాధి గల వారు ఏ క్షణంలోనైనా ప్రమాదాన్నెదుర్కోవలసి వస్తుంది.

ఈ వ్యాధికి మందులు వాడటం వలన ఏ మాత్రం ఉపయోగం వుండదు. శస్త్ర చికిత్స ఒకటే దీనికి శరణ్యం. శస్త్ర చికిత్సలో మాస్టాయిడ్ ఎముక మీద ఆపరేషన్ కాకుండా మధ్య చెవిలో వున్న చెడుమాంసం, క్షీణించిపోయిన ఎముక దుర్గంధ పూరితంగా వున్న కొలస్టియా టోమా పదార్థం తీసివేయాలని, ఆ విధంగా మధ్య చెవినీ, మాస్టాయిడ్ ప్రాంతాన్నీ ఆరోగ్యవంతంగా వుండేలా చూడాలి.

ఇలాంటి ఆపరేషన్‌ను 'రాడికల్ మాస్టాయిడ్ డెక్టమీ' అంటారు.

వ్యాధి గనుక కొన్ని ప్రాంతాలకే పరిమితం అయి వుంటే, ఇదే ఆపరేషన్‌ను ఆ ప్రాంతాల్లోనే చేస్తూ చీము తీసివేయవలసి వుంటుంది. మధ్య చెవి చీముపట్టి వ్యాధిగ్రస్థమయినపుడు చేసే ఆపరేషన్ ముఖ్యోద్దేశం వ్యాధిగ్రస్థమయిన చెవి వల్ల ప్రాణాపాయం కలగకుండా నివారించటం, చెవి నుండి చీము కారకుండా చూడటం, వినికిడి శక్తి క్షీణించకుండా చేయటం, తగ్గిపోయిన వినికిడి శక్తిని పునః ప్రతిష్ఠించటం.

మధ్య చెవి గనుక వ్యాధిగ్రస్థమై చెవిలో చప్పుళ్ళు రావటం, వాంతులు, జ్వరం, కళ్ళు తిరగటం వంటి లక్షణాలు పొడచూపితే మెదడుకు సంబంధించిన నిపుణులకు కూడా చూపటం మంచిది. మధ్య చెవినుండి చీము, రక్తం వస్తే నొప్పి కూడా బాగా వున్న పక్షంలోనూ, పెద్ద వయసు వారిలో నిద్ర పట్టక ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడినపుడూ ఈ లక్షణాల్ని మధ్య చెవికి కాన్సర్ సోకటంగా గ్రహించాల్సి వుంటుంది. అలా మధ్య చెవికి కాన్సర్ సోకినపుడు చీము, రక్తంతో పాటు చెడు మాంసం కూడా ఏర్పడుతూ వుంటుంది. క్రమేణా చెవిలో విపరీతమైన నొప్పి, తల తిప్పుట, వాంతులు సంభవిస్తాయి. ఇవి వ్యాధి లోపలి చెవికి కూడా సోకాయనేందుకు సూచనలే. ఈ సమయంలోనే ముఖనరం దెబ్బతిని మూతి వంకర తిరిగే అవకాశం వుంది. కాన్సర్‌గా అనుమానం కలిగితే వెంటనే చెవిలో వున్న చెడు మాంసాన్ని కొంచెం తీసి పరీక్ష చేయించాలి. ఆ తర్వాత పరిస్థితిని బట్టి ఆపరేషన్ ద్వారాగానీ, రేడియో థెరపీ ద్వారా కాని తగు చికిత్స చేయించాలి.

మధ్య చెవికి సంబంధించిన మరో జబ్బు 'ఓటోస్క్లిరోసిస్' ఈ వ్యాధి పాశ్చాత్యులలో ఎక్కువగా కనిపిస్తుంది. ప్రత్యేకించి స్త్రీలలోనూ, అందునా ఒకే కుటుంబానికి చెందిన వారిలోనూ అధికంగా కనపడుతుందీ వ్యాధి. ఈ వ్యాధి ఆడపిల్లలు రజస్వల అయిన తరుణంలో ప్రారంభమై క్రమంగా పెరుగుతూ, ఆ వ్యక్తికి ఏమైనా ఇతర జబ్బులు సోకినపుడు ఈ జబ్బు ఎక్కువవుతుంది. ఆ వ్యాధి వలన మధ్య చెవికీ, లోపలి చెవికీ సంబంధించిన ఎముకలో కొంతభాగం మార్పు చెంది, దానికి బదులు రక్తం ఎక్కువగా వున్న కొత్త ఎముక ఏర్పడుతుంది. ఇలా కొత్తగా ఏర్పడిన ఎముక కాలక్రమాన గట్టి పడుతుంది.

ఈ పరిణామం క్రమంగా శబ్దం లోపలి చెవికి పోకుండా అవరోధం ఏర్పడుతుంది. ఇలాంటి జబ్బున్న వ్యక్తులకు వినిపించకపోవటం, అప్పుడప్పుడూ రెండు చెవుల్లో శబ్దాలు రావటం, స్వరం బలహీనంగా వుండటం జరుగుతుంది. పెద్ద శబ్దం మాత్రమే వినగలుగుతారు.

ఈ వ్యాధి గల స్త్రీలకు రెండు రకాల ఇబ్బందులు ఎదురవుతాయి. మొదటిది ప్రతి ప్రసవంతోనూ ఈ వ్యాధి అధికమవుతుంది. రెండవది పుట్టబోయే బిడ్డకు కూడా వ్యాధి సంక్రమించవచ్చును. ఇందువలన ఒకోసారి గర్భనిరోధక పద్ధతులు అనుసరించవలసి వుంటుంది.. ఆ విధంగా వ్యాధి బిడ్డకు సంక్రమించకుండా నిరోధించవచ్చు.

★



నాకు గ్యాస్ ట్రబుల్ ఉంది. కనుక ఎలాంటి మందులు వాడాలో, ఏ ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేయగలరు?

– ఎం.మధు, కుమ్మరివానిపల్లి

మీరు కారం, మసాలా వాడకుండా టైంప్రకారం ఆహారం తీసుకోవాలి. ఎక్కువసేపు నిద్రమేలుకోకుండావుండాలి. ప్రతి మూడుగంటలకొకసారి ఏదైనా స్నాక్స్ తీసుకోవడం మంచిది. మానసిక వత్తిడిలేకుండా తీసుకోవాలి. డైజిన్, రాంటడిన్ మాత్రలువాడాలి.

నేను ఎంత తిన్నా సన్నగానే ఉంటున్నాను. లావెక్కడానికి ఏం చేయాలి?

కె.నరేష్, విశాఖ

ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఒక గ్లాసుపాలు తీసుకోవాలి. మానసిక వత్తిడిలేకుండా చూసుకోవాలి. పౌష్టికాహారం తీసుకోవాలి. మూడునెలల తరువాత మార్పురాకుండావుంటే హార్మోన్‌టెస్ట్‌చేయించుకోవాలి.

నేను 9వ తరగతి చదువుతున్నాను. వయస్సు 14 సం॥లు. నేను విపరీతమైన తలనొప్పితో బాధపడుతున్నాను. నాలుగు సంవత్సరాలు కళ్ళజోడు వాడినా ఫలితం లేదు. మాది బీద కుటుంబం కనుక అమ్మా, నాన్నా పట్టించుకోవడం లేదు. ఏం కాదూ! అదే తగ్గుతుందిలే అంటున్నారు. నొప్పితో నాకు చనిపోవాలనిపిస్తోంది. దయచేసి తలనొప్పి తగ్గే మార్గం చెప్పండి.

– జె.కమల, మహబూబ్‌నగర్

తలనొప్పికి చాలా కారణాలువున్నాయి. కావున మీకు అందుబాటులోవున్న వైద్యుడిని సంప్రదించి తగిన వైద్యం చేయించుకోగలరు.

మా అమ్మా నాన్నలు మేనత్త, మేనమామ పిల్లలు. మా అక్కను మా మేనమామకు ఇచ్చారు. మా అక్క కొడుక్కి మా అన్నయ్య కూతురిని చేసుకోవచ్చా.. ఏమైనా సమస్యలుంటాయా?

– ఎన్.అరుణ, నర్సరావుపేట

మీరు చెప్పిన దానినిబట్టి మేనరికం చేసుకోకూడదు. జన్యువరంగా అనేక సమస్యలువస్తాయి. అంగవైకల్యం మొదలగునవి రావచ్చు.

డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు,
ఎంబిబిఎస్, ఎఫ్‌సిజిపి
సమతా నర్సింగ్‌హోమ్, నెల్లూరు.

ఇచ్చినవాడు... తీసుకున్నవాడు...

అంపశయ్య నవీన్

నేనూ, శ్రీనివాసరావు మా యింట్లో డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాము. శ్రీనివాసరావు కబుర్లు చాలా బాగా చెబుతాడు ఇంతలో హల్లో శ్రీనివాసరావుగారూ అంటూ వచ్చాడు హనుమంతరావు అనే ఆయన.

"హల్లో హనుమంతరావ్! నువ్వెప్పుడొచ్చావ్ ఈ వూరు'' అన్నాడు శ్రీనివాసరావు లేచి నిల్చొని హనుమంతరావును ఆప్యాయంగా కౌగిలించుకుంటూ

"నేను ఓ అరగంట ముందే బస్సు దిగి ఆటో మాట్లాడుకొని చక్కగా మీ ఇంటికి వెళ్ళాను... మీరేమో ఈ రచయిత గారింటికెళ్ళావని, వెంటనే వెళ్తే వాళ్లింట్లో వుంటారని మీ ఆవిడ చెప్పారు... రచయితగారి ఇంటి అడ్రసు చెప్పి ఈజీగా దొరుకుతుందని కూడా చెప్పారు... అదే ఆటోలో ఇక్కడ కొచ్చేశాను... మీ ఇల్లు చాలా ఈజీగా దొరికిందండీ!" అన్నాడాయన నాకేసి కృతజ్ఞతాపూర్వకంగా చూస్తూ...

"వాట్ ఎ ప్లెజెంట్ సర్‌ప్రైజ్! నిన్నింత కాలానికి కలుసుకోవడం ఎంత హాయిగా ఉందో.. ఏమిటి విశేషాలు?" అన్నాడు శ్రీనివాసరావు.

"విశేషాలకేమిటి? చాలానే వున్నాయి... మీతో అర్జెంట్‌గా ఓ విషయం మాట్లాడాలి.... మీ ఇంటికెళ్ళి మాట్లాడుకుందామా?" అన్నాడు హనుమంతరావు.

"మాఇంటికెళ్ళడం దేనికి? ఇక్కడే మాట్లాడుకుందాం. రచయితగారు నాకు చాలా ఆత్మీయుడు.. ఆయన దగ్గర నాకు దాపరికాలేం లేవు... మనం ఫ్రీగా మాట్లాడుకోవచ్చు... విషయమేమిటో చెప్పు" అన్నాడు శ్రీనివాసరావు.

"నా పరిస్థితేం బాగా లేదు శ్రీనివాసరావుగారు.. అప్పట్లో నేనో ఫైనాన్స్ కంపెనీ స్టార్ట్ చేసిన విషయం తెలుసుకదా... కొంతకాలం బాగానే నడిచింది.... ఫైనాన్స్ కంపెనీ అంటే మీకు తెలుసు కదా... ఒకచోట డబ్బు తీసుకురావడం.. దాన్ని ఇంకోచోట ఇవ్వడం.. మనం తెచ్చిన చోట ఇచ్చే వడ్డీ కంటే మనం ఇచ్చిన చోట తీసుకునే వడ్డీ కొంచెం ఎక్కువుంటుంది. అదే మన లాభం... పెద్ద పెద్ద బ్యాంకులు చేసే పని కూడా ఇదే కదా... నేనంటే మా ఊర్లోనూ, మా చుట్టు పక్కలున్న ఊళ్లల్లోను కాస్త మంచి అభిప్రాయమే ఉండేది... నా మీద నమ్మకంతోటే నాకు చాలా మంది డబ్బులిచ్చారు. దాన్ని నేను వేరేవాళ్ళకిస్తుండే వాణ్ణి. అట్లా తీసుకున్న వాళ్ళు నెలనెలా వాయిదాల పద్ధతిలో చెల్లిస్తుండేవాళ్లు... నేను ఎవరి దగ్గరైతే తెచ్చానో వాళ్లకు నెలనెలా ఇస్తుండేవాణ్ణి... ఇలా కొంతకాలం మా ఫైనాన్స్ కంపెనీ బాగానే నడిచింది... కానీ అకస్మాత్తుగా నా దగ్గర డబ్బు తీసుకున్న వాళ్ళకేమయిందో తెలీదు... చాలా మంది ఇవ్వడం మానేశారు.. కొందరేమో రేపుమాపు అంటూ వాయిదాలు పెట్టడం.. కొందరేమో అసలు కనపడకుండా పోవడం... దాంతో నెలనెలా చేతికందాల్సిన డబ్బు అందకపోవడం.. నేను ఇవ్వాల్సిన వాళ్ళకు ఇవ్వలేకపోవడం... నాకిచ్చిన వాళ్ళకందరికీ నా మీద ఇదివరకున్న నమ్మకం పోవడం... దాంతో ఇప్పుడిప్పుడే మాకు డబ్బు అవసరం లేదు.. నెలనెలా వడ్డీ ఇస్తే చాలు అన్నవాళ్లు కూడా నా దగ్గర కొచ్చి మొత్తం డబ్బు ఒకేసారి ఇవ్వండని ఒత్తిడి చెయ్యడం.. దీంతో నా పరిస్థితి పూర్తిగా అధ్వానమైపోయింది... ఎంతోమంది నా దగ్గరి మిత్రులనుకున్న వాళ్ళు కూడా వాళ్ళ డబ్బు వెంటనే తిరిగిచ్చెయ్యాలని నా మీద ఒత్తిడి తెచ్చారు. దాంతో నాకున్న స్థిరాస్తులన్నీ అమ్మేసి చాలా వరకు నేనివ్వాల్సిన వాళ్ళందరకూ ఇచ్చేశాను... నాకివ్వాల్సిన వాళ్ళు మాత్రం ఎవ్వరూ ఇవ్వడం లేదు. నేను ఐదారు లక్షలకు మునిగాను..." అన్నాడు హనుమంతరావు.

"నేను నీకెప్పుడో చెప్పాను.. నీకీ వడ్డీ వ్యాపారం తగదన్నాను.. ముక్కుపిండి వసూలు చేసుకునే రౌడీగాళ్ళు చెయ్యాల్సిన వ్యాపారం ఇది.. నువ్వేమో నోట్లో నాలుక లేనివాడివి.. నువ్వేం చేస్తావు ఈ వ్యాపారం అనుకున్నాను.. నేను అనుకున్నట్టే అయ్యింది... ఎవరు చేసిన ఖర్మ వాళ్ళు అనుభవించక తప్పదంటారు కదా... అనుభవించు.. ఏం చేస్తావు?" అన్నాడు శ్రీనివాసరావు.

"మీకో విషయం గుర్తుండే ఉంటుంది. నేనీ వ్యాపారం మొదలెట్టిన కొత్తలో మీరోసారి నాదగ్గరకొచ్చారు.."

"అవును... వచ్చినట్టే గుర్తుంది.. అయితే ఏమిటి?"

"నా దగ్గరో యాభైవేలు తీసుకున్నారు..."

"యాభైవేలు తీసుకున్నానా? నాకు గుర్తులేదే!"

"ఇదిగో మీరు రాసిచ్చిన కాగితం కూడా పట్టుకొచ్చాను.... చూడండి.. మీ అంతట మీరే ఇస్తారుగదా... మీరు చాలా పెద్దవారు గదా... నేనొచ్చి అడిగితే బావుండదని నేనిన్ని రోజులూ మీ దగ్గరకొచ్చి డబ్బడగలేదు.... మీకు నేనీ డబ్బిచ్చి మూడేళ్ళయింది.. వడ్డీతో కలిసి ఇప్పుడు మీరు నాకివ్వాల్సిన డబ్బు లక్ష దాటింది.. నేనిప్పుడు చాలా కష్టాల్లో ఉన్నాను. మీరిప్పుడు డబ్బిస్తే నాకెంతో మేలు చేసిన వాళ్ళవుతారు.." అన్నాడు హనుమంతరావు.

"ఈ కాగితాన్ని బట్టి చూస్తే నేను నీ దగ్గర డబ్బు తీసుకున్నాననే అనిపిస్తోంది.... బహుశా మా రెండో అమ్మాయి పెళ్ళప్పుడు తీసుకున్నానేమో. నాకు గుర్తు లేదు... అయినా ఇంతకాలం నువ్వు నాకీ విషయం గుర్తు చెయ్యకుండా నోర్మూసుకొని కూర్చోవడమేమిటి? ఇప్పుడు అకస్మాత్తుగా వచ్చి అడగటమేమిటి? దిసీజ్ వెరీబ్యాడ్"

"మీరు నాకు గురువుగారు.. నేను చదువుకునే రోజుల్లో మీరు నాకెంతో సహాయం చేశారు.. నా వ్యాపారం బాగా నడిచినన్ని రోజులు నా అంతట నేనొచ్చి మిమ్మల్ని డబ్బడగటానికి మనస్కరించలేదు. మీరు పెద్దమనుషులు కదా.. మీ అంతట మీరే తెచ్చిస్తారనుకున్నాను. కానీ ఇప్పుడు నా పరిస్థితేం బాగాలేదు.. అందుకే మీ దగ్గరకొచ్చి డబ్బు అడగాల్సివచ్చింది..."

"నా పరిస్థితి మాత్రం బావుందనుకున్నావా? నేను ఈ మధ్యనే ఉద్యోగంలోంచి రిటైరయ్యాను.. నేనిప్పుడు పెన్షనర్‌ని మాత్రమే... ఇప్పటికిప్పుడు నేను నీకు లక్ష రూపాయలు ఎక్కడ్నించి తెచ్చివ్వను? మా అబ్బాయి అమెరికాలో ఉన్నాడు - వాడికీ విషయం రాస్తాను - వాడు పంపించగానే నీ డబ్బు నీకిచ్చేస్తాను..."

"మీరు వడ్డీ కొంచెం తక్కువిచ్చినా ఫరవాలేదు.. కానీ డబ్బు మాత్రం వెంటనే ఇవ్వాలిసార్... నా పరిస్థితి ఏ మాత్రం కూడా..."

"నా పరిస్థితి కూడా ఏ మాత్రం బాగాలేదయ్యా! నువ్వో నెల రోజుల తర్వాత కనిపించు... కొంతైనా సర్దే ప్రయత్నం చేస్తాను.

"నెల రోజుల దాకా ఆగలేను సార్.. మీకీ డబ్బో లెక్క కాదు. మీ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పది లక్షల దాకా వచ్చాయని విన్నాను..."

"ఎక్కడ విన్నావు.. ఎవరి ద్వారా విన్నావు? పది లక్షలు వచ్చాయే అనుకో.. ఆ పదిలక్షలింకా నా దగ్గరున్నాయనుకుంటున్నావా? డబ్బిచ్చిన వాడివి వెంటనే వచ్చి తీసుకెళ్ళకపోవడం నీ తప్పు.. అసలు నువ్విలాంటి వ్యాపారం చెయ్యడమే తప్పు... నీ కంపెనీని రిజిస్ట్రేషన్ చేయించావా? లైసెన్స్ తీసుకున్నావా? ఇన్‌కమ్‌టాక్స్ కట్టావా? డబ్బుతో వ్యాపారమంటే ఏమిటనుకున్నావు? నేనసలు నీ దగ్గర డబ్బే తీసుకోలేదంటాను.. ఏం చేస్తావు? ఈ కాగితం కోర్టులో చెల్లుతుందా? నెల రోజుల తర్వాత కనిపించమని మర్యాదగా చెబుతుంటే అర్థం చేసుకోవెందుకు? నువ్విక్కణ్ణించి వెళ్లిపో... నెల రోజుల తర్వాత రాపో.."

హనుమంతరావు కళ్ళనీళ్ళ పర్యంతమయ్యింది. "మీరిట్లా మాట్లాడ్తారని కలలో కూడా అనుకోలేదు సార్..." అంటూ అతడు లేచి బయటకెళ్ళిపోయాడు.

"వీడికేమన్నా బుద్ధుందంటారా?" అన్నాడు శ్రీనివాసరావు నాకేసి చూస్తూ.. నాకేం మాట్లాడాలో అర్థం కాలేదు.

"బుద్ధున్నవాడైతే ఆ వ్యాపారం చేస్తాడా? పోనీయ్ చేశాడే అనుకోండి... ఇచ్చిన వాళ్ళ దగ్గర్నుండి వెంటనే వాళ్ళ ముక్కు పిండి వసూలు చేసుకోవద్దూ!"

"పోనీయ్‌లెండి.. చూస్తే చాలా అమాయకుడిలా ఉన్నాడు.. ఈ మధ్య ఫైనాన్స్ కంపెనీలు పెట్టిన హేమాహేమీలే దెబ్బతిన్నారు.. పాపం ఇతడెంత? నెల రోజుల తర్వాతైనా అతనికి మీరు డబ్బిచ్చేస్తారు కదా..." అన్నాన్నేను.

"రేపేం జరుగుతుందో చెప్పలేం... నెల రోజుల తర్వాత ఏం జరుగుతుందో ఎలా చెప్పగలం?" అంటూ వెళ్ళిపోయాడు శ్రీనివాసరావు.

ఒకప్పుడు డబ్బు తీసుకున్న వాడు ఇచ్చిన వాడికి లోకువ అనుకునే వాళ్ళం... ఇప్పుడు ఇచ్చిన వాడే తీసుకున్న వాడికి లోకువైపోయాడేమో అనిపించింది నాకు. ★

ఏ ఉన్మాదం తలకెక్కినా...!



శిధిలాలు, శకలాలు
శిధిలాల కింద
శకలాల కింద
ఎక్కడో ఏ పొరలోనో
నా బాల్యపు తీపి గుర్తులు
సమాధి అయిపోయాయి
నేను బుడిబుడి అడుగులు వేస్తుంటే
బమియన్ బుద్ధుడు నవ్వుతుండేవాడు
పవిత్రమైన మసీదు ప్రార్థనలు
మానవత్వ సందేశాన్ని మోసుకొచ్చేవి
స్కూళ్ళు, కాలేజీలు
సహజీవన వేదికలుగా వుండేవి
సమానత్వం సహచరిగా
జానపద నృత్యాలు
జీవనాదమై వినిపించేవి

* * *

ఇప్పుడు నా స్వేచ్ఛ
మతం ఉచ్చులో ఇరుక్కొని
షరియత్ రేఖలు గీసింది
నేను వేసే జానపద నృత్యం
బురఖాలో బందీ అయ్యింది
నా నడకకు
ఫత్వాల ప్రవర్తనా నియమావళి
నగిషీలు దిద్దుతుంది
పవిత్రమైన మసీదు ప్రార్థనలు
ఫిదాయీల 'జిహాద్' సందేశాన్ని
మృత్యు సంగీతంగా ఆలాపిస్తూ...
'ఆంథ్రాక్స్' భూతాలను
ఆవాహన చేస్తున్నాయి
తాలిబన్ పడగనీడలో
బతుకుచుట్టూ బాయ్‌నెట్‌ల కాపలా
కాలానికి కళ్ళెం వేసే
కళ్ళు లేని కబోదులు

* * *

వచ్చే సంవత్సరం వచ్చి చూస్తే
ఈ మృత్తిక
బాంబుల విత్తనాలు కొలుస్తుంది
తుపాకుల గాలుల్ని వీస్తుంది
కొండలు, గుహలు, గుట్టలతో నిండిన ఈ నేల
పుర్రెలు, ఎముకలు, అస్తిపంజరాలను
తమ నాగరికతా ఆనవాళ్ళుగా చూపిస్తాయి
ఉగ్రవాదం
మతోన్మాదం
యుద్ధోన్మాదం
ఏ ఉన్మాదం తలకెక్కినా
మిగిలేవి కార్పణ్య సెగలే
పండేవి శవాల గుట్టలే

-వట్టికూటి మురళి

'మనిషిగా మారలేవా!?'

పగిలిన అద్దాన్నే ప్రశ్నిస్తున్నా
నెర్రలు బారిన మొఖాల్లోంచి
ఒడుస్తున్న నెత్తుర్లోంచి
విత్తుల్ని గుండెలకత్తుకున్న
రైతుల బతుకుల్ని
అందకుండా పోతున్న అక్షరాల్ని
దూరమవుతున్న బంధాల్ని
మాయమవుతున్న మమతల్ని
చూపించలేవెందుకని?
'ఉగ్రవాదంపై పోరు' పేరుతో
రగులుతున్న రావణ కాష్టానికి
ఆజ్యం పోస్తావెందుకని!
నా ఆకలి కేకలు
'ఆమడ దూరాలు'
అంతులేని ఆవేదనలు
తెల్లని పత్తిమాటున దాగిన
నల్లని మృత్యుముఖంలోకి
జారుకుంటున్న సంగతి
నీకు తెలీదా!
ఏం మాట్లాడవేం ?
నీవేం మాట్లాడుతావులే
ఉస్సేన్‌సాగర్‌లో
సుద్ద బుద్దావతారం నీవు
మా గుండె ముక్కల్ని
మూడు రంగుల దారంతో
ముడేస్తాననటవ్!
అబ్బే వర్ణ వివక్షతా?
అదెక్కడిదంటావ్!!
ప్రపంచబ్యాంకుకు
ప్రణమిల్లడమా? ఇది
ప్రతివాదుల కుట్రంటావ్!!
మరి బషీర్‌బాగ్‌లో
ఎగిసిన ఎరుపు చుక్కల
సంగతేంటి?
ఇక గడ్డకట్టిన మంచు దిబ్బల్ని
పగలగొట్టటమే మా పని
మీరు చేయాల్సిందల్లా ఒక్కటే
మనస్సంటూ ఉంటే
మా కన్నీటి చుక్కల కింద
కూసింత తడవటం నేర్చుకోండి
నిప్పుల్లాంటి నిజాల్ని
మీ స్వప్నాల్లోకి తెచ్చుకోండి

-ఐనాల సైదులు

పిల్లల్లో ఆరోగ్యాన్ని పరిశుభ్రతా ప్రభావం

వి.ఆర్.వాగోలు

ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. అది ముమ్మాటికీ నిజం. ఏ వయస్సు వారికైనా ఆరోగ్యాన్ని మించిన సంపద, మహాభాగ్యంలేనే లేదు. కారణం మనం ఆరోగ్యంగా ఉంటేనే చలాకీగా ఉండగలం. ఉత్సాహంగా ఏదైనా చేయగలం. ఉత్సాహంగా, ఉల్లాసంగా, చలాకీగా ఉండాలంటే ఆరోగ్యంగా ఉండగలగాలి. ముఖ్యంగా ముమ్మందుగా ఎంతో భవిష్యత్తు ఉన్న బాలబాలికల్లో ఆరోగ్యం ప్రముఖ పాత్ర వహిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. చిన్న పిల్లల ఆరోగ్యాన్ని ముఖ్యంగా రెండు అంశాలు ప్రభావితం చేస్తుంటాయి. అవి వ్యాధి నిరోధకత, పరిశుభ్రత. మన శరీరంపై నిత్యం అనేక రకాల వ్యాధికారక క్రిములు, వాయువులు, యితర పదార్థాలు దాడి చేస్తుంటాయి. వీటివల్ల మానవులు నిరంతరం అనారోగ్యంతో బాధపడుతుండాలి. అయితే అలా జరగడం లేదు. కారణం సహజంగా పుట్టుకతోనే ప్రతి వ్యక్తిలోనూ కొంత సహజ వ్యాధి నిరోధక శక్తి జనిస్తుంది. అందుచే మనం నిత్యం వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండగల్గుతున్నాము.

రెండవ అంశమైన పరిశుభ్రత కారణంగా అధికంగా చిన్నారి బాలబాలికలు రోగాల బారిన పడుతున్నారు. పెద్ద వారితో పోల్చితే చిన్నపిల్లలలో వ్యాధి నిరోధకత తక్కువ. దీనికితోడు పరిసరాల అపరిశుభ్రత చిన్నారుల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుంది. కొందరు పిల్లల్లో ఎప్పుడూ కారినముక్కు కారినట్లే వుంటుంది. కొందరు నిరంతరం దగ్గుతూ ఉంటారు. కొందరైతే నిత్యం జ్వరంవంటి వాటితో బాధపడుతూ వుంటారు. రోగాలకూ, అపరిశుభ్రతకు కారణం ఏమిటని ప్రశ్నించుకుంటే చాలా వుంది. రోగాలకు ఆలవాలం అపరిశుభ్రతే. అపరిశుభ్రత అన్ని రోగాలకు మూలకారణంగా భావించవచ్చు.

పల్లెటూర్లు, పట్టణాలలోని మురికివాడల్లో నివశించే పిల్లల్లో రోగాలకు పోషకాహార లోపంతో పాటు అపరిశుభ్రతకూడా కారణమవుతుంది. బాల్యంలో పిల్లలు మిత్రులతో కలిపి ఆడుకుంటూ వుంటారు. పార్కులయితే కాస్తంత పరిశుభ్రంగా వుంటాయి. కాని అన్నిచోట్లా మరీ ముఖ్యంగా పల్లెటూళ్ళలో పార్కులుండవు కదా! అందువల్ల ఇక్కడి పిల్లలు ఎక్కువగా మట్టి, దుమ్ములో ఆడుకుంటూ వుంటారు. మట్టికణాలలో అనేక రకాలైన వ్యాధికారక సూక్ష్మజీవులుంటాయి. ఇక ఆటల్లో దెబ్బలు తగిలి రక్తం వస్తుంటే వెంటనే కొంతమంది దెబ్బ తగిలిన చోట మట్టి పూస్తారు. దానితో మట్టిలో ఉన్న సూక్ష్మజీవులు నేరుగా శరీరంలోకి గాయం ద్వారా ప్రవేశిస్తాయి. చిన్నారులలో ఎక్కువ మందికి గోళ్ళు క్రమంగా కత్తిరించుకునే అలవాటు వుండదు. దానితో గోళ్ళు బాగా పెరిగి వుంటాయి. మట్టిలో ఆడుకుంటున్న పిల్లల గోళ్ళలోకి మట్టిపోయి అలాగే నిలువవుంటుంది. ఆటలాడి అలసిపోయి యింటికి వచ్చిన బాలబాలికలు కాళ్ళూచేతులూ సరిగా కడుక్కోకుండానే భోజనం చేస్తుంటారు. తద్వారా గోళ్ళలో యిరుక్కున్న మట్టి కణాలు, సూక్ష్మజీవులు ఆహారంతో పాటు శరీరంలోకి ప్రవేశించి అనారోగ్యానికి కారణమవుతుంది.

కొంతమంది పిల్లలు స్నానం విషయం పట్టించుకోరు. కొన్ని ప్రాంతాలలో పెద్దలు కూడా పిల్లల స్నానానికి అంతగా ప్రాధాన్యత యివ్వరు. ఉదయం లేచిన దగ్గర నుండి రాత్రి పడుకోబోయేంత వరకూ ఆటపాటల్లో పాల్గొంటూ, అటూయిటూ తిరిగి వస్తుంటారు. దీనివల్ల చెమట పట్టి శరీరమంతా జిడ్డుగా తయారవుతుంది. మట్టిలో ఆడడంవల్ల చెమటకు మట్టి తోడై ఓ రకమైన వాసన వస్తుంది. దీనివల్ల సూక్ష్మజీవులు శరీరంపై దాడిచేసే అవకాశం వుంది.

మరి కొందరు పిల్లలు వేసుకున్న దుస్తులనే రోజుల తరబడి వేసుకుంటూ వుంటారు. శరీరం నుండి వెలువడే చెమట, బయట దుమ్ము ధూళీ చేరి సూక్ష్మజీవుల ప్రవేశానికి అనువుగా ఉంటుంది.

జలుబు చేసినపుడు దానిని చేతిగుడ్డ ఉపయోగించి ఎప్పటికప్పుడు శుభ్రంచేసుకోకుండా వుండటంవల్ల ముక్కునుండి జలుబు కారుతూనే వుంటుంది. దీనిపై ఈగలు వాలుతుంటాయి. సాధారణంగా జలుబులో సూక్ష్మజీవులుంటాయి. ఈగలు వాటిపై వాలినపుడు ఆ సూక్ష్మజీవులు ఈగల కాళ్ళకు అంటుకొని మనం తీసుకునే ఆహార పదార్థాలపై ఈ ఈగలు వాలడం ద్వారా మన శరీరంలోకి చేరి వ్యాధులను కలుగజేస్తుంటాయి.

కొందరు పిల్లలు ముక్కునుండి కారే ద్రవాన్ని చేతులకు, చొక్కాలకు, నిక్కర్లకు పూసుకుంటూ వుంటారు. చేయి అడ్డం పెట్టుకోకుండా దగ్గడం, తుమ్మడం ద్వారా కూడా సూక్ష్మజీవులు సులభంగా ప్రక్కనవున్న చిన్నారులకు సోకుతాయి. ఇళ్ళలో మంచినీళ్ళు తాగేందుకుగానూ ఒకరు ఉపయోగించిన గ్లాసులనే మరొకరు ఉపయోగించిడం, మూతికి ఆనించుకొని త్రాగిన గ్లాసులనే మరలా ముంచడం ద్వారా సూక్ష్మజీవులు సులభంగా యితరుల శరీరాల్లోకి ప్రవేశించే వీలుంటుంది.

చిన్నపిల్లల్లో బాల్యంలో గమనించే మరో ముఖ్యమైన అలవాటు నోటిలో చేతులు పెట్టుకోవడం. ఇలా నోటిలో వేళ్ళు పెట్టుకోవడం ద్వారా చేతికి అంటిన దుమ్ము, ధూళి, చెమట నోటిలోకి వెళతాయి. గోళ్ళలో యిరుక్కున్న దుమ్ము, మట్టి కణాలు, ఆహారం తిన్న తరువాత చేతులు సరిగా కడుక్కోకపోవడం వలన గోళ్ళలో మిగిలిపోయిన మట్టితో కలసిపోయిన ఆహార పదార్థాల అవశేషాలు వ్యాధులను కలిగించే అవకాశం వుంది. చిన్నతనంలో ఒక్కొక్కసారి ఉదయం పూట ముఖం కడుక్కోకపోవడంవల్ల కూడా సూక్ష్మజీవులు ప్రబలి దంతవ్యాధులు వచ్చే అవకాశం వుంది. అంతే కాకుండా అపరిశుభ్రత వల్ల పిల్లల్లో యింకా అనేక సమస్యలు వస్తాయి.

చిన్నపాటి పరిశుభ్రతా అలవాట్లు చిన్నారి బుడతలకు నేర్పడం ద్వారా వారిలో పరిశుభ్రత ప్రాముఖ్యాన్ని గుర్తింపచేసి ఆరోగ్యవంతులనుగా చేయడం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల, సమాజం బాధ్యత. పిల్లలకు రెండుపూటలా స్నానం చేయించాలి. అలాగే పరిశుభ్రమైన దుస్తులు ధరింప చేయాలి. ఇక్కడ శుభ్రమైన దుస్తులు అంటే కొత్తవని కాదు సుమా! ఉన్నంతలోనే ఉతికిన దుస్తులని అర్థం. పిల్లల గోళ్ళను ఎప్పటికప్పుడు కత్తిరిస్తూ వుండాలి. అప్పుడు గోళ్ళలోకి దుమ్ము, మట్టి చేరదు. పిల్లలు నోటిలో వేళ్ళు పెట్టుకొనే అలవాటును క్రమంగా మాన్పించాలి. మట్టిలో ఆడుకోనేప్పుడు తగిలిన దెబ్బలను శుభ్రపరచి ఆయింట్‌మెంట్ వ్రాయాలి. దగ్గు, జలుబు, కండ్లకలకలు వంటి అంటు రోగాలున్న పిల్లలను యితర పిల్లలకు దూరంగా వుంచాలి. వీరు వాడిన పాత్రలు, దుస్తులు, వస్తువులను వేరొకరు వాడకుండా చూడాలి. ఆహార పదార్థాలపై ఈగలు వాలనీయరాదు. ఈగలు వాలిన, నిలువవున్న ఆహార పదార్థాలను తినకుండా చూడాలి.

పసి వయస్సులోనే పిల్లలకు చేతిగుడ్డ అలవాటు చేయాలి. దగ్గు వస్తున్నప్పుడు గుడ్డను నోటికి అడ్డంపెట్టుకోవాలని చెప్పాలి. జలుబు చేసినపుడు చేతిగుడ్డతో తుడుచుకోవాలని నేర్పాలి. చిన్నతనంలోనే యిటువంటి చిన్నచిన్న ఆరోగ్య సూత్రాలు నేర్పడంతో తాము ఆరోగ్యంగా ఉండటంతోపాటు యితర బాలబాలికలు ఆరోగ్యంగా, చలాకీగా వుండేందుకు సహాయపడిన వారు కాగలరు. దీనివల్ల పరిశుభ్రత అవసరం తెలుస్తుంది. తద్వారా అపరిశుభ్రతను ఆమడదూరంలో వుంచి వ్యాధులను తమ దగ్గరకు రాకుండా చేసుకొనే వీలుంటుంది. ★

'ముగ్గురు మిత్రులు'

ఒక ఆవుదూడ పొదలో దూరి మేస్తూ పరిసరాలను మరిచిపోయింది. చాలా సేపటికి వెలుపలికి వచ్చి చూసి భయంతో 'అంబా' అని అరిచింది. అప్పటికే పశువుల కాపరి పశువులనన్నింటినీ తోలుకొని వెళ్ళిపోయాడు. పొదలోని దూడను గమనించలేదు. సూర్యుడు అస్తమించి సంధ్య చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఏమాత్రం ఆలస్యం చేయకుండా తల్లిని పిలుస్తూ ఇంటిదారి పట్టింది దూడ.

కాస్తదూరం వెళ్ళగానే 'హలో మిత్రమా! ఒక మాట' అని వినిపించింది. దూడ చుట్టూ చూసింది. ఎవరూ కనపడలేదు.

'నేను నీ మిత్రుడిని. ఇదిగో ఇక్కడ చెట్టు మీద' అని వినిపించింది.

ఆగిన దూడ చెట్టు వైపు చూసి 'ఏంటి మిత్రమా సంగతి' అంది.

'ఎక్కడికీ పరుగు' అంది ఉడుత చర్రున చెట్టు మొదట్లోకొచ్చి.

గడ్డిమేస్తూ తోటి పశువులు వెళ్ళడం చూడలేదని, త్వరగా ఇంటికి వెళ్ళాలని చెప్పింది దూడ.

'ఈ మాత్రానికే ఇంటికి వెళ్ళాలా. ఉండిపోకూడదు. రాత్రంతా ఇద్దరం కబుర్లు చెప్పుకుందాం. నాకు బోలెడు కథలు కూడా వచ్చు. చెప్పుకుందాం' అంది.

'రాత్రివేళ అడవిలో ఉండటం ప్రమాదం కదా. క్రూర జంతువులు చంపేస్తాయి' అంది దూడ.

'నీకేం భయం లేదు. నేను చెట్టుమీదే ఉండి ఏ జంతువు వస్తుందో చెబుతా. ప్రమాదం అనుకుంటే అదిగో ఆ పొదలో దాక్కో. అస్సలు కన్పించవు. ఆ జంతువు వెళ్ళిపోగానే మళ్ళీ కబుర్లు చెప్పుకుందాం' అంది.

'నీకు వాటి గురించి తెలియదు. వాసన బట్టి వచ్చి చంపేస్తాయి' అనుకుంటూ ముందుకు కదిలింది దూడ.

'ఆగిపో మిత్రమా! నీకు భయమేమీ లేదు. నీ ప్రాణానికి నా ప్రాణం' అని చెప్పసాగింది.

అయినా ఆవుదూడ వినకుండా ముందుకు కదిలింది.

కొద్దిదూరం వెళ్ళగానే బాటలో కూర్చొని పండు తింటున్న కోతి కనిపించింది. అయినా పట్టించుకోకుండా గబగబా వెళ్ళసాగింది.

గభాల్న ముందుకు దూకి బాటకు అడ్డంగా నిలబడింది కోతి. 'ఇంత పెద్ద మిత్రుడిని పక్కనే ఉంటే మాట్లాడకుండా వెళ్తావా. న్యాయమేనా నీకు' అంది కోతి.

దూడ తన స్థితినంతా చెప్పి 'అడ్డు తొలుగు వెళ్ళాలి' అంది.

'ఓయ్ పిచ్చి దూడ. ఇంత మాత్రానికే భయపడాలా. కష్టపడి ఇప్పుడు ఇంటికి వెళ్ళినా రేపు ఇక్కడికి రావాల్సిందేగా. ఈ మాత్రం దానికి వెళ్ళడం ఎందుకు? ఇక్కడే పడుకోవచ్చుగా' అంది కోతి.

'నేను సాధు జంతువును. క్రూర మృగాల భయం' అంది దూడ.

'నువ్వేంటి? నేను కూడా సాధు జంతువునే. అయినా నేనుండగా నీ దగ్గరకు వచ్చే ధైర్యం ఏ క్రూరమృగానికి ఉంది? వస్తే దాని పనిపడ్తాను. నీ దగ్గరకు ఏ జంతువు రాకుండా చెట్టు మీద ఉండి జాగ్రత్తగా కాపలా కాస్తాను. నువ్వు నిశ్చింతగా చెట్టుకింద పడుకో. రాత్రంతా కబుర్లు చెప్పుకుందాం' అంది.

'తోడేలో, సింహమో వస్తే ఎదిరించే శక్తి నీకు లేదు, నాకూ లేదు. నీవు చెట్టుమీదకు ఎక్కి తృటిలో తప్పుకుంటావు. నా ప్రాణానికే ముప్పు. దయచేసి నన్ను వెళ్ళనివ్వు' అని కోతిని తప్పుకొని వెళ్ళసాగింది.

'ఛీ నువ్వు వట్టి పిరికి దూడవు. నా శక్తి, సామర్థ్యాలు నీకు తెలియవు. ఉండిపో మిత్రమా. నీకు కొత్త ఆటలు నేర్పుతా' అని కేకలు వేస్తూ వెంటపడింది. అయినా దూడ వినలేదు. తిట్టుకుంటూ కోతి వెనక్కు మళ్ళింది.

మరికొంత దూరం వెళ్ళగానే బాట పక్క పచ్చిక మేస్తూ ఒకలేడి కనిపించింది. దూడను చూడ్డంతోనే...

'నీకు బుద్ధి ఉందా! చీకటి పడేదాకానా మేయడం? మందను వదిలితే పెంపుడు జంతువులకు ఎంత ప్రమాదమో తెలుసా?' అని కోపంతో మందలించింది.

దూడ తన వివరాలు చెప్పబోయింది. 'నాకంతా తెలుసు. నిన్ను చూస్తుంటేనే అర్థమవుతోంది. అదృష్టం కొద్దీ ఈ దరిదాపుల్లో ఏ క్రూరమృగం లేదు. చీకటిపడితే ఇటువైపు వస్తాయి. నువ్వెంత త్వరగా అడవి దాటితే అంత మంచిది' అని తొందర చేసింది.

లేగదూడ వెంటనే పరుగు అందుకుంది.

ఆలస్యంగా కొట్టంలోకి వచ్చిన బిడ్డను చూసి 'ఇప్పటిదాకా ఎక్కడున్నావమ్మా' అని అడిగింది ఆవు.

'అడవిలో ఇద్దరు తెలివి తక్కువ స్నేహితులు, ఒక తెలివి గల స్నేహితుడు కలిశారమ్మా. వాళ్లతో మాట్లాడి వచ్చే సరికి ఈ వేళైంది' అంది దూడ మురిపెంగా.

-పుప్పాల కృష్ణమూర్తి



నేస్తాలూ,

ఈ సంవత్సరం అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవం మన రాష్ట్రంలోనే జరిగిందని మీకందరికీ తెలుసు కదా. రెండు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. ఇది పన్నెండవ ఉత్సవం. ఈ నెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు రాజధాని నగరమైన హైదరాబాద్‌లో జరిగింది. మీలో కొందరు ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ కూడా వచ్చి ఉంటారు. మన రాష్ట్రం, దేశం నుండే కాకుండా ఇతర దేశాల విద్యార్థులు కూడా ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఉత్సాహం గల బాల బాలికలను ఆయా పాఠశాలల నుండి ప్రతినిధులుగా ఎంపిక చేశారు. ఎంతో ఉత్సాహంగా జరిగిన ఈ బాలల చలన చిత్ర పండుగ గురించి ఈ వారం కొన్ని విశేషాలు తెలుసుకుందాం...

నాలుగు విభాగాల్లో పోటీలు : పూర్తిగా పిల్లల కోసమే తీసే సినిమాలను ఈ చిత్రోత్సవంలో ప్రదర్శిస్తారు. ఈ సారి నాలుగు విభాగాల్లో పోటీలు జరిగాయి. అవి 1. ఉత్తమ అంతర్జాతీయ చిత్రం 2. ఆసియన్ పనోరమ 3. విమర్శకులు మెచ్చిన చిత్రం 4. పిల్లలు మెచ్చిన చిత్రం. మొత్తం వారం రోజులకు గాను 162 చిత్రాలను ప్రదర్శించారు. బాలప్రతినిధులకు, జడ్జీలకు, పత్రికల వారికి విడిగా రెండు థియేటర్లలో (సంతోష్, స్వప్న) సినిమాలను ప్రదర్శించగా బాలలందరికీ ప్రవేశం కల్పించేలా మరో ఆరు థియేర్లలో ఈ చిత్రాల ప్రదర్శన జరిగింది. 270 మంది బాల ప్రతినిధులతో పాటు సుమారు 2 లక్షల మంది ఈ చిత్రోత్సవాలను తిలకించారు.

ఇరాన్‌కు అవార్డుల పంట : ప్రతి చలన చిత్రోత్సవంలోనూ తమ ప్రత్యేకతను చాటుకునే ఇరాన్ దేశం ఈసారి కూడా ఎక్కువ అవార్డులను గెలుచుకుంది. ఉత్తమ చిత్రంగా 'చిల్డ్రన్ ఆఫ్ పెట్రోలియం' ఎంపిక కాగా ఉత్తమ దర్శకునిగా రసూల్ అమేలి (ద గర్ల్ ఇన్ ది స్నీకర్స్), ఉత్తమ యానిమేషన్ చిత్రంగా 'షాంగౌల్ అండ్ మంగౌల్', ఉత్తమ ఆసియన్ పనోరమ చిత్రంగా 'ది చైల్డ్ అండ్ ది సోల్జర్' ఎంపికయ్యాయి. ఇవన్నీ ఇరాన్ దేశానికి చెందినవే. ఉత్తమ నటుడిగా డిమిట్రిస్ అలెగ్జాండ్రిస్ (ది కానరీ ఎల్లో బైస్కిల్-గ్రీస్) ఎన్నికయ్యాడు. ఉత్తమ ఫీచర్ చిత్రంగానూ, విమర్శకులు మెచ్చిన చిత్రంగా 'సస్తికీ, మమ్ అండ్ ది పోలీస్ మెన్' (డెన్మార్క్), పిల్లలు మెచ్చిన ఉత్తమ చిత్రంగా 'థామస్ ది ఫాల్కోనర్' (స్లోవేకియా), ఉత్తమ నాన్ ఫిక్షన్ డాక్యుమెంటరీగా 'మీడియా' (క్రెచ్ రిపబ్లిక్), ఉత్తమ లఘు చిత్రంగా 'లొట్టె ప్రిమా బల్లెరినా' (జర్మనీ) అవార్డులు గెలుచుకున్నాయి. స్పెషల్ జ్యూరీ అవార్డుకు 'రాణు' (ఇండియా) చిత్రంలో నటించిన సీమా చక్రవర్తి ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా ఎంపికైన 'చిల్డ్రన్ ఆఫ్ పెట్రోలియం' ఓ

స్పెషల్ జ్యూరీ అవార్డు గెలుచుకున్న సీమా చక్రవర్తి (చిత్రం : రాణు-ఇండియా)

భాగోను చూపించడానికి వెళితే అక్కడ భాగో వుండడు. ఈ చిత్రోత్సంలో ప్రదర్శించిన వివిధ చిత్రాలపై ప్రతినిధులు భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేశారు. మీకు తెలుసా! పిల్లలు మెచ్చిన చిత్రం అవార్డు ఇచ్చే కమిటీలో ఉండేదంతా పిల్లలే. ఢిల్లీకి చెందిన 13 ఏళ్ల అలీషా ఈ కమిటీ చైర్మన్‌గా ఉండగా మరో ఆరుగురు బాల బాలికలు ఇందులో సభ్యులుగా ఉండి వారందరికీ నచ్చిన ఒక చిత్రాన్ని ఎంపిక చేశారు. వారు ఒకరోజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇలా అన్నారు. " ప్రస్తుతం ప్రదర్శిస్తున్న చిత్రాలపై మాకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఇక్కడ ప్రదర్శిస్తున్న చిత్రాలన్నీ పిల్లల మనోభావాలను ప్రతిబింబించేవిగా లేవు. నటన, ఇతివృత్తం వంటివాటితో పాటు ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటాం. సినిమాలోని ప్రతి అంశాన్ని పిల్లలు చాలా జాగ్రత్తగా గమనిస్తారు. వారి దృష్టికి రాని విషయం ఏదీ ఉండదు. ప్రస్తుతం ప్రదర్శిస్తున్న చిత్రాలను ఇంకా మెరుగైన కోణంలో తీయవచ్చు. దర్శకులు సమాజం పట్ల బాధ్యతగా ప్రవర్తించి అసభ్యత, అశ్లీలత, హింస లేకుండా చిత్రాలు తీస్తే మంచిది. సినిమాలు విజ్ఞానం, వినోదంతో కూడుకొని ఉండాలి". హైదరాబాద్‌కు చెందిన ఓ పాఠశాల విద్యార్థులు కొన్ని చిత్రాల్లో అక్కడక్కడ కనిపించిన అశ్లీల దృశ్యాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలు చూడకూడని అలాంటి దృశ్యాలను ఎందుకు సినిమాలో ఉంచారో అర్థంకావడం లేదని వారు విలేకరుల ఎదుట ప్రశ్నించారు. గ్రీక్, డచ్, జర్మనీ, ఇటలీ చిత్రాలకు ఇంగ్లీష్ సబ్ టైటిల్స్ వేస్తే బాగుండేదని మరికొందరు అభిప్రాయపడ్డారు. సబ్ టైటిల్స్ అంటే మీకు తెలుసు కదా..సినిమా ఏ భాషలో ఉన్నా ఆయా దృశ్యాల్లో వచ్చే మాటలకు కింది భాగంలో ఇంగ్లీషులో అవే సంభాషణలను ప్రదర్శిస్తారు. దీనివలన మనకు ఆయా దేశాల భాష రాకున్నా ఇంగ్లీష్ వచ్చిన వారు అది చదివి

ఉత్తమ చిత్రంగా బంగారు ఏనుగు అవార్డును గెలుచుకున్న 'చిల్డ్రన్స్ ఆఫ్ పెట్రోలియం' (ఇరాన్)

కనువిందు చేసిన బాలల చిత్రోత్సవం

HYDERABAD
ANDHRA PRADESH. INDIA
14th - 20th NOV. 2001

భిన్నమైన కథ. తల్లిదండ్రులు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు తమవంతుగా కుటుంబాన్ని ఆదుకోవాలన్న తాపత్రయం పిల్లల్లో ఎక్కువగా ఉంటుంది. ఈ అంశాన్నే చిత్రంలో చూపించారు. ఇరాన్‌లో పెట్రోలియం వలన ఎదురవుతున్న ఇబ్బందులు, ఫలితంగా పేదల జీవితాల్లో చోటు చేసుకుంటున్న సంఘటనలను ఈ చిత్రంలో అద్భుతంగా చూపుతారు. ఉపాధి నిమిత్తం తండ్రి వేరే దేశానికి వెళ్లడంతో ఆ కుటుంబం పడే వేదన వర్ణనాతీతంగా ఉంటుంది. దీనికి తోడు తండ్రి నుండి డబ్బు కూడా రాకపోవడంతో ఆర్థిక సమస్యలు అధికమవుతాయి. తల్లిపడుతున్న ఇబ్బందులను చూడలేక తనవంతుగా సాయం చేయాలనుకున్న పదకొండేళ్ల మిలాద్ తప్పుడు మార్గాల వైపు దృష్టి మళ్లిస్తాడు. కొన్నాళ్లకు చమురు బావుల వద్ద చోటు చేసుకున్న ఓ సంఘటన మిలాద్ ఆలోచనా దృక్పథాన్ని పూర్తిగా మార్చివేస్తుంది.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు: మొత్తం ఎనిమిది థియేటర్లతో పాటు హరిహర కళాభవన్, లలిత కళాతోరణంలో కూడా చిత్రాల ప్రదర్శన జరిగింది. లలిత కళాతోరణంలో గల ఓపెన్ ఆడిటోరియంలో ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. తమ ప్రాంతాల సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే ప్రదర్శనలు వారు ఇచ్చారు. మన రాష్ట్రం నుండి కూడా వివిధ జిల్లాల నుండి బాల కళాకారులు బృందాలుగా వచ్చి తమ ప్రదర్శనలు ఇచ్చారు.

భిన్నరుచులు-విభిన్న చిత్రాలు: చిత్రోత్సవంలో ప్రారంభ చిత్రంగా మనదేశానికి చెందిన 'భాగో భూత్'ను ప్రదర్శించారు. ఈ చిత్రాన్ని సాయి పరాంజపే ఆంటీ నిర్మించారు. ఈ ఆంటీ బాలల కోసమే ఎన్నో చిత్రాలు, డాక్యుమెంటరీలు తీశారు. 'భాగో భూత్' చిత్రం పిల్లలనే కాక పెద్దలను కూడా ఆకట్టుకుంది. క్లుప్తంగా ఈ చిత్ర కథ ఇదీ. చిమ్మడ అనే గ్రామ సరిహద్దులో గల అడవిలో ఓ భూతం ఉందని పుకారు వస్తుంది. అయితే నాను అనే ఒక పిల్లవాడు భూతం ఎలా ఉంటుందో చూద్దామని తోటి మిత్రులతో కలిసి అడవికి వెళ్తాడు. అక్కడ వచ్చే భయంకరమైన శబ్దాలకు మిగతా వారు పారిపోగా నాను మాత్రం ఓ చెట్టెక్కి పట్టుదప్పి కిందపడిపోతాడు. అతనికి ఎదురుగా ఓ బలమైన వ్యక్తి నిలుచుంటాడు. మెల్లిగా అతడి(భాగో)తో స్నేహం చేస్తాడు. రోజూ ఆ చెట్టు వద్దకు వచ్చి ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటారు. నాను తాను చదువుతున్న కథలు చెబుతుంటే భాగో అడవిలోని విశేషాలను చెప్పేవాడు. అలా వారి స్నేహం పెరుగుతుంది. భాగో సాయంతో అనేక సార్లు జంతువులను ప్రమాదం నుండి కాపాడుతాడు. నాను గ్రామంలో హీరో అవుతాడు. గ్రామస్తులు అతనిని సన్మానించబోగా ఇవన్నీ భాగోకు దక్కాలని అంటాడు. గ్రామస్తుల కోరిక మేరకు



ఉత్తమ యానిమేషన్ చిత్రంగా ఎంపికైన 'షాంగౌల్ అండ్ మంగౌల్' (ఇరాన్)

సినిమాను అర్థం చేసుకోవచ్చు. ఎక్కువ మంది యానిమేషన్ చిత్రాలను మెచ్చుకున్నారు. అవి ఏ థియేటర్లలో ప్రదర్శిస్తున్నారో తమ ఉపాధ్యాయులను అడిగి అక్కడికి తీసుకువెళ్లమని కోరారు. అంతేకాదు 'నటన-చదువు' అనే అంశంపై ఓపెన్ ఫోరంలో చర్చ జరిగినప్పుడు అనేక ఆసక్తికరమైన అంశాలు వ్యక్తమయ్యాయి. దీపిక అనే విద్యార్థిని మాట్లాడుతూ 'మాకూ నటించాలనే కోరిక ఉంది. కానీ ఇంట్లో వారు ఒప్పుకోవడం లేదు. అలాంటప్పుడు మేమేం చేయాలి' అని అక్కడ ఉన్న పెద్దవాళ్లను ప్రశ్నించింది. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పడానికి అక్కడ ఉన్న వారంతా కొద్దిసేపు ఇబ్బంది పడ్డారు. చివరకు వేదకుమార్ అంకుల్, మురళీమోహన్ అంకుల్, ఇరాన్ ఆంటీ లీలా మెరహది ఇలా చెప్పారు 'బాల్యంలో ప్రతి ఒక్కరికి కోరికలుంటాయి. అవి తీర్చుకునే ప్రయత్నంలో మొత్తం జీవితాన్ని వృధా చేసుకోవద్దు. నటనతో పాటు చదువులో కూడా తల్లిదండ్రులు చెప్పినట్లు చేయడమే బెటర్. పెద్దల సహాయం లేకుండా పిల్లలు ఏమీ చేయలేరు. బాలనటులుగా పేరు తెచ్చుకున్న అనేక మంది తర్వాత నటనకు దూరం అయ్యారు. కనుక పిల్లలు పెద్దల మాటను గౌరవించాలి. చక్కగా చదువుకోవాలి. ఆ తరువాతే నటన గానీ, మరేదైనా గానీ' అని అన్నారు.



ఉత్తమ నటుడిగా ఎన్నికైన డిమిట్రిస్ అలెగ్జాండ్రిస్ (కుడివైపు) చిత్రం : ది కానరీ ఎల్లో బైస్కిల్, గ్రీస్

తెలుగు చిత్రం లేదు: ఇంత ప్రతిష్ఠాత్మకంగా మనరాష్ట్రంలో జరిగిన ఈ అంతర్జాతీయ చిత్రోత్సవంలో మన భాష తెలుగు నుండి ఒక్క చిత్రం కూడా ప్రదర్శనకు నోచుకోలేదు. ఒకే ఒక చిత్రం ఎంట్రీకి వస్తే వివిధ కారణాలతో కమిటీ ఆ చిత్రాన్ని పోటీకి నిరాకరించింది. బాలల చిత్రాలంటే మన సినిమా ప్రముఖులకు ఎంత ఆసక్తి ఉందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. తెలుగు సినిమా లేనందుకు అందరూ బాధపడ్డారు కానీ లోపం ఎక్కడో స్పష్టంగా చర్చించలేదు.

వచ్చే ఫెస్టివల్ నాటికి చిల్డ్రన్ థియేటర్: ప్రస్తుతం మన రాష్ట్రంలో బాలల చిత్రాలను ప్రదర్శించేందుకు ప్రత్యేకంగా ఓ థియేటర్ లేదు. 13వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవం నాటికి రాష్ట్రంలో థియేటర్ నిర్మాణం జరుగుతుందని, ఇప్పటికే స్థలాన్ని కూడా కేటాయించామని ముగింపు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అంతేకాక పిల్లల చిత్రాలను నిర్మించే వారికి 20 లక్షల సబ్సిడీ, ఉత్తమ చిత్రంగా ఎంపికైతే మరో 15 లక్షల వరకు సబ్సిడీగా అందచేస్తామని కూడా ఆయన ప్రకటించారు. ఏమైనా ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు వెంటనే చిల్డ్రన్ థియేటర్ నిర్మాణం పూర్తయి, సర్వహంగులతో వచ్చే ఫెస్టివల్ నాటికి సిద్ధమయితే బాలల పండుగ మరింత కన్నుల పండువగా జరుగుతుంది.

-కంభాలపల్లి కృష్ణ

రుక్మిణి

"పేరు గొప్ప... ఊరు దిబ్బ... అబ్బో! అమెరికా అంటే అందరూ హడలడలి ఛస్తారనుకున్నాను గానీ... అబ్బే... ప్చ్.... వేస్ట్..! లాభం లేదయ్యా.... కావాలంటే మా సాయం తీసుకోండి!"

అసలే సాగివున్న పెదాల్ని మరింత వంకరగా వాజ్‌పేయిగారు విరవడంతో నోరంతా వెళ్ళబెట్టి నిర్ఘాంతపడి పోవడం జార్జిబుష్‌గారి వంతయ్యింది!

"అసలు మీ సమాచార సాంకేతిక పరిజ్ఞానం మా తాతమ్మల కాలం నాటిది! మా చెంద్రబాబే మీ కన్నా బెటరు! సమాచార సేకరణా.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లేకుండా ఏదీ సాధించడం కాదు గదా... మరి యుద్ధంలో? అందులోనూ ఒక ఉగ్రవాద ఉన్మాద దేశంలో ప్చ్... ప్చ్... అస్సలు లాభం లేదయ్యా!" వాజ్‌పేయి గారు అట్లా పుల్లవిరిచినట్లు, మొహం మీద మూడు గుద్దులు గుద్దినట్లు అనేయడంతో రమ్స్‌ఫీల్డుగారు కుర్చీలో కూలబడి మరీ రెండు రమ్ము గ్లాసులు పీకి నివ్వెరపోయాడు.

"అదేంమాట! వరసబెట్టి వారాల తరబడి బాంబుల మోత మోగిస్తున్నాం గదా... అంగుళం అంగుళం క్లస్టర్ బాంబులు... బ్లిస్టర్.. మిసిలీలు... బిటు బాంబులు.. ఎఫెక్స్ మిసిలీలు.." బుష్‌గారు దండకం చదువుతూనే వున్నాడు... వాజ్‌గారు అర్ధనిమీలిత నేత్రాలతో వాళ్ళిద్దరి వంకా మిక్కిలి జాలిగానే చూస్తూ కాలి మడమ చిప్పల్ని మరోసారి సరిజూసుకుని జాగ్రత్తగా కాలిమీద కాలేసుకుని విలాసంగా నవ్వాడు.

తమ పాత ఆయుధాల అమ్ముల పొది నుండి బయటకు తీసిన రకరకాల ఆయుధాలు... ట్యాంకులు విమానాలు.. బాంబుల చిట్టా... సరికొత్తగా ప్రయోగించి పరీక్షించడానికి వీలుపడకుండా గుట్టలు... గుట్టలుగా బయట అమ్మకాలు జరక్కుండా పడిన వాటిని ప్రస్తుతం ప్రయోగించి తమాషా - ఫలితాల్ని చూస్తున్న భోగట్టా వివరాలను బుష్‌గారు - రమ్స్‌ఫీల్డుగారు ఒకరి వెంట ఒకరు ఏకరువు పెట్టారు.

"అసలింతకూ మీరు లాడెన్‌ను పట్టుకున్నారా? లేదు! మీ ఇంటిలిజెన్సు ఉపగ్రహాలు వేస్ట్! మీ దేశంలోని మీ చట్టాలు వేస్ట్! మేం మా దేశంలో రాత్రికి రాత్రే 'పోటో' అని ఈటెపోటు లాంటి భయానక చట్టం మూడోకంటి వాడికి తెలియకుండా తెచ్చిపారేశాం! అంతే! ఉగ్రవాదో.. అగ్రవాదో అన్న సమస్యలేకుండా మనకు నచ్చని వాడ్నల్లా బొక్కలో నూకిపారేయడానికే సానుకూలం! మరి మీరిద్దరూ కలిసి కనీసం ఆ పనైనా చేయలేకపోతిరి. ఏం లాభం? కావాలంటే మా సాయం తీసుకోండయ్యా...!"

బుష్, రమ్స్ ఫీల్డు బిత్తరపోయి మొహామొహాలు చూసుకున్నారు. ఈ 'పోటో' పోటు ఏమిట్రా భగవంతుడా అని చిరుచెమట్లు తుడుచుకున్నారు.

"అరె... అక్కడ ఆఫ్ఘనిస్తాన్‌లో మా పోటో ఏంటి? ఫోటోలు దిగడానికా? నాకేం అర్థం కావడం లేదు!"

"సర్సరె... మీ ఇష్టం! మీరు శత్రువునూ... మిత్రునీ తక్కువ అంచనాలు వేస్తున్నారు." వాజ్‌పేయి ఈ మాటకు వాళ్ళిద్దరూ మరింత విస్తుపోయారు. ఏంటో.. ఈ వాజ్‌పేయి ఎక్కడ ఏ ప్లేటు ఫిరాయించి ఎట్లా మాట్లాడతాడో ఆయనగారికే అంతుబట్టదు!

"బిన్‌లాడెన్.. తాలిబాన్.. ముసల్మాన్... ఈ సెప్టెంబర్‌లో మీ రెండు ట్రేడ్ టవర్స్ కూల్చిపారేశాడు - అదీ ఎట్లా? ఆత్మాహుతి దళాలు.. బోయింగ్ విమానాలు.. పెద్ద పకడ్బందీ.. ప్లాన్లూను.. పథకాలు... అంతేగదా! మరి మేం పదేండ్ల కిందటే పబ్లిగ్గా.. బేఖాతర్.. ఉత్తుత్తి పొల్లు మాటలతో జనాల్ని రెచ్చగొట్టి బాబ్రీ మసీదును బదాబదలు చేసి పారేసినాం గదా! పబ్లీకున... మరి ఎవడన్నా నోరెత్తిండా?

ఖబర్దార్.. ఖడేజావ్! మాయమాటలు.. తిమ్మిని బమ్మిని చేసి నోర్లు మూయించి పారేసినం! మరి ఇపుడు 'చెప్పండి! ఆ బిన్‌లాడెన్ కన్నా మా బిజెపీ పటిష్టమైందని ఒప్పుకుంటారా లేదా? కావాలంటే మాసాయం తీసుకోండి!

ఒప్పుకోకుంటే మరేం ముప్పు వచ్చిపడుతుందో.. మరెన్ని మాటలు వినాల్సి వస్తుందోనని ఏదో అడ్డదిడ్డంగా బుర్రకాయలైతే ఊపేసారు గానీ... అసలీ ఊసుకీ... ఇప్పటి విషయానికి లింకు ఏంటో ఎంతమాత్రం అర్ధంగాక తలలు పట్టుకుని అయోమయంలో పడిపోయారు.

"మాది స్వచ్ఛమైన ఆధ్యాత్మిక 'హిందూ' దేశం! మా ప్రజలకు జాతీయ భావం ఎక్కువ... అందుకే ఇతర మైనార్టీ మతాల వారిని మాటమాత్రం చెప్పకుండా సైలెంటుగా సరిచేసి సరాసరి పైకి పంపించేస్తుంటాం! మీరూ వున్నారు. ధడ... ధడ... లడ లడ... విమానాలు... బాంబులు... అసలు మీ కమెండోలు మా శివ సైనికుల ముందు.. మా కరసేవకుల ముందు బలాదూర్.. వేస్టు... కావాలంటే..

రమ్స్‌ఫీల్డుకి ఈసరికే బాగా నీరసం వచ్చి, ఆత్మ న్యూనతా భావం ఆవహించి కుదేలైపోయాడు. బుష్‌గారేమో అపుడు తెరిచిన నోరు 'మూయడం' అనేది మరిచిపోయి అవాక్కయి అట్లాగే కూర్చున్నాడు గదా! వాజ్‌పేయి గారేమో ఛాతీ ఉబ్బరించి అనర్గళంగా వాయించి పారేస్తున్నాడాయె!

"మా బజరంగ్‌దళ్... విహెచ్‌పీ వీరసైనికులు.. మీకు తెలవదేమో.. మీ కమెండోలందరికీ ముందు లాగూ లాఠీ లడాయి కవాతు నేర్పితే - నల్లటోపీ తీసుకుని లాడెన్‌ను ఎపుడో ఉడాయించే వాళ్లు... చిటికెలో పని!" (వాజ్‌పేయిగారు చెండు చప్పరింపులు చప్పరించి మూడు చిటికెలు వేశాడు) రమ్స్‌ఫీల్డు గారేమో ఈ కొత్తరకం సైన్యం.... లాఠీ టోపీ రెజిమెంటు.. యుద్ధతంత్రం ఇంతవరకూ కనీవినీ వుండకపోవడంతో వీని ప్రశస్తీ... ప్రయోగం తెలుసుకోవాలని తెగ ఆరాటపడిపోయి పిసుక్కుంటున్నారు.

"అయ్యో... అయ్యో... వాటి వివరం.. ఇన్ఫర్మేషన్ కాస్త... కాస్త చెబుదురూ?"

"అట్టె... అట్టె.. ఆగండాగండి.... త్రిశూల శిక్షణా... ఓ లక్ష మందికి లాఠీతో బాటే త్రిశూల ప్రయోగం.. ముస్లింల వియోగ పథకం ప్రారంభించాం! అరె... మారుతున్న మారణహోమ మర్మాలు ఎప్పటికపుడు మనసుకి పట్టించుకుని అమలు చేయవలె!"

ఇక లాభం లేదని రమ్స్‌ఫీల్డుగారు అందుబాటులోని నోటు బుక్కందుకుని వాజ్‌పేయి గారు చెప్పే త్రిశూలాల భోగట్టా... లాగూలాఠీ నల్లటోపీ కవాతు వివరాలు బరబరా దాన్లో గిలికిపారేస్తున్నాడు. ఇదోరకం వినూత్న యుద్ధతంత్ర వ్యవహారమాయె!

వాజ్‌పేయిగారు మరింతగా రెచ్చిపోయాడు- "అసలు మీరు ఆఫ్ఘనిస్తాన్‌లో చేస్తున్నదేంటి? లక్షల కోట్ల డాలర్ల బాంబులేసి పదీ - పాతిక రూపాయల విలువ చేయని గుడారాల్ని.. గుడిసెల్ని కూల్చి పారేస్తున్నారు. మట్టిదిబ్బల దుమ్మురేపుతున్నారు. నో... నో... అసలు మీ సైన్యానికి 'కూల్చివేత - కాల్చివేత'ల్లో ఏ మాత్రం అనుభవం లేదంటే లేదు - కావాలంటే..

రమ్స్‌ఫీల్డు మరో రమ్ము పీకి దమ్మురాకుండానే నోటు పుస్తకం మీద బరబరా నోట్సు గీకి పారేస్తున్నాడు - ఈ ధాటికి అపుడెపుడో తెరిచిన నోరు మరి మూయకుండా.. బుర్రంతా అతలా కుతలమైన జార్జిబుష్‌గారు దోమలు జొరబడతాయన్న ధ్యాసైనా లేకుండా అట్లాగే బార్లా తెరిచే చెవులు మాత్రం అప్పగించాడు.

"మా హిందూ వీరకిశోరాలకు అది వెన్నతో పెట్టిన విద్య.., అది మసీదు కానీండి... చర్చి కానీండి.. విమానాల రొదా... బాంబుల కథా లేకుండా అట్లా గుట్టు చప్పుడు కాకుండా కాల్చి కూల్చి పారేయగల నిష్ణాతులు... ప్చ్.... ప్చ్.. వేస్ట్.. వేస్ట్... అయినా అసలు మీరు మీ మిత్రపక్షాలేవో... శత్రుపక్షాలెవరో తేల్చుకోవడం కూడా చాతకానివారు.. కావాలంటే మా...

రమ్స్‌గారు ఆ పాటికి బుర్రంతా ఖరాబు చేసుకుని ఏదీ ఆలోచించే పని పెట్టుకోకుండా ఏకబిగిన బరబరా ఈ అమూల్య అమర వాక్కుల్ని గిలకడం కాస్తంత ఆపి - "అంటే ఏంటో అర్థం కాలేదు వాజ్‌గారూ! అర్థమయ్యేట్లు చెప్పండి" అన్నాడు.

వాజ్‌పేయి గారు బహు ఈసడింపుగా చూశారు. "అదే.. రణతంత్రం.. కుతంత్రాలు చాతగాకపోతే చల్లా అంబలి అమ్ముకోవాలి.. మేం ఏదో అధికారాన్ని అంటిపెట్టుకోడానికని అలగా పులగా, చిన్నా చితకా పార్టీలన్నింటిని కూడగట్టి ఒక యన్డీయే - దానికో ఎజెండా అని నమ్మబలికాం గదా.. అంతే! మరి నమ్మకంగా మేం చేస్తున్నదేంటీ.. దానిదోవదానిదీ... మా స్వంత కాషాయ జెండా మాదీ... అమలు చేస్తున్నామా లేదా... మైనార్టీలను ఏరిపారేస్తున్నామా లేదా?"

రమ్స్ బరబరా గిలుకుతూనే బహు విచిత్రంగా... కాస్త దిగాలుగా "అయితే మరిపుడు మేం ఏం చేస్తే బావుంటుందని మీ సలహా! చెప్పండి...!" అని గొణిగాడు.

"ఏముంది... ముందు మీరు పాకిస్తాన్ మీద యుద్ధం ప్రకటించండి! ఎడాపెడా బాంబుల వర్షం కురిపించండి! ముస్లిం జాతిని నేలమట్టం చేయండి!"

అప్పటిదాకా నోరు బార్లా తెరిచిన బుష్‌గారు హఠాత్తుగా నోరు మూశాడు. రమ్స్‌ఫీల్డు వెనక్కి విరుచుకుపడ్డాడు. నోటుబుక్కూ.. కలమూ ఎగిరి ఎక్కడో పడిపోయినాయి-

"అదే.. అదే... మిత్రభేదం అంటే అదే... ప్రపంచంలో సమూలంగా ముస్లిం జాతిని తుడిచిపెట్టే మార్గం.. మా పక్కలో బల్లెం... మీకు డొక్కలో కత్తిలా మారుతుంది గదా... ముందు మీరు ముషారఫ్ పని పట్టండీ... కావాలంటే మా సాయం కూడా...

బుష్‌గారు ఇక తప్పదేమోననుకుని మళ్ళీ నోరు బార్లా తెరిచాడు!! ★

మాట కచేరీ

లక్ష్మి

దేవుడు మనిషికి మాటలు యిచ్చేడు. ఆ మాటల్ని జాగ్రత్తగా వాడుకుని మర్యాదగా బతకమన్నాడు. మనం మాటాడే మాటల ద్వారా మన సంస్కారం ఇతరులకు తెలిసే అవకాశం ఎంతైనా వుంది. కొందరు ఏది మాటాడినా మెత్తగా వుంటుంది. మనసుకి హాయిగా వుంటుంది. ఆ మాటలే కొందరు మాటాడుతుంటే ముతగ్గా వినిపిస్తాయి. రోత కలిగిస్తాయి. సందర్భం ఒక్కటే కావచ్చు. కొందరు కొంటెగా మాటాడుతారు. మరికొందరు మంటమీద మాటాడుతుంటారు. కొందరు శృతి తగ్గించి మాటాడుతుంటే కొందరు ఆవేశపడి అరుస్తూ మాటాడుతుంటారు. ఒక్కొక్కరిది ఒక్కో తరహా. ఎవరెట్లా మాట్లాడినా ఎదుటి వారిని నొప్పించకుండా మాటాడటం మంచి పద్ధతి. ఆ మాటకి విలువెక్కువంటారు. ఆ మాట *బంగారమంటారు. మనం భోజనానికి ఒకరింటికి వెళ్ళేం.* ఆ యింటో పెద్దావిడ మనకి వడ్డిస్తున్నారు. సిగ్గుపడకుండా భోంచేయమన్నా – సిగ్గులేకుండా భోంచేయమన్నా అర్థం ఒక్కటే! – సిగ్గుపడకుండా అనే మాటకి ఎంత సంతోషిస్తామో – సిగ్గు లేకుండా అనే హెచ్చరికకు అంత ఇబ్బంది పడతాం!

చెంప ఛెళ్లుమనిపించినా కన్నీళ్లు రాకపోవచ్చు. కనికరం లేకుండా మాటాడినప్పుడు ఘొల్లున ఏడవాలనిపిస్తుంది. ఆడవాళ్ల హృదయాలు అతిసున్నితమని మగవాళ్లకి బాగా తెలుసు! అంచేత వాళ్లు మాటల్తో కొడతారు. చెంప ఛెళ్లుమనిపిస్తే రౌడీ మొగుడంటారనే భయంతో –ఏదో కుళ్లుమాట కూసి అర్ధాంగిని కుళ్లికుళ్లి ఏడ్చేట్టు చేస్తాడు! ఎక్కువగా ఏడుస్తుంటే కుళాయి కట్టేయమంటారు. నీళ్లకుండ నెత్తిమీద పెట్టుకుంటావని ఎగతాళి చేస్తారు. మగవాడి మాటలు పోలీసు దెబ్బల్లాగా వుంటాయి. ఫలానావాడు నేరస్థుడని పోలీసుడవుటు పెట్టుకున్నప్పుడు – ఆ ఫలానా వాడ్ని లాఠీతో చితకబాది కీమా చేస్తాడు. అయితే ఆ దెబ్బలు కనిపించవు. అంచేత పోలీసు చేతిలో ఫలానావాడు కీమా *అయ్యేడని ఇతరులు అనుకోలేరు! అంత చాకచక్యంగా* లాఠీకి పని చెబ్తాడు పోలీసు. ఈ ఆర్టులో సదరు పోలీసుకి ఏ మాత్రం తీసిపోడు మగవాడు. పోలీసు లాఠీతో కొడితే – మగమారాజు మాటల్తో చితగ్గొడతాడు. పోలీసు అనుమానితుడ్ని ఉతికితే – మగమారాజు వాళ్లావిడ మెదడ్ని పచ్చడి చేస్తాడు. ఉదహరిస్తాను.

అనగనగా ఆమె. అమ్మానాన్నా అన్నదమ్ములూ అక్క చెల్లెళ్లూ అందరూ వున్నారు. ఆమెకు పెళ్లయింది. అతను అందగాడు. అందంగా మాటాడే గుణం కలవాడు. అందమైన ఉద్యోగం చేస్తున్నవాడు. ఆమె అతన్తో కొత్త కాపరం ప్రారంభించింది. ఆమె అన్నతమ్ముడెవరో విరివిగా తనని చూసేందుకు రావచ్చు. వాడికి అక్క చెల్లెళ్లంటె అపారమైన యిష్టం. వాళ్లకి పెళ్లిళ్లయ్యేయనే కారణంగా దూరంగా బతకలేదు. వాడసలే కుక్కపేగుల వాడు. తోబుట్టువు కల్లో కనిపిస్తే – తెల్లవారకముందే ఆమె గుమ్మంలో ప్రత్యక్షమై – అమ్మాబావున్నావాని కుశలమడుగుతాడు! ఈ వరస బావగారికి నచ్చదు. అస్తమానం తన యింటిని అంటిపెట్టుకునుండే బావమరిది మీద వళ్లు మండిపోతుంది. అతన్ని తమ యింటికి రావద్దని సూటిగా చెప్పమని భార్యకి సూటిగా చెప్పడు. ఆ మాటని అటు తిప్పి ఇటు తిప్పి – మీ బ్రదర్‌కి ఇవాళ కూడా అన్నం పెట్టేవా అని గురి చూసి మాటతో కొడతాడు!

ఆ పరామర్శలో 'ధ్వని' కొంచెం బాధాకరంగానే వుంటుంది. వచ్చిన వాడు కేవలం అన్నం కోసమే రాలేదు. పేగు తీపికి భాష్యం చెప్పే తాహతు తనకు లేని కారణంగా – కన్నీళ్లు పెట్టుకుంటుంది. ఇప్పుడేమన్నానని ఏడుస్తున్నావని అడుగుతాడు. తెలిసి కూడా అడుగుతున్నందుకు ఆమె మరింత కుమిలిపోతుంది! మా అన్నను తక్కువ చేసి మాటాడకండని కట్టుకున్న వాడితో చెప్పలేదు. ఒకవేళ చెప్పినా – అతను వెంటనే ప్లేటు ఫిరాయిస్తాడు. ఇప్పుడు నేను ఏమన్నానని మీ అన్నయ్యను వెనకేసుకు వస్తున్నావని అడుగుతాడు. అన్నం పెట్టేవా అని అడిగేను. అది కూడా తప్పేనా? – అని రాగాలు తీస్తాడు. అంతేగాని ఆ మాటలో 'ధ్వని' – అవహేళనను వినిపించిందనే నిజాన్ని అతను అంగీకరించడు!

అన్నయ్యా నువ్వు మా యింటికి రావద్దని అన్నతోనూ చెప్పలేదు. చెబితే కారణం అడుగుతాడు. చెబితేగిబితే మా యింటికి వచ్చి అన్నం తిని పోవడం మీ బావగారికిష్టం లేదని చెప్పాలి. ఎంతైనా భర్త. ఆ భర్త తాలూకు గుణం పరమనీచమని – ఎంత తోబుట్టువైనా, అతనికెట్లా చెప్పగలదు? పెళ్లయిన కొత్త రోజుల్లో – మీ బావగారు ఇంద్రుడూ చంద్రుడని చెప్పిన కారణంగా – ఇప్పుడు మాట మార్చుకుంటే పుట్టింటి వారు తట్టుకోగలరా? తమకు తెలీనివ్వకుండా ఇంకెన్ని కష్టాలు పడుతుందోగదాని తల్లడిల్లిపోరూ? చూపులకు తన భర్త అతి మెత్తని వాడుగానే కనిపిస్తాడు. మాట కూడా ఎంతో పొందిగ్గా వుంటుంది. అయితే ఆ మాట 'సిగ్గులేకుండా భోం చేయండి' అనే బ్రాండని ఆమెకు మాత్రమే తెలుసు! ఎక్కడో చదివింది కూడాను! ఏమని? రామకృష్ణ మెత్తగానే మాటాడుతాడు. ఆ మాటల్లో ధ్వని చురకత్తుల్లా గుండెను కోస్తాయని వాళ్లావిడకు మాత్రమే తెలును! కోపమొచ్చినప్పుడు రంగమ్మ రంకెలు వేస్తుంది. ఆ రంకెల్లో పసిపిల్లని చూడటం ఆమె భర్తకు బాగా తెలుసు!

అంచేత – మెత్తగా మాటాడినా, ముతగ్గా అరిచినా–ఆ మనుషుల తత్త్వం వాళ్లని కన్నవాళ్లకీ కట్టుకున్నవాళ్లకీ బాగా తెలుస్తుందని ఒక సూత్రం! మిగతా జనాభాకి మాత్రం తాత్పర్యం అంతసులువుగా బోధపడదు. మనుషుల్ని మబ్బుల్లో పెట్టడం మగవాడి నైజం. సంసారమన్న తర్వాత కష్టసుఖాలు తప్పవు. కష్టమొచ్చినప్పుడు కృంగిపోవడం – సుఖంగా వున్నప్పుడు పొంగిపోవడం రూలు. గుట్టుగా వుండలేరు. ఆడవాళ్లకిది పుట్టుకతో అబ్బిన గుణం! మనుషుల్ని మబ్బుల్లో పెట్టే మగవాడు మాత్రం – అవసరమనుకుంటే ప్రతి ఆఫ్టరాల్ కష్టానికి స్పందిస్తాడు. అనవసరమనుకుంటే ఎన్ని కష్టాల్లో వున్నా గుట్టుగా వుంటాడు! కలిసొస్తుందనుకున్నప్పుడు సుఖాల్లో వున్నా కన్నీరెట్టుకుంటాడు. కష్టాల్లో నలిగిపోతున్నా చిరునవ్వు మొహాన వెలిగించుకుంటాడు. ఏడుపుల్నీ, నవ్వుల్నీ అతను అవసరాన్ని బట్టి తూకం వేసుకుని ప్రయోగిస్తాడు. అంతా ఏక్టింగు. ఏడ్చినా ఏక్టింగే! నవ్వినా ఏక్టింగే! ★



రమణీయ తీరం రామాయపట్నం

ఎం.వెంకటేశ్వర్లు

తెల్లవారుజామున ఉరక లేస్తూ పైపైకి ఎగిసే ఉదయభానుడి నుండి జాలువారే సూర్యకిరణాలు.... ఉవ్వెత్తున ఎగిసిపడే కెరటాలు.... కనుచూపు మేర కనిపించే సాగరంలో చిన్నచిన్న నావలు... తెరచాప పడవలలో వేటసాగించే జాలర్లు... తీరాన బారులు తీరిన తెప్పలు... ఎత్తైన తెల్లని ఇసుక తిన్నెలు, వాటి పై తీగల్లా అల్లుకున్న విప్పమొక్కల అందాలు. అక్కడక్కడ ఇసుక సొనలు, విరబూసే పుష్పాలు, అద్దంలా మెరిసే బకింగ్‌హాం కాలువ, మైమరిపింపచేసే ఉద్యానవనం, మనస్సునుదోచే ప్రకృతి అందాలు హాయి గొల్పే చల్లని గాలి. ఇది ఎక్కడో కాదు సుమా గుడ్లూరు మండలం తెట్టుకు ఆరు కిలోమీటర్ల దూరంలో రామాయపట్నం సాగరతీరాన అందాలన్నీ కొలువు తీరిఉన్నాయి. బ్రిటీష్ వారి హయాంలోనే ఇక్కడ పర్యాటక కేంద్రంగా గుర్తించి అప్పటి అధికారులు, పర్యాటకులు సేద తీర్చుకోవడానికి వీలుగా విశ్రాంతి మందిరాలు, మంచి నీటి సౌకర్యం ఏర్పరి చారు. సాగరంలో పడవల రాక పోకలను గుర్తించడమే కాక వేటకు వెళ్ళిన మత్స్యకారులు సులువుగా తీరానికి చేరడానికి వీలుగా లైట్‌హౌస్ నిర్మించారు. సముద్రంలో సుదూర ప్రాంతానికి వెళ్ళిన వారు సైతం తప్పిపోకుండా గమ్యానికి చేరేందుకు వీలుగా అప్పట్లోనే పెద్దలైట్‌హౌస్ ఏర్పరచడమే గాక లైట్‌హౌస్ చుట్టూ ఉద్యానవనాలు పెంచారు. సుందరవిహార కేంద్రంగా ఉండే రామాయపట్నం బీచ్‌లో ఉవ్వెత్తున ఎగిసిపడే సముద్రపు అలలకు కేరింతలు కొట్టనివారు ఉండరు. తీరం ఒడ్డున బారులు తీరిన తెప్పలపై కూర్చొని సముద్రంలో వేటసాగిస్తున్న జాలర్లు విన్యాసాలు చేస్తే ఎవరైనా మైమరచి పోవాల్సిందే. జాలర్లు తెప్పలు నీటిలోకి నెట్టుకువెళ్ళే తీరు, వెలుపలకు రావడం ముగ్ధులను చేస్తుంది. పొద్దుపొడిచే సమయంలో ఎర్రని పందులా దర్శనమిచ్చే సూర్యబింబం, సాగరంలోకి జాలువారే కిరణాలు కనువిందు చేస్తాయి. నెల్లూరు- ప్రకాశం జిల్లాలలోని వివిధ పట్టణాలనుండి పర్యాటకులు తరచుగా ఇక్కడకు వస్తారు. శని, ఆదివారాలలో కాలేజీ విద్యార్థులతో కిటకిట లాడిపోతుంది.

1886లో పర్యాటకుల కోసం నిర్మించిన విడిది కేంద్రం

ఎత్తుపల్లాల ఇసుక దిబ్బలలో ఆటలాడే పిల్లలు, యువతరం చేసే సందడి ఎంత చూసినా తనివి తీరదు. కార్తీక పౌర్ణమి, ముక్కోటి, ఏకాదశి, నూతన సంవత్సర సమయాలలో సముద్రస్నానాలకు వచ్చే వారితో ఈ ప్రాంతం కళకళలాడుతూ ఉంటుంది. బకింగ్‌హాం కాలువ కనుచూపు మేర దర్శనమిస్తూ వింత అనుభూతిని రేకెత్తిస్తుంది.

వనభోజనాలకు ఇక్కడకు వచ్చిన వారు మధ్యాహ్నం వరకు బీచ్‌లో గడిపి అనంతరం గెస్ట్‌హౌస్ వద్ద సేద తీర్చుకుంటారు. గెస్ట్‌హౌస్ సమీపంలో పెద్దపెద్దవృక్షాల కింద విశ్రాంతి పొందుతారు. అనంతరం లైట్‌హౌస్, అక్కడ ఉన్న ఉద్యానవనాలలో విహరించి తరలి వెళతారు. ఎన్నో సంవత్సరాలుగా పిక్నిక్ స్పాట్‌గా వెలుగొందిన రామాయపట్నం బీచ్‌కు క్రమంగా పర్యాటకుల ఆదరణ కరువవుతోంది. ఇక్కడ ఎలాంటి అభివృద్ధిపనులను ప్రభుత్వం చేపట్టక పోయినా, పర్యాటకులు తిరుగాడే ప్రాంతాల చుట్టూ అక్వారంగం పెచ్చరిల్లడంతో నీడ నిచ్చే చెట్లు సైతం కరువై కాలుష్య వాతావరణం ఏర్పడుతోంది. తీరం పొడవునా రొయ్యల చెరువులతో నిండిపోవడంతో పర్యాటకుల సందర్శన నానాటికి తగ్గిపోతోంది. 1881 ప్రాంతంలో నిర్మించిన వసతి గృహాలు శిథిలా వస్థకు చేరుతున్నాయి. అప్పట్లో నిర్మించిన ఓ పెద్దభవనం, వాటర్ ట్యాంకు, వంటగది, సామాను నిల్వగదులు క్షీణదశకు చేరుతున్నాయి. కేంద్ర ఉపరితల రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన విడిది కేంద్ర భవన సముదాయానికి అలనా పాలనా లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నది. ఈ విడిది కేంద్రంలో బస చేయడానికి పర్యాటకులు ఎవరైనా జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఫీజు చెల్లించి అనుమతి పొందాలి. దీంతో నేరుగా ఇక్కడకు చేరుకున్న పర్యాటకులు నిరాశకు గురవుతున్నారు. విద్యుత్ సరఫరా లేనందున వాటర్ ట్యాంకు పనిచేయడం లేదు. మంచినీటి కోసం యాత్రికులు నానా అవస్థలు పడుతున్నారు. దీని అభివృద్ధి గురించి పట్టించుకునే నాథుడే లేదు.

కనువిందు చేసే 'లైట్ హౌస్'

సముద్రపు ఒడ్డున అధునాతనంగా నిర్మించిన లైట్‌హౌస్ పడవలకు దిక్సూచి కాగా పర్యాటకులకు వింత అనుభూతి కలిగిస్తుంది. బ్రిటీష్ వారికాలంలో నిర్మించిన పాత లైట్‌హౌస్‌స్థానంలో కొత్త లైట్‌హౌస్ రూపుదిద్దుకుంది. పాత లైట్‌హౌస్ పరిసర ప్రాంతాలలో కిరోసిన్, ఇంధనాలతో లైట్లు ఏర్పాటు చేశారు. 1980 తరువాత లక్షలాది రూపాయల వ్యయంతో లైట్ హౌస్‌ను ఆధునీకరించారు. దీనిలో భాగంగా రీమోడల్ చేసి ఎలక్ట్రిసిటీ, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ దీపాలు ఏర్పాటు చేశారు. లైట్ హౌస్ పైభాగంలో వెలిగే కాంతి 15 కిలోమీటర్లు ప్రసరిస్తూ కన్పిస్తుంది. స్టీమర్లు, పడవలకు సముద్రంలోపల 80 నాటికల్ మైళ్ళ దూరం కన్పిస్తుంది. కాంతి వేగం 6 ఆర్.పి.ఎం.గా తిరుగుతుంది. ఫ్లాష్ లైట్ ప్రతి 10 సెకండ్లకు 0,22,75,10 సెకండ్ల రేంజ్‌గా నమోదయింది. ఈ లైట్ హౌస్ చూడడానికి వేల సంఖ్యలో యాత్రికులు తరలి వస్తుంటారు. ఇలాంటి లైట్‌హౌస్‌లు ఆర్మగం, కృష్ణపట్నం, నాగాయలంక, మచిలీపట్నం, వైజాగ్ లలో ఉన్నాయి. లైట్‌హౌస్ చుట్టూ పార్కు ఆహ్లాదకరమైన వాతావరణం సందర్శకులను అలరిస్తుంది. ★

రామాయపట్నం లైట్‌హౌస్



ఎం.డి.హసన్ షరీఫ్

భారత్‌పై ఎందుకీ కక్ష ?

ఇటీవలి కాలం వరకు మ్యాచ్ ఫిక్సింగ్ ఉదంతం పట్టి పీడించిన భారత క్రికెట్‌ను ఇప్పుడు తాజాగా మరో సమస్య పీడిస్తోంది. ప్రపంచ క్రికెట్ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఆరుగురు క్రికెటర్లపై మ్యాచ్ ఫీజులో భారీ జరిమానా, మ్యాచ్‌లలో నిషేధం విధించడాన్ని భారత్ జీర్ణించుకోలేకపోతోంది. మ్యాచ్ రిఫరీ మైక్ డెనీస్ ఈ చర్యకు ఎందుకు సాహసించినట్లు ? సచిన్ ట్యాంపరింగ్‌కు పాల్పడితే ఇతర క్రీడాకారులను ఎందుకు శిక్షించినట్లు ? అతిగా అప్పీలు చేసినందుకే ఇంత పెద్ద శిక్ష విధించాలా ? ముఖ్యంగా ఏ తప్పూ చేయని కెప్టెన్ సౌరవ్ గంగూలీపై సహచరులను అదుపులో పెట్టలేదనే నెపంతో అందరికంటే ఎక్కువ శిక్ష విధించడం ఎంతవరకు సబబు ? ఈ చర్యలతో రిఫరీ ఏం సాధించాలనుకుంటున్నట్టు ? భారత క్రికెటర్లపై విధించిన శిక్షలపై ఒకవైపు దేశంలో ఆగ్రహావేశాలు పెల్లుబుకు తుండగా మరోవైపు ప్రపంచ క్రికెట్ ప్రముఖులు (ఇంగ్లండ్ క్రికెట్ అధికారులు, ఆసీస్ కెప్టెన్ స్టీవ్‌వా, దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్లు) ఈ చర్యను సమర్థించడం వెనుక గల అంతర్యమేంటి ?

హ్యాన్సీ క్రానేపై ఫిక్సింగ్ ఆరోపణలకు ప్రతీకార చర్య

ప్రపంచ క్రికెట్ చరిత్రలో అతిగా అప్పీలు చేసిన వారు ఎంతోమంది క్రీడాకారులు ఉన్నారు. ప్రత్యర్థి బ్యాట్స్‌మన్‌పై ఒత్తిడి తెచ్చి ఔట్ చేయడానికి ప్రయత్నించడంలో పాకిస్తాన్, ఆస్ట్రేలియా క్రికెట్ జట్ల ఆటగాళ్లు అందరికంటే ముందున్నారు. పాక్ మాజీ కెప్టెన్ జావెద్ మియాందాద్ వివాదాస్పద క్రికెటర్‌గా ప్రఖ్యాతిగాంచాడు. తన జట్టు ఓటమి పాలయ్యే పరిస్థితిలో ఉన్నా, పటిష్ట స్థితిలో ఉన్నా ప్రత్యర్థి జట్టు ఆటగాళ్ళను ఏదో ఒక విధంగా రెచ్చగొట్టి వారి దృష్టిని మళ్ళించడంలో మియాందాద్ దిట్ట. భారత్‌తో గతంలో వన్డే సిరీస్ సందర్భంగా మియాందాద్ కుప్పిగంతులు వేయడం మ్యాచ్‌ను టెలివిజన్‌లో తిలకిస్తున్న వారికి కూడా స్పష్టంగా కనిపించింది. అయితే ఒక్క సందర్భంలో కూడా అతనిపై చర్య తీసుకున్న దాఖలాలు లేవు. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టెస్ట్‌లోనే ఆ జట్టు కెప్టెన్ షాన్ పొల్లాక్ చాలాసేపు అప్పీలు చేసిన విషయం కూడా టెలివిజన్‌లో స్పష్టంగా కనిపించింది. దాన్ని పట్టించుకోని రిఫరీ సెహవాగ్, హర్భజన్ సింగ్, దీప్ దాస్ గుప్తా, శివసుందర్ దాస్‌ను శిక్షించడం



కావాలని తీసుకున్న చర్యే. రిఫరీ నిర్ణయాన్ని కూడా అతను స్వయంగా ప్రకటించలేదు. అతని తరపున దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు ప్రతినిధి ప్రకటించాడు. అంటే దీని వెనుక దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు గూడుపుఠాని దాగి ఉందనిపిస్తోంది. భారత్‌లో దక్షిణాఫ్రికా పర్యటన సందర్భంగా హ్యాన్సీ క్రానేపై మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు రావడంతో కసి పెంచుకున్న దక్షిణాఫ్రికా క్రికెట్ అధికారులు ఆవేశంలో భారత్ పర్యటిస్తున్న సందర్భంగా పగతీర్చుకోవాలని ప్రయత్నించారు. వన్డే సిరీస్ సమయంలో వారికి ఎటువంటి అవకాశం దొరకలేదు. సిరీస్ ముగియబోతున్నందున ఏదో ఒక సాకుతో పగ తీర్చుకోవాలని వారు భావించి ఉంటారు. వర్షం కారణంగా మైదానం బురదమయమైనందున బంతికి తగిలిన మట్టిని తొలగిస్తున్న సచిన్ చర్య ఒక్కటే వారికి సాకుగా కనిపించింది. తాము చూపించిన కారణాలు ఎంతవరకు నిలబడగలుగుతాయో అనే ఆలోచన కూడా లేకుండా వారు ఏకంగా ఆరుగురిపై నిషేధం కూడా విధించారు. సామాన్యంగా ట్యాంపరింగ్ ఆరోపణలు వస్తే మ్యాచ్ రిఫరీ రిపోర్టును ఐసిసికి నివేదించడం సాంప్రదాయం. ఐసిసి ప్రత్యేక కమిటీ పరిశీలించిన తర్వాత నిషేధంపై తుది నిర్ణయం తీసుకుంటారు. అయితే రిఫరీ తరపున దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు అధికారి ఆదరాబాదరాగా ప్రకటించడంలోనే వారి దుర్బుద్ధి దాగిఉంది.

వర్ణవివక్ష కారణమా ?

వర్ణవివక్షకు మారుపేరైన దక్షిణాఫ్రికాలో ఆ దురాచారానికి వ్యతిరేకంగా నెల్సన్ మండేలా దీర్ఘకాలంపాటు పోరాటం చేశారు. ఇప్పుడు ఆ దురాచారం తమదేశంలో లేదని దక్షిణాఫ్రికా ప్రకటించింది. అయినా ఇప్పుడు ఇంగ్లండ్‌కు చెందిన శ్వేతజాతీయుడు డెనిస్ భారత్‌పై ఈ చర్య తీసుకోవడం, దానికి శ్వేతజాతీయులంతా మూకుమ్మడిగా మద్దతు పలకడంతో వర్ణవివక్షత మళ్ళీ తెరపైకి వచ్చింది. భారత్‌కు అన్యాయం జరిగిందని స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ ఐసిసితో సహా శ్వేతజాతీయులెవరూ ఖండించకపోవడం అ[illegible]నాలకు తావిస్తోంది. ముఖ్యంగా ఆసియా వాసులపై గతంలో కూడా పక్షపాత ధోరణితో వ్యవహరించిన దాఖలాలు ఉన్నాయి. అన్నిరంగాల్లో పట్టి పీడిస్తున్న ఈ దురాచారం క్రికెట్‌లో కూడా వ్యాపించడం బాధాకరవిషయం. ★

సచిన్ ట్యాంపరింగ్‌కు పాల్పడలేదని చెప్పడానికి పది కారణాలు

1. సచిన్ భారత జట్టులో ప్రధానబౌలర్ కాదు. పార్ట్‌టైమ్ బౌలర్ అయిన సచిన్ వికెట్లు రాబడ్తాడనే ఆశల్లో భారత్ లేదు.
2. రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా పటిష్ట స్థితిలో ఉంది. సచిన్ హ్యాట్రిక్ సాధించినా భారత్ గెలుస్తుందనే నమ్మకం లేదు.
3. సీనియర్ సభ్యుడైన సచిన్ బంతిని నిజంగానే ట్యాంపరింగ్ చేయదలిస్తే టెలివిజన్ కళ్ళకు చిక్కకుండానే పని పూర్తి చేసేవాడు.
4. ప్రపంచ ఉత్తమ బ్యాట్స్‌మన్‌గా ప్రఖ్యాతిగాంచిన సచిన్ ట్యాంపరింగ్ ద్వారా వికెట్లు తీస్తే బెస్ట్‌బౌలర్‌గా ఇప్పుడున్న దానికంటే ఎక్కువ పేరు వచ్చే అవకావం లేదు.
5. వర్షం వల్ల మైదానం బురదగా ఉంది. బంతికి తగిలిన మట్టిని తొలగించడానికి (టెలివిజన్‌లో చూపిన విధంగా) రుద్దాల్సిన అవసరం ఉంది.
6. సునీల్ గవాస్కర్ వాదన ప్రకారం సచిన్ అంపైర్ అనుమతి తీసుకోవచ్చు కానీ తప్పనిసరిగా తీసుకోవాలని నిబంధన ఏమీలేదు. సచిన్ బంతిని మామూలుగానే రుద్దాడు తప్ప ప్రత్యేకంగా బంతి షేప్‌ను మార్చడానికి ప్రయత్నించినట్లు లేదు.
7. ముఖ్యవిషయం ఏమంటే బౌలర్లు బంతిని క్లీన్ చేయడానికి అన్నిసందర్భాల్లో అంపైర్ అనుమతి తీసుకోవాలనడం అసంబద్ధం.
8. సచిన్ ట్యాంపరింగ్ చేస్తే అతని కేసును ఐసిసికి నివేదించాలి. ఐసిసి అనుమతితోనే దోషిపై యువేటువేయాలి. ఐసిసి నిబంధనలను ఇక్కడ దుర్వినియోగం చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది.
9. తన తప్పువల్ల ఇతరులను కూడా వివాదంలోకి నెట్టే ప్రయత్నం సచిన్ చేయబోడు.
10. సచిన్ పదేళ్ళ క్రీడా జీవితంలో మచ్చలేని ఆటగాడిగా పేరు సంపాదించాడు. అతను ఎప్పుడూ ఫేర్‌గేమ్ ఆడడానికే ఇష్టపడ్తాడే తప్ప అసంబద్ధ చర్యలతో రాణించడానికి ప్రయత్నించిన రికార్డు లేదు.

తెలకపల్లి రవి



ఆ రాత్రి అమరయ్య ఇంటికి రాగానే అపర్ణ అందిగదా;

"రేపటి నుంచి ఆర్టీసీ సమ్మె అంటున్నారు. మరి ఆఫీసుకు ఎలా వెళ్లాలో ఏమో "

అమరయ్య వూ అన్నాడే గాని పెద్దగా సమాధానం ఇవ్వలేదు. తర్వాత భోజనానంతరం మనసులో భావం వెల్లడించాడు-

"అంటారు గాని సమ్మె దాకా వెళతారా పెడతారా. ఏదో చివర వరకు అలా అంటూ ఏదో



ఒప్పందం కుదుర్చుకుని ఆఖరి క్షణంలో ప్రజల ఇబ్బందుల దృష్ట్యా సమ్మె యోచన విరమించాము అని ప్రకటిస్తారు."

"అంతేనంటారా?"

"అంతగాక...మనం ఎన్ని సార్లు చూడలేదు..... ఈ పాటికి ప్రకటన చేసే వుంటారు. రేపు పొద్దున్నే పత్రికల్లో చూడు."

"ఏమో మరి. ఇందాక తొమ్మిది గంటల న్యూస్ కూడాచూశాను. అలాటిదేం లేదు. "

"సర్లే. రేపు చూద్దాం. మీ స్కూలు ఈ పక్కనే కదా. అయితే గియితే నాకే ఇబ్బంది. అయినా ఆటోలు వుంటాయి లే "

★ ★ ★

డ్యూటీకి బయలుదేరిన అమరయ్యకు కిటకిటలాడే సిటీబస్ స్టాండ్ బోసి పోయి దర్శనమిచ్చింది.

అది అతనెన్నడూ చూడని దృశ్యం. అతనిలోని ఉద్యోగి సంతోషించాడు. 'భలే చేస్తున్నారే 'అనుకున్నాడు.

వరుసగా మూడు రోజులు ఆటో పట్టుకుని గమ్యస్థానం చేరుకున్నాడు. అయిదో రోజున రోడ్డు మీద అక్కడక్కడా ఆర్టీసీ వాహనాలు కనిపించాయి.

'అంతే. ఎన్ని రోజులు చేయగలరు?' లోలోపలే అనుకుంటూ ఏదో వాహనం కోసం ఎదురు చూడసాగాడు.

బస్‌స్టాండు నిండా ప్రయివేటు బస్సులు. చాలా చికాకనిపించింది. ఎవరికి వారే ఎగబడుతున్నారు. రోడ్లమీద ట్రాఫిక్ కూడా గందరగోళంగా వుంది.

"ఆర్‌టిసి స్ట్రయిక్ వల్ల రద్దీ తగ్గాలి గాని పెరిగిందేమిటి?" ఎవరో అంటున్నారు.

" నిముషానికో బస్సు వస్తుంటే ఎవరూ అడ్డదిడ్డంగా వెళ్లే అవకాశముండేది కాదు. ఇప్పుడు ఇష్టారాజ్యమేగా" మరెవరో ఇచ్చిన వివరణ బాగానే వున్నట్టనిపించింది అమరయ్యకు.

★ ★ ★

మూకుమ్మడి ఆటోలో ఎక్కాడు . ఆటో వాడు గొణుక్కుంటున్నాడు.

"ఆర్టీసీ స్ట్రయిక్ అంటే మాకు బేరాలు వస్తాయి కదా అనుకున్నాం. ఎక్కడా ?ప్రయివేటు బస్సులవాళ్లే గద్దల్లా తన్నుకు పోతున్నారు. మాకేం దక్కుతుంది? మట్టి!" ఆటోవాలా బాధ పడుతున్నాడు.

"ఇస్ట్రయిక్ మరీ ఇన్నిరోజులంటే ఎట్లా ? పబ్లిక్‌ను కూడా చూడాలి కదా "మరో ప్యాసింజరు.."

"సమ్మె చేసేవాళ్లు కూడా పబ్లికే బాబూ. జీతాలు చాలకగాని సరదా కోసం చేస్తున్నారంటావా" నడివయస్కుడొకాయన కొంచెం కోపంగానే అన్నాడు.

"మేము సమ్మె చేసేది జీతాల కోసం కాదు. ఆర్టీసిని ప్రయివేటు చేయకుండా ఆపడానికి అని వాళ్లంటున్నారు కదా".

"అదైతే నిజమే. మా మామయ్య ఐడిపిఎల్‌లో జేసెటోడు. ఇప్పుడు ఖాళీ పడిపోయిండు. ఏదో ఒకటి జెయ్యక పోతే సర్కార్ దిమాక్‌కెక్కదు."

"అట్లగాదన్నా . మేము లేబరోళ్లం. మాకొచ్చేడిదే 1200. 300 పెట్టి పాస్ తీసుకున్నాం. ఇస్ట్రయిక్ వచ్చి అవి పనికి రాకుండా పోయినయి. ఇంకేం చేస్తాం?"

"స్ట్రయికులు చేయకపోతే ఆర్టీసీని ప్రయివేటోళ్లకప్పగిస్తారు. అప్పుడు పాస్‌లు గీస్‌లు అసలేం వుండవు" ఇందాకటి పెద్ద మనిషి చెబుతున్నాడు.

★ ★ ★

అమరయ్యకు ఏవో సందేహాలకు సమాధానాలు దొరుకుతున్నట్టనిపించింది. మూమూలుగానే అతను అలాటి చోట వినడం తప్ప తను మాట్లాడడం తక్కువ.

తమ ఆఫీసు కూడా మూసేస్తారని చాలా మంది అంటున్నారు. మంత్రి మాత్రం అబ్బే, లేదని ఖండించాడు.

"ఇలా చెబుతూనే అన్నీ మూసేశారు కదా. మనకూ అదే గతి పడుతుంది "అని కొలీగ్స్ కొందరు అంటుంటే తను పూర్తిగా నమ్మలేదు గాని నమ్మకుండానూ వుండలేక పోతున్నాడు.

"అయినా పూర్తిగా మూసేశాక మనం చేసేదేముందీ బూడిద. చేస్తే ముందే చేయాలి" అని యూనియన్ లీడర్ పవన్ కుమార్ అనే మాటలు అమరయ్యకు ఆ క్షణంలో గుర్తుకు వచ్చాయి.

ఆలోచనల్లో వుండగానే ఏదో కలకలం. ఆక్సిడెంటు .

బస్ డ్రయివరు లేడంట. క్లీనర్ స్టీరింగు దగ్గర కూచున్నాడు. ఎందుకో కంట్రోలు తప్పి పోయింది ఆగిన ఆటోలో అమరయ్య చెవిన పడ్డ సమాచారం.

★ ★ ★

అలా తంటాలు పడి ఇంటికి చేరే సరికి తొమ్మిది. ఈటీవీ న్యూస్ వస్తున్నాయి. హెడ్‌లైన్స్‌లోనే ఆర్టీసి స్ట్రయిక్ గురించి చెపుతున్నాడు.

"ఫర్వాలేదే...వీళ్లూ స్ట్రయిక్‌కు మంచి కవరేజినే ఇస్తున్నారు.."

"కోటి మంది ప్రయాణీకులు, లక్ష మందికి పైన వర్కర్లు .కవరేజి ఇవ్వకపోతే ఎలా కుదురుతుంది? ఆడియన్సు వూరుకుంటారా?" అపర్ణ అంది.

"ఉండుండు. మినిస్టరేదో చెబుతున్నాడు."

ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులలో వుంది.కార్మికుల కోర్కెలన్నీ తీర్చలేము.చేతనైనంత వరకు న్యాయం చేస్తాం. సమ్మె ఆపాలని మంత్రి అనడం పూర్తి గాకుండానే-

"ఏం చెబుతున్నాడండి. వారం రోజుల నుండి ఇవే మాటలు," ఆమె విసుక్కుంటూ అంది.

ఇంతలో యూనియన్ లీడరు మాటలు వచ్చాయి.

"మేము మా డిమాండ్ల కోసమే పట్టు పడుతున్నామన్నట్టు మాట్లాడ్డం అన్యాయం. ఆర్టీసీపై పన్ను తగ్గించాలని అడుగుతున్నాం. గవర్నమెంటు ఆ సంగతి కప్పిపుచ్చి మా మీద దుష్ప్రచారం చేస్తున్నది" ఆయన కోపంగా చెబుతున్నాడు.

అది పూర్తి కాకుండానే ఎం.డి. మాటలు. "సమ్మె తగ్గి పోతుంది. మా మాట విని ఈ కష్ట కాలంలో సహాయ పడిన వారికి ప్రిఫరెన్సు ఇస్తాం. పిలిచినా రాని వారిని తీసేస్తాం."

"బెదిరిస్తున్నారన్న మాట."

"లేకపోతే వర్కర్లు దిగిరారు కదా"

"పట్టుదల పట్టాక బెదిరించినా దిగిరారు"

"చూడాలి"

★ ★ ★

ఉదయాన్నే ఇంటికెవరో బంధువులు వచ్చారు.అతను సెక్రటేరియట్‌లో పని చేస్తున్నాడు. తనకు సమ్మెలూ యూనియన్ల సంగతులు అంతగా పట్టవని తెలుసు. కనక అమరయ్య ఇంటి విషయాలు బంధువుల గురించిన కబుర్లు మాత్రమే మాట్లాడుతున్నాడు. కానీ అతనే సమ్మె గురించి మాట్లాడాడు.

"ఈ రోజు పేపరు చూశారా? గవర్నమెంటు పాలసీల వల్లనే ఆర్టీసీకి నష్టాలు వస్తున్నాయని రాశాడు."

"ఔను మరి. ఇన్ని రోజుల తర్వాత నైనా ఆ మాత్రం రాశాడు. మంచిదే."

"ఎంప్లాయిస్ వూరుకుంటే లాభం లేదు. ఏదో ఒకటి చేయాల్సిందే." తను వూహించని వ్యక్తి నుంచి అనుకోని మాట వచ్చేసరికి అమరయ్యకు నిజంగానే ఆశ్చర్యం కలిగింది.

"కాని చాలా రోజులై పోయింది. ఇంకా కంటిన్యూ చేయగలరో లేదో?" అని ఆలోచనగా అన్నాడు.

★ ★ ★

కాని మరుసటి రోజు రోడ్డు మీదకెళ్లి చూసే సరికి బస్సుల కదలిక పెరగలేదు సరికదా తగ్గింది. ప్రయివేటు బస్సుల హడావుడి చీదర పుట్టిస్తున్నది.

అయినా సమ్మె టైములో అవి ఎక్కకూడదని కృతనిశ్చయుడైన అమరయ్య యధాతథంగా ఆటో ఎక్కి గమ్యస్థానానికి బయల్దు దేరాడు.

నాంపల్లి వద్దకు వస్తుండగా ట్రాఫిక్ జామ్. " స్ట్రయిక్‌కు సపోర్టుగా ధర్నా " అని చెబుతున్నాడు ఆటోలో కో - ప్యాసింజరుతో అతని మిత్రుడు.

"ఇంకేం చేస్తాం. వెయిట్ చేయాలి. ఈ దేశం బాగుపడదు" అతనన్నాడు

"నిజంగానే నీలాటి వాళ్లున్నంతవరకు బాగుపడదు" ఆ ఫ్రెండు ఎదురు వడ్డించాడు. ఆసక్తిగా వింటున్న అమరయ్య నవ్వుకున్నాడు.

ఇంతలో కలకలం.అరుపులు, కేకలు.

"లాఠీఛార్జి చేశారు.శానా మందికి దెబ్బలు తగిలాయి. ఎవరికో తల పగిలింది." అటు నుంచి వచ్చిన పాసింజరు చెప్పాడు.

ఇంతలోనే పోలీసు వ్యాన్లు చాలా మందిని ఎక్కించుకుని రయ్యి రయ్యిన దూసుకుపోయాయి. వాటిలోంచి నినాదాలు.

అమరయ్యకు చాలా ఉద్రేకం కలిగింది.

"రోడ్డు మీద కాస్సేపు ట్రాఫిక్ ఆపేసినంత మాత్రాన అంతగా కొట్టాలా? సీఎం వస్తున్నాడని, అదని ఇదని ఎన్ని సార్లు ఆపరు?" పక్కనున్నతని తో అన్నాడు.

"ఏం చేస్తాం. గవర్నమెంటు వాళ్లది"

★ ★ ★

బంధువులను పంపించడానికి తప్పనిసరై వెళ్లాడు అమరయ్య.ప్రయివేటు వారి వ్యవహారం మహా రువాబుగా వుంది. మామూలుగా చేసే మర్యాదలు లేవు కదా మేము తప్ప దిక్కెవరన్నేట్లు వుంది వారి ధోరణి. బాగా ఆలస్యం కూడా అయింది. పది రోజుల సౌభాగ్యానికే ఇంతగా ఎగిరి పడుతున్నారే, ఇంక మొత్తం వీళ్లకే వదిలితే ప్యాసింజర్లను నమిలేయరూ అనుకుంటూ ఇంటి దోవ పట్టాడు.

★ ★ ★

ఆఫీసులో అందరూ అదే మాట్లాడుతున్నారు.

" ఇన్ని యూనియన్లు కలసి సమ్మె చేయడం నా జన్మలో చూడలేదు. మనమూ వున్నాం ఎందుకూ? వి.ఆర్.ఎస్. అని మెడమీద కత్తిపెట్టి బెదిరిస్తున్నా యునైట్ కాలేకపోయాం."

మన గొడవ ఎందుకులే. వాళ్లయినా చేస్తున్నారు సంతోషించు.

"గవర్నమెంటు డిఫెన్సులో పడిపోయిందనుకో. రోజూ ఆ మినిస్టరు పాట్లు చూస్తుంటే నవ్వొస్తోంది."

"నవ్వు కాదు కడుపు మండి పోతుంది. చావగొట్టి జైళ్లలో పెడితే నవ్వెలా వస్తుంది?" ఇంకో దోస్తు కోపంగా అంటున్నాడు.

నర్లేవోయ్. నేననేదొకటైతే నీవొకటనుకున్నావు. వర్కరనేవాడు స్ట్రయికు మొదలెట్టనే కూడదు. స్టార్ట్ చేశాడంటే మాత్రం తేలిగ్గా దిగిరాడు.

అంతెందుకురా ఇందిరాగాంధీ అంతటిది రైల్వే స్ట్రయికుతో తలకిందులై పోలేదూ?

ఇది అంతకన్నా తక్కువేం కాదు.

"ఇక ఆపడం కష్టంరా. ఏదో ఒక దానికి ఒప్పుకోవడం మంచిది. లేకుంటే పరువు పోతుంది."

కొలీగ్ కామెంటుకు అమరయ్యకు ఎక్కడ లేని కోపం వచ్చింది. "మీరలాగే అంటార్రా. వర్కర్లెప్పుడూ గట్టిగానే వుంటారు. మీ లాటి వాళ్లే పిరికి మందు నూరిపోస్తారు. మొదట నేనూ అలాగే అనుకున్నా గాని స్ట్రయికు పెరిగిందే తప్ప తగ్గలేదు. అందుకే కదా గవర్నమెంటు మెట్టుదిగి చర్చలకు పిలిచింది?"

చూద్దాం ఈ సారైనా కుదురుతుందేమో.

అలా మరో మూడు రోజులు గడిచినా స్ట్రయికు కాలేదు. అమరయ్యకు ఇంట్లో, ఆఫీసులో కూడా ఆ టాపిక్ ఇంపార్టెంటైపోయింది. డైలీ సీరియల్‌లా ఫాలో అవుతున్నారు.

తర్వాత ఒక రోజు సినిమాకు వెళ్లి వస్తుంటే బస్ డిపో దగ్గర బాణాసంచా కాలుస్తున్న శబ్దాలు వినిపించాయి.

"స్ట్రయిక్ అయిపోయినట్టుంది అన్నాడు" అమరయ్య అపర్ణతో.

★ ★ ★

మళ్లీ రోడ్డు మీదకు వచ్చిన ఆర్టీసీ బస్సులను చూస్తే అమరయ్యకు బోలెడు ఆనందం వేసింది. కండక్టరును అడిగి అన్ని విషయాలు తెలుసుకున్నాడు. అభినందిస్తూ మాట్లాడాడు.

ఆఫీసులో టాపిక్ మళ్లీ అదే.

"మొత్తానికి భలే చేశార్లే. అంతా కలసి చేయబట్టే స్ట్రయిక్ సక్సెస్ అయింది" అమరయ్య అన్నాడు.

"అయినా చివర్లో ఒక యూనియన్ డిఫర్ అయింది కదా",

"తన ఒపీనియన్ తను చెప్పింది కాని యూనిటీ చెడగొట్టలేదు కదా. అయినా గవర్నమెంటు కూడా డివైడ్ అండ్ రూల్ పాలసీ చేసిందిలే..."

"చూడు బ్రదర్. మనకు వేరే వేరే యూనియన్లంటూ వున్నాక డిఫరెన్సెస్ ఎలాగూ వుంటాయి. సర్దుకుంటూ స్ట్రగుల్ చేయాలి"

"ఏమిటోయ్ నీవు కూడా యూనియన్ లీడర్‌లా మాట్లాడుతున్నావు" కొలీగ్ ఎద్దేవా చేసినా అమరయ్య ఉడుక్కోలేదు.

మన సంగతి మనం మాట్లాడ్డానికి లీడర్లం కావాలా ఏమిటి అని మాత్రం అన్నాడు.

★ ★ ★

వార్తలు చూడ్డం కోసం త్వరగా ఇంటికి చేరిన అమరయ్య కార్మికులకు ముఖ్యమంత్రి హితబోధ అని హెడ్‌లైన్సులో విన్నాడు కాని ఫాలో కాలేక పోయాడు. ఏమన్నాడట అని అపర్ణను అడిగాడు.

చూద్దాం. మళ్లీ చెబుతాడుగా అంది. ఆ సంగతి మాకూ తెలుసులే అంటూ శ్రద్ధగా వినసాగాడు. స్ట్రయిక్ అయిపోయింది గనక ఇంక అందరూ ఆర్టీసీకి లాభాలు తేవడానికి పని చేయాలని సి.ఎం. హితవు చెప్పినట్టు న్యూస్ వస్తోంది.

" మీ పాలసీలు బాగుంటే నష్టాలెందుకు వస్తాయి " కసిగా అంటూ టీవీ కట్టేసి, ఫోన్ ఎత్తుకున్నాడు.

ఏదేమైనా మనం కూడా జాయింట్ యాక్షన్ కమిటీ పెట్టాల్సిందేనని ఇద్దరు ముగ్గురికి ఫోన్లు చేసి చెప్పాడు.

తమ యూనియన్లన్నీ పోరాడుతున్నాయి. పోలీసులు వచ్చారు. ఉద్యోగులు భయపడలేదు. అరెస్టులు చేశారు. జైళ్లకు పంపించారు. నినాదాలు మార్మోగుతున్నాయి. చివరకు గవర్నమెంటు చర్చలకు పిలిచింది. అన్ని డిమాండ్లకు అంగీకరించింది.

మాదే ఘన విజయం అమరయ్య కలవరింతతో మెళకువ వచ్చిన అపర్ణ చిన్నగా నవ్వుకుంది.

తనకూ అలాటి సమ్మె స్వప్నమే వచ్చిన సంగతి పొద్దున లేవగానే చెప్పాలనుకుంది.

(ఈ కథ గాని కథకు ప్రేరణ ఆర్టీసీ కార్మికుల చైతన్యమే)

★

ముస్లిం దేశభక్తుల రేఖాచిత్రాలు

భారతస్వాతంత్ర్యోద్యమం - ఆంధ్రప్రదేశ్ ముస్లింలు,
రచన: సయ్యద్ నశీర్ అహమ్మద్, ప్రచురణ : పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్శిటీ ఆర్థిక సహాయంతో వెల: 30

ముస్లింలందరూ దేశద్రోహులేనని, ఐ.ఎస్.ఐ. ఏజెంట్లేనని హిందూత్వవాదులు బురద జల్లుతూనే వున్నారు. చరిత్రకు వక్రభాష్యం చెప్తూ ముస్లింల దేశభక్తిని, త్యాగాలను శంకిస్తూనే వున్నారు. తెలంగాణా సాయుధపోరాట కాలంలో ముస్లిలందరూ రజాకార్లేననే దురవగాహనను కూడా కల్గి వున్న వాళ్ళు వున్నారు.

ఈ దేశంకోసం ఎందరో ముస్లింలు ప్రాణత్యాగాలు చేశారు. ఆంధ్రదేశంలో ముస్లింలు చేసిన సేవలు అనన్యసామాన్యమైనవి. కాని వారికి చరిత్రలో చోటు దొరకలేదు. చరిత్ర రచనలో వున్న మతతత్వ పాక్షిక దృష్టి, అహేతుకత దీనికి కారణం.

సయ్యద్ నశీర్ అహమ్మద్ "భారత స్వాతంత్ర్యోద్యమం – ఆంధ్రప్రదేశ్ ముస్లింలు" అనే గ్రంథంరాసి చరిత్ర కళ్ళు తెరిపించారు. తెల్ల దొరలకు వ్యతిరేకంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పరితపించిన, పోరాడిన 'అమానుల్లాఖాన్', నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన 'షహీద్ షోయబుల్లాఖాన్', ఖద్దరు ఇస్మాయిల్‌గా ఖ్యాతిగాంచిన 'మహ్మద్ ఇస్మాయిల్', విద్యార్థియువజన ఉద్యమాల నిర్మాత 'షేక్ గాలిబ్ సాహెబ్', చారిత్రక సబ్‌మెరైన్ సాహస ప్రయాణంలో నేతాజీవెంటున్న సహచరుడు 'అబిద్ హసన్ సఫ్రాని' గురించి మనకు నశీర్ అహమ్మద్ గ్రంథీకరించకుంటే తెలిసేవారు కారు.

1857కు పూర్వం నుంచీ స్వాతంత్ర్య పోరాటం వరకూ పాల్గొన్న వీరుల సమాచారాన్నంతా సేకరించి, అతిశయోక్తులకు పోకుండా, వాస్తవికంగా రాశారు. ఇంత ఘన చరిత్రవున్న ముస్లిం దేశభక్తుల గురించి కనీసం పాఠ్యాంశాలుగా కాదు గదా చరిత్ర రచనలో సైతం విస్మరించబడటం పెద్ద కుట్ర. ఆ కుట్రను బద్దలుకొట్టిన నశీర్ అహమ్మద్ అభినందనీయుడు.

- జిలుకర శ్రీనివాస్

'అక్కడక్కడే అయినా అందమైన చమత్కారాలు'

ఆంధ్రప్రభ వారపత్రికలో వందవారాల పాటు సాగిన 'శ్రీ ఛానల్' శీర్షికనుండి యాభై ఫీచర్స్‌ను అదే పేరుతో వెలువరించారు రచయిత శ్రీరమణ. రచయిత తన స్వానుభవంతో కొన్నింటిని రాస్తే మరికొన్నింటిని సెటైర్ కోసమే రాశారు. చాలా వాటిల్లో హాస్యం పండింది. కొన్నిచోట్ల పరోక్షంగా చురకలు కూడా వేస్తారు. వారు ముందుమాటలో చెప్పుకున్న ప్రకారం జాగ్రత్తగా వెదికితే అక్కడక్కడ అందమైన చమత్కారాలు దొరుకుతాయి. కాలేజీ లైబ్రరీలోని పుస్తకాలకు చమత్కార సంభాషణలు రాసే విద్యార్థులు (కొనంగి రాతలు), డెలివరీ డేట్‌ను ముందుగా చెప్పి ఆ సమయానికి డెలివరీ ఎలాగూ కాదు కనుక ఆ పేరుతోరెండు రోజులు ఆలస్యం చేసి నార్మల్ డెలివరీ సమయానికి ఆప రేషన్ చేసే లేడీ డాక్టర్ (సిజేరియన్), అమెరికా వెళుతున్న ఒక వ్యక్తి తాను తనకోసం తీసుకువెళ్తున్న సరకుల కన్నా ఇక్కడివారు తమ బంధువులకు పంపే సామాన్లు ఎక్కువ ఉండటం చూసి బిత్తరపోవడం (ఎస్కార్ గంటల), చిన్న చిన్న వాటికే మహదానందపడిపోయే వారి మనస్తత్వం (చిరానందలహరి), పై ఆఫీసర్ కంప్లయింట్ చేయకముందే తన మీదే తానే పై అధికారులకు ఫిర్యాదు పంపమని కోరే సుదర్శనం (లౌక్యశ్రీ), బయట వాతావరణ మార్పులకు తోడు రేడియోలో వేసే కొన్ని పాటలు సందర్భానుసారం ఎలా భయపెట్టేది (చక్రవాక తుపాను), ఎదుటివాడికంటే నాకు ఎక్కువ తెలుసు అనే భావంతో బతికేవారి విషయాలు (నేనూ-వాడూ) ఆకట్టుకుంటాయి.

'శ్రీ ఛానల్'
రచన : శ్రీ రమణ, వెల:రూ.50/-, **ప్రచురణ :** నవోదయ పబ్లిషింగ్ హౌస్

విమర్శకుల గురించి ఆయన 'క్రిటిక్స్' అనే ఫీచర్‌లో తన అభిప్రాయం చెబుతారు. చాలా నమ్రతగానే ఆయన అటు రచయితల వైఖరిని, ఇటు విమర్శకుల వైఖరిని పేర్కొన్నప్పటికీ చివర్లో ఇచ్చిన ఓ కథ 'విమర్శకులూ జాగ్రత్త!' అంటుంది. ఈ పుస్తకంలో ప్రయోగాత్మక శీర్షికగా 'మహాకవులూ-మాతృప్రేమలు'ను పేర్కొనవచ్చు. ప్రసిద్ధి చెందిన కవుల కవితల నుండే ఒక పాదాన్ని తీసుకొని వాటికి వారి వారి తల్లులయితే ఎలా స్పందిస్తారో రాయడం బావుంది. చివర్లో ఇచ్చిన ఫీచర్ 'స్వయంకృత పురస్కార పథకం' కూడా ఆకట్టుకుంటుంది. పుస్తకంలో అక్కడక్కడా జోక్స్ కూడా ప్రచురించడం రిలీఫ్‌నిస్తుంది. ఎందుకంటే కొన్ని ఫీచర్స్ సీరియస్ విషయాలను కూడా డిస్కస్ చేస్తాయి. అలాంటప్పుడు ఈ జోక్సే రిలీఫన్నమాట. శ్రీరమణ భయపడినట్లు (?) ఈ పుస్తకం చదివి 'మనం ఎక్కదలుచుకున్న రైలు జీవితకాలం లేటు' అని మాత్రం అనుకోం.

-కె.కె.

స్వీకారం



తెలుగులో శతక సాహిత్యంలో ఆణిముత్యాల్లాంటివి సుమతీ, వేమన పద్యాలు. కొన్ని శతాబ్దాల తర్వాత కూడా ఈ పద్యాలు ప్రజల నాలుకలపై నిలిచి వున్నాయంటే వాటిలో వున్న గొప్పదనమే కారణం. సుమతీ, వేమన పద్యాలు ఎంతో సరళంగానూ, సరసంగానూ వుంటూ సూటిగా మనసుకి హత్తుకునేలా వుండి గొప్ప సత్యాలనూ, లోకరీతులనూ తెలియజేస్తాయి.

సుమతీ వేమన నీతిపద్యాలు
సకలనం, సంపాదకుడు : పి.రాజేశ్వరరావు; **వెల :** రు.20/-, **ప్రతులకు :** విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

ఆరోగ్యమే మహాభాగ్యమంటూ మనం ఎన్నోసార్లు విని వున్నా ఆరోగ్యం వున్నంతవరకూ దానిని మనం గుర్తించము. అది లేనప్పుడే దాని విలువ మనకు తెలిసి వస్తుంది. వ్యక్తిత్వ వికాసానికి, ఆరోగ్య పరిరక్షణకు ఎంతో సన్నిహిత సంబంధం వుందని ఈ పుస్తకం మనకు గుర్తు చేస్తుంది.

వ్యక్తిత్వ వికాసము - ఆరోగ్యసూత్రాలు
రచన : డా॥ నాగినేని భాస్కరరావు; **వెల :** రు.30/-; **ప్రతులకు :** ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; డా॥నాగినేని భాస్కరరావు, 5-91, స్టేషన్‌రోడ్, మధిరపోస్ట్, ఖమ్మం జిల్లా – 507203

ఈ గ్రంథంలో 20 అధ్యాయాలు వున్నాయి. ఒక్కో అధ్యాయంలో ఒక్కొక్క నిర్దుష్టమైన విషయాన్ని గ్రంథకర్త చర్చించారు.

మాదిగవారి చరిత్ర
రచన:తాళ్ళూరి లాబన్ బాబు; **వెల :** రు.75/-, **ప్రతులకు :** విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు; కుసుమాంజలి ప్రచురణలు, 3-1-31/8, జనప్రియ కాలనీ, బహదూర్‌గూడా, ఎల్.బి.నగర్, హైదరాబాద్ – 74

పల్లె జీవితాలను ఆవిష్కరించిన రాజయ్య కుంచె

కరువు కన్నీళ్ళను మింగుతూనే పల్లె జీవితాల కాయకష్టం నుండి వారి కదలికలను తన రంగుల కుంచెతో సజీవ దృశ్యాలుగా మలచిన వారు డాక్టర్ కాపు రాజయ్య. నేల తల్లితో పల్లీయుల అనుబంధాన్ని, ఆప్యాయతలను ఆయన చిత్రాలు ఎంతో ప్రతిభావంతంగా సృజించాయి. అలనాటి జ్ఞాపకాలు, మధురమైన స్మృతులు రాజయ్య కుంచె నుండి జాలువారిన చిత్రాలు మన వెన్నంటుతాయి. బుట్టల అల్లిక, కల్లుగీయడం, బోనాల పండుగ, బతుకమ్మ పండుగ చిత్రాలే కాక వివిధ యాత్రలకు సంబంధించిన చిత్రాలు ఎన్నో ఉన్నాయి. ప్రతి దృశ్యం మన కళ్ళ ముందు సజీవతను పట్టి చూపుతుంది.

అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఈ చిత్రకారుడు మెదక్ జిల్లా సిద్ధిపేటలో 1925లో పుట్టారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే తన రంగుల కుంచెతో చిత్రకళకు పదును పెట్టారు. హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ ఆర్ట్‌లో పెయింటింగ్‌లో డిప్లొమా పొందారు. 1946లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖన ఉపాధ్యాయుడిగా తన జీవనం మొదలుపెట్టి ఎంతో మంది విద్యార్థులకు చిత్రకళలో శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయునిగా అనేక సేవలందించిన ఆయన 1983లో పదవీ విరమణ చేశారు. తనకంటూ ఓ ప్రత్యేక శైలి కలిగిన రాజయ్య ఎన్నో అవార్డులు, సన్మానాలు పొందారు. 1966లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయన్ను ఘనంగా సన్మానించింది. 1975లో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రభుత్వం మరోసారి సన్మానించింది. 1984లో ఆంధ్రప్రదేశ్ కళావేదిక 'కళా సరస్వతి' బిరుదునివ్వగా, ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడమీ, పాట్నా శిల్పకళా పరిషత్ వారు బంగారు పతకాలను బహూకరించారు. 1990లో 'రిస్క్‌లైఫ్' అనే చిత్రానికి జాతీయ అవార్డు అందుకున్నారు. భారత ప్రభుత్వ


రాజయ్య

మానవ వనరుల శాఖచే సీనియర్ ఫెలోషిప్' పొందారు. 1993లో హైదరాబాద్ జెఎన్‌టియు వారు డాక్టరేట్‌తో పాటు 'కళాప్రవీణ' బిరుదునివ్వగా తెలుగు విశ్వ విద్యాలయం వారు విశిష్ట పురస్కారాన్ని అందచేశారు. కేంద్ర లలిత కళా అకాడమీలో 20 సంవత్సరాలుగా సభ్యులుగా ఉంటున్నారు. అఖిల భారత ఫైన్ ఆర్ట్ మరియు క్రాఫ్ట్స్ సొసైటీ న్యూఢిల్లీ సభ్యునిగా ఉండటంతో పాటు హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షునిగా, జీవితకాలం సభ్యుడిగా, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రెండుసార్లు అకడమిక్ కౌన్సిల్ సభ్యునిగా ఉన్నారు.

కళాసేవలో మమేకమయిన రాజయ్య 1963లోనే లలిత కళా సమితి స్థాపించి రాష్ట్ర స్థాయిలో 29 చిత్ర, శిల్ప కళా ప్రదర్శనలు ఏర్పాటు చేసి ఔత్సాహిక కళాకారులకు ఉత్సాహం కలిగించారు. 1956లోనే జెకొస్లోవేకియా, హంగరి, బల్గేరియా, రుమేనియాల్లో, 1963లో బల్గేరియాలోని సోఫియా, 1964లో పెర్త్‌లో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. 1979లో హైదరాబాద్‌లో లలిత కళా అకాడమీ, కర్నాటక వారిచే గుల్బర్గాలో కళా శిబిరాలను ఏర్పాటు చేశారు. 1984లో అఖిల భారత చిత్ర కళా శిబిరం, చెన్నైలో సంప్రదాయ చిత్ర కళాకారుల శిబిరం, కోణార్క్‌లోనూ, బెంగుళూరులోనూ అఖిల భారత చిత్ర కళా శిబిరం (వాష్ పెయింటింగ్), 1995లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ వారి కళా శిబిరం హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. 1987లో దక్షిణ ప్రాంత సాంస్కృతిక కేంద్రంలో జానపద నృత్య శిక్షణ, అదే సంవత్సరం విజయవాడలో 'అప్నా కళా ఉత్సవ్', 1993లో అఖిల భారత సంప్రదాయ కళాకారుల శిబిరం మైసూరులోనూ ఏర్పాటు చేసి చిత్రకళకు జీవం పోశారు.

-టి.వి.నారాయణ

లాకప్‌డెత్

కర్రా ఎల్లారెడ్డి

కుటుంబాన్ని పోషించే వ్యక్తి అన్యాయంగా నిందితుల చేతుల్లో లాకప్‌లో మరణిస్తే వారి బాధను పట్టించుకునే వారెవరు?

నేరాలు జరిగినప్పుడు నిందితులను అరెస్టు చేశారా లేదా అని, ఒక వేళ అరెస్టు చేస్తే 24 గంటలలోపు వారిని కోర్టులో ప్రవేశ పెట్టారా లేదా అని, ఆ నిందితులపై జాప్యంలేకుండా కోర్టులో నేర విచారణ జరుగుతున్నదా లేదా అన్న విషయాల గురించే ఎక్కువగా ప్రశ్నలు వేస్తూ వుంటారు. ఆ నిందితులు చేసిన నేరంవల్ల నష్టపోయిన బాధితుల గురించి తక్కువగా పట్టించుకుంటారు. కొన్ని హైకోర్టులు ఇలాంటి నేరబాధితుల గురించి ఆలోచిస్తున్నాయి.

సాయంత్రం నాలుగు గంటల సమయంలో నాగయ్య ఇంట్లో వుండగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌నుంచి వచ్చిన ఇద్దరు కానిస్టేబుళ్ళు అతడిని అరెస్టు చేసి తీసుకెళ్ళారు. నాగయ్య స్కూటర్ల దొంగతనాలు మరికొందరితో కలిసి చేశాడని ఆరోపిస్తూ పట్టుకు పోయారు.

నాగయ్య భార్య, అతని తల్లిదండ్రులు మరో అరగంటలో పోలీస్ స్టేషన్‌కు వెళ్ళారు. కానీ అక్కడ ఎస్.ఐ.గారు లేకపోవడంతో ఆయన వచ్చేంత వరకు చూద్దామని వారంతా అక్కడే వుండిపోయారు. ఇందాక నాగయ్యను పట్టుకుపోయిన కానిస్టేబుల్ ఒకాయన వీరి వద్దకు వచ్చి నాగయ్య తను చేసిన స్కూటర్ దొంగతనాల గురించి నిజం చెబితే కేసు రాసి కోర్టులో ప్రవేశ పెడతామని చెప్పాడు. నాగయ్య అలాంటి వ్యక్తి కాదని వారు కానిస్టేబుల్‌ను బతిమిలాడారు. నాగయ్య పదవ తరగతి వరకు చదువుకొని ఒక కాంట్రాక్టర్ వద్ద డ్రైవర్‌గా పని పనిచేస్తున్నాడని, దొంగతనాలు చేయాల్సిన అవసరం అతనికి లేదని, అతడిని తిట్టకుండా, కొట్టకుండా వదిలి వేయాలని ప్రాధేయపడ్డారు. ఇంతలో ఎస్.ఐ. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాడు. నాగయ్యను లాకప్‌లో వేయించాడు.

మరో గంట పడిగాపులు పడ్డ తర్వాత నాగయ్య భార్య, తల్లిదండ్రులు ఎస్.ఐ.ను కలిసి మాట్లాడగలిగారు. ఇంతకు ముందు కానిస్టేబుల్‌కు చెప్పిన విషయాలనే ఎస్.ఐ.కి చెప్పి నాగయ్య అమాయకుడని, అతడిని ఏమీ చేయవద్దని వేడుకున్నారు.

నేరం చేసిన ప్రతి వాడూ తాను అమాయకుడేనని అంటాడని, అతని బంధువులు కూడా మా వాడు చాలా మంచి వాడని చెబుతారని ఎస్.ఐ. అంటూ నాగయ్యను ఈ రాత్రి ఇంటరాగేట్ చేసిన తర్వాత అన్ని విషయాలు బయటపడతాయని అన్నాడు. వారిని వెళ్ళిపోవాలని చెప్పటంతో నాగయ్య భార్య, తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్ నుంచి తమ ఇంటికి వెళ్ళిపోయారు.

రాత్రి పదిగంటలు దాటింది. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ., నాగయ్యను పట్టుకొచ్చిన ఇద్దరు కానిస్టేబుళ్ళు అతన్ని ఇంటరాగేట్ చేయటం మొదలుపెట్టారు. వారిని చూసి నాగయ్య వణికిపోయాడు. తాను ఏ నేరం చేయలేదని తనను కొట్టవద్దని వేడుకున్నాడు.

పావుగంట సేపు ఇద్దరు కానిస్టేబుళ్ళు కలిసి నాగయ్యను నగరంలో జరిగిన స్కూటర్ దొంగతనాల గురించి, దొంగల ముఠా గురించి ప్రశ్నించారు. నాగయ్యకు ఆ విషయాలేవీ తెలియనందున నిజంగా తనకేమీ తెలియదని నిజాయితీగా చెప్పాడు. దొంగతనాలు చేసి కూడా అబద్ధాలు చెబుతున్నాడని ఇక వట్టిమాటలతో కాదని కానిస్టేబుళ్ళు ఇద్దరు లాఠీలతో కొట్టడం ప్రారంభించారు. ఎంతసేపటికీ నాగయ్య దొంగతనం చేసినట్లు అంగీకరించకపోవడంతో ఆగ్రహంతో ఊగిపోయిన ఎస్.ఐ. కూడా విపరీతంగా కొట్టాడు. ఆ దెబ్బలకు తాళలేక నాగయ్య నేలమీద పడిపోయాడు. అయినా విడిచిపెట్టకుండా ముగ్గురు పోలీసులు కలిసి కర్రలతో కొడుతూ కాళ్ళతో తన్నారు. దెబ్బలకు తాళలేక నాగయ్య బిగ్గరగా ఏడుస్తూ మరికొద్దిసేపటికి స్పృహ తప్పిపడిపోయాడు.

కొద్దిసేపటికి అతడే లేచి కూర్చుంటాడని భావించిన పోలీసులు అక్కడి నుంచి వెళ్ళిపోయారు.

మరో అరగంట తర్వాత ఒక కానిస్టేబుల్ వచ్చి చూస్తే నాగయ్య అలాగే పడిపోయి వున్నాడు. కదిలించినా కదలలేదు, అతని ముక్కు దగ్గర చెయ్యి పెట్టి చూస్తే శ్వాసకూడా ఆగిపోయి వుంది. వెంటనే అతడు పరుగెత్తుకెళ్ళి ఎస్.ఐ.కి ఈ విషయం చెప్పాడు. నాగయ్య చనిపోయినా వారు చలించలేదు.

ఎస్.ఐ. చెప్పిన ప్రకారం ఇద్దరు కానిస్టేబుళ్ళు కలిసి చనిపోయిన నాగయ్యను తీసుకెళ్ళి అతను చెట్టుకు ఉరి వేసుకున్నట్టుగా వేలాడదీశారు.

మర్నాటి ఉదయం నాగయ్య భార్య, తల్లితండ్రులు నాగయ్య యజమానిని తీసుకొని పోలీస్ స్టేషన్‌కు వెళ్ళేసరికి అక్కడ ఎస్.ఐ.గానీ, నిన్నటి ఇద్దరు కానిస్టేబుళ్ళు గానీ లేరు. మరో కానిస్టేబుల్ వారి వద్దకు వచ్చి - నిన్న రాత్రి నాగయ్య చెట్టుకు ఉరి వేసుకొని చనిపోయినట్లు చెప్పాడు.

నాగయ్య యజమానికి అనుమానం వచ్చి ఈ విషయాన్ని పత్రికల వారికి, న్యాయ పోరాట కమిటీ వారికి, మానవ హక్కుల కమిటీ వారికి తెలియజేశాడు. నాగయ్యను పోలీసులే కొట్టి చంపి చెట్టుకు వేలాడదీశారని వారందరికీ చెప్పారు. వారంతా నాగయ్య భార్య, తల్లిదండ్రులతో మాట్లాడి అన్ని విషయాలు తెలుసుకున్నారు. నాగయ్య తన యజమాని వద్ద గత మూడేళ్ళ నుంచి డ్రైవర్‌గా పని చేస్తున్నాడని, అతడు ఈ మధ్య కాలంలో దొంగల ముఠాతో కలిసి స్కూటర్ల దొంగతనాలు చేసే అవకాశం లేదని గ్రహించారు.

నాగయ్య లాకప్‌డెత్ గురించి అన్ని పత్రికల్లో వచ్చింది. న్యాయపోరాట కమిటీ వాళ్ళు ధర్నాలు, ఆందోళన చేశారు. నాగయ్య మృతికి బాధ్యులైన పోలీసులపై హత్య కేసు నమోదు చేయాలని హక్కుల

సంఘం వాళ్ళు డిమాండ్ చేశారు.

నాగయ్య మృత దేహానికి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అతని దేహంపై లాఠీ దెబ్బలను గుర్తించారు. పోలీసులు బూటు కాళ్ళతో తన్నటం వల్ల పక్కటెముకలు విరిగాయని, శరీరం లోపల రక్తస్రావం జరగటం వల్ల నాగయ్య మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు.

నాగయ్యది లాకప్‌డెత్ అని నిర్ధారణ అయింది.

పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా నాగయ్య మృతికి బాధ్యులైన ఇద్దరు కానిస్టేబుళ్ళు, ఎస్.ఐ.పై హత్య కేసు నమోదు చేశారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ సి.ఐ. ఈ కేసును పరిశోధించి నిందితులను అరెస్టు చేసి కోర్టుకు అప్పగించారు.

మరో ఏడాది తర్వాత నాగయ్య హత్య కేసు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణకు వచ్చింది. నాగయ్య భార్య, నాగయ్య తల్లిదండ్రులు, అతని యజమాని కోర్టులో సాక్ష్యం చెప్పారు. మరికొందరు సాక్షులు, పోస్టుమార్టం నిర్వహించిన డాక్టర్లు కేసు పరిశోధించిన సి.ఐ. కోర్టులో సాక్ష్యం చెప్పారు.

నిందితులకు జీవిత ఖైదు విధించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించాడు. అన్ని ఆధారాలను, సాక్ష్యాలను పరిశీలించిన తర్వాత జిల్లా సెషన్స్ జడ్జి ముగ్గురు పోలీసులు నాగయ్యను హత్య చేశారని నిర్ధారించి ముగ్గురు నిందితులకు జీవిత ఖైదుగా జైలు శిక్ష, తలా 5 వేల రూపాయలు జరిమాన విధించారు. ఒకవేళ నిందితులు మొత్తం జరిమానా చెల్లిస్తే అందులోంచి 10 వేల రూపాయలను నష్టపరిహారం కింద నాగయ్య భార్య, తల్లిదండ్రులకు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

జిల్లా సెషన్స్ జడ్జి తీర్పును సవాలు చేస్తూ ముగ్గురు పోలీసులు హైకోర్టులో అప్పీలు దాఖలు చేశారు. వారి కేసు హైకోర్టులో విచారణ రావడానికి ఆరు నెలల కాలం పట్టింది. ఈ ఆరు నెలల నుంచి వారు జైలులోనే వున్నారు. వారు జిల్లా సెషన్స్ కోర్టులో చెల్లించిన జరిమానాలో నుంచి 10 వేల రూపాయలను నాగయ్య బంధువులకు నష్టపరిహారం కింద చెల్లించారు.

హైకోర్టులో పోలీసులు దాఖలు చేసిన క్రిమినల్ అప్పీలు విచారణకు వచ్చింది. ఇద్దరు హైకోర్టు జడ్జీలతో కూడిన బెంచి ముందు పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసులు తమ పక్షాన నియమించుకున్న న్యాయవాది వాదోపవాదాలు చేశారు. కింది కోర్టు నాగయ్య బంధువులకు చాలా తక్కువ నష్టపరిహారం ఇవ్వాలని తీర్పు చెప్పడం పట్ల హైకోర్టు బెంచి అసంతృప్తి వ్యక్తం చేసింది. వెంటనే నిందితుల తరపు న్యాయవాది లేచి, నష్టపరిహారాన్ని పెంచితే తన క్లయింట్లు చెల్లించటానికి సిద్ధంగా వున్నారని తెలిపాడు. నిందితులందరూ ఉద్యోగులైనందున వారి శిక్షా కాలాన్ని తగ్గిస్తే కోర్టు సూచించిన నష్టపరిహారాన్ని నేర బాధితులకు చెల్లిస్తారని విన్నవించాడు. ఈ సందర్భంగా చెన్నమ్మ కేసులో మద్రాసు హైకోర్టు తీర్పును ప్రస్తావించాడు.

మరింత నష్టపరిహారం ఇవ్వాలని తీర్పు చెప్పే ముందు నేర బాధితుల మనోగతాలను తెలుసుకునేందుకు హైకోర్టు బెంచి నాగయ్య భార్య, తల్లిదండ్రులను కోర్టు ముందుకు పిలిపించింది. వారి సమక్షంలో న్యాయమూర్తులు మాట్లాడుతూ నిందితులు చెల్లించే జరిమానాను మూడు లక్షల రూపాయలు విధిస్తామని చెప్పారు. ముందుగా తమకు నష్టపరిహారం వద్దని చెప్పినప్పటికీ హైకోర్టు ప్రోద్బలంతో వారు అంగీకరించారు. జైలు శిక్షకు బదులు భారీ జరిమానా విధించాలని హైకోర్టులు తీర్పులిచ్చాయి.

నిందితులైన పోలీసులు ఆవేశంతో విచక్షణా రహితంగా కొట్టడం వల్ల నాగయ్య మరణించాడని పేర్కొంటూ - ఈ కేసులో యావజ్జీవ జైలు శిక్షను ఆరు నెలలకు తగ్గిస్తూ జరిమానాను మూడు లక్షల రూపాయలకు పెంచుతున్నామని తీర్పు చెప్పారు. ఈ జరిమానాను నిందితులు రెండు వాయిదాల్లో తలా యాభైవేల చొప్పున చెల్లించాక ఆ మొత్తాన్ని నేర బాధితులకు అందజేయాలని తీర్పు చెప్పారు. నేర బాధితులకు చివరికి న్యాయం జరిగింది. ★

డ్రై ఫ్రూట్ మార్కెట్‌కు ఆఫ్ఘన్ యుద్ధం దెబ్బ

ఆఫ్ఘన్ యుద్ధం ఢిల్లీ డ్రైఫ్రూట్ (ఎండు పండ్లు) మార్కెట్‌ను బాగా దెబ్బతీసింది. తాను ప్రతి సంవత్సరం దీపావళికి తన ఖాతాదారులకు పంచేందుకు సుమారు 50 కిలోల ఎండుపండ్లు తెప్పించే వాడనని 12 సంవత్సరాలుగా వ్యాపారం చేస్తున్న సమీర్ అగర్వాల్ తెలిపారు. కానీ ఆఫ్ఘన్ యుద్ధం మూలంగా వాటి ధరలు ఆకాశాన్నంటడంతో ఈ సంవత్సరం కేవలం స్వీట్స్ మాత్రమే పంచానని ఆయన చెప్పారు. డ్రైఫ్రూట్స్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో వాటిని కొనే వారి సంఖ్య బాగా తగ్గిపోయింది. గతంలో తెప్పించిన నిల్వలే యింకా దుకాణాలలో పడి వున్నాయి. ఢిల్లీ వంటి నగరాలలో దసరా, దీపావళి వంటి పండుగలకు మిత్రులకు, బంధువులకు డ్రైఫ్రూట్స్ పంచే ఆచారముంది. ఉత్తర భారతదేశంలో అతిపెద్ద రిటైల్ ఫుడ్ మార్కెట్‌గా పేరు గాంచిన పాతఢిల్లీలోని ఖరీబోలీలో ఖాతాదారులులేక దుకాణాలు చిన్నబోయాయి.

గత సంవత్సరం దసరా, దీపావళి పండుగల సందర్భంగా ఢిల్లీలో కోట్లాది రూపాయల డ్రైఫ్రూట్స్ వ్యాపారం జరిగింది. ఈ సంవత్సరం కొనుగోళ్ళు చాలా నామమాత్రంగా వున్నాయి. "మా దుకాణంలో పిస్తా, బాదం, జీడిపప్పులు, కిస్‌మిస్, అత్తిపండ్లు, అక్రూట్ వంటి వాటి కోసం నెలల ముందుగానే వందలాది కిలోలకు ఆర్డర్లు వచ్చేవని" కాబూల్ డ్రైఫ్రూట్ స్టోర్ యజమాని అమర్‌జీత్ సింగ్ చెప్పారు". "ఈ సంవత్సరం మా వ్యాపారం 40 శాతం పడిపోయింది".

ఆఫ్ఘనిస్తాన్ నుంచి సరఫరాలు తగ్గిపోవడంతో వీటి ధరలు పెరిగాయని వ్యాపారులంటున్నారు. 'ఈ పండ్లన్నీ సెప్టెంబర్ 11కు ముందే మాకు వచ్చేవి. అయితే ఈసారి వాటి సరఫరాలను ఆపేశార్గని" సింగ్ తెలిపారు. కిలో 280 రూపాయలున్న బాదంను 380కి, 160 రూపాయలున్న అత్తిపండ్లు రు.360కి, రు.400లున్న పిస్తాను రు.500లకు అమ్మాల్సి వస్తోందని ఆయన చెప్పారు.

ఇదంతా వ్యాపారులు చేస్తున్న మాయాజాలమని తరచుగా వీటిని కొనుగోలు చేసే ఆరతీ ఖన్నా చెప్పారు. "గత 20 ఏళ్ళుగా సరఫరాలకు ఎలాంటి ఆటంకం లేనప్పుడు యిప్పుడెలా వచ్చిందని" ఆమె ప్రశ్నిస్తున్నారు. "ధరలు పెంచేందుకు యిదొక సాకు" అని ఆమె అన్నారు. అయితే వ్యాపారులు ఈ తరహా వాదనలను ఖండించారు. ★

దిక్కూ దివాణమూ!

కొండబాబు

"నిరపరాధయిన విశ్వనాథంగారిని ఎలా రక్షించుకోవాలో నాకు తెలుసు. ఎలాగయినా కచ్చితంగా రక్షించి తీరతాను.. మీ భరతం పడతాను"

"నీకే దిక్కూ దివాణం లేదు. వాడిని ఎలా రక్షిస్తావు? ప్రగల్భాలు మాను"

"నావి ప్రగల్భాలో కాదో.. నీకు శిక్షపడిన రోజు తెలుస్తుంది."

"అంతవరకూ నువు ఉంటే కదా! నీకు ఇప్పుడు దేవుడే దిక్కు"

వెంటనే తుపాకీ పేలిన చప్పుళ్ళు.

హీరో తూటాలను తప్పించుకొని విలన్ గుండెలపై రెండు కాళ్ళతో తన్నాడు.

ఉత్కంఠతో చూస్తున్న ప్రేక్షకులు ఊపిరి పీల్చుకున్నారు. సాధారణంగా తెలుగు సినిమాల్లో హీరోదే పైచేయని తెలిసినా ఎందుకో ప్రేక్షకులకు ఆ ఉత్కంఠ అనుకున్నాడు - అందరిలానే సినిమా చూస్తున్న ఆలోచనాపరుడైన ఓ ప్రేక్షకుడు.

★ ★ ★

సినిమాలు, సినిమాల్లోని హీరో, విలన్ సంవాదాలూ గురించి కాదు మన చర్చ. పై సంభాషణలో విలన్ 'ఏ దిక్కూ దివాణం లేదు', 'దేవుడే దిక్కు' వంటి పదాలను వాడాడు.

'దిక్కు' ఏమిటి? దివాణం ఏమిటి? వాటికి అసలు అర్థాలు ఏమిటి? వాటికి ఈ అర్థాలుఎలా ఏర్పడ్డాయి? అనేదే మన చర్చ.

దిక్కు తోచలా! దిక్కు మాలినవాణ్ణి బాబూ! చూచే దిక్కులేదు! నా అన్న దిక్కు లేదు! దిక్కులేని పక్షిని! దిక్కూ ముక్కూ లేదు. దిక్కున్నచోట చెప్పుకోవోయ్! ఈ దిక్కు చూడండి? దిక్కా? దివాణమా! అనే పలుకుబడులూ కొల్లలు.

ఈ సంస్కృతపు పలుకుబడిని మొదట తెలుగువారు "దిక్కుతోచని, దిక్కు తెలియని" అనే అర్థంలోనే వాడారు. కానీ, ఇది క్రమంగా రక్షణ ఆశ్రయం, స్థలం, న్యాయం జరిగే స్థలం అనే అర్థాలలోకి వాడుకకు వచ్చింది.

పూర్వం గడియారాలూ, గంటలూ లేవు. పగలు సూర్యుణ్ణి చూచి, రాత్రి నక్షత్రాలనుబట్టి దిక్కులు తెలుసుకొనేవారు. వానా కాలంలో మబ్బులు కమ్ముకొని సూర్యుడు కనిపించనినాడు పొద్దు తెలిసేది కాదు. దిక్కు తెలిసేది కాదు. మబ్బులు వీడిన తర్వాత గాని పనులు జరిగేవి కావు. ఈ విధంగా సూర్యుడు, నక్షత్రాలు కనిపించనినాడు మనవారు "దిగ్భ్రాంతులు, దిఙ్మూఢ దినసేశ్వరా" అని కాళిదాసు ప్రయోగం. అంటే సూర్యునికే దిక్కు తెలియదట.

ఇక్కడ 'దెస చెడి" అనేది దిక్కు తెలుసుకోలేక, దారి తెలుసుకోలేక, దారి లేక అని సంస్కృత భాషలోని అర్థానికి అనుగుణంగానే ప్రయోగించబడింది.

కాని, తిక్కన కాలానికి అర్థం రకరకాలుగా మారింది. తిక్కన ఒకే పద్యంలో దెస అనే దాన్ని "గతిలేని, ఎవరూ ఆధారంలేని" అనే అర్థాలలో వాడాడు.

"ఎరుగంగ మచ్చునే యెవ్వరి కెత్తరి
ఏ దెస యగునొ! మునీంద్ర యేము
గలుగంగ దెసలేని పులుమానిసికి బోలె
నక్కురువృద్ధున కట్టిచావు
వాటిలే..." (ఆశ్రమవాస పర్వం)

ఈ పద్యంలో "ఎత్తరి ఏ దెస" అన్నప్పుడు ఏ గతి అని; "దెసలేని" అన్నప్పుడు, బంధు మిత్రులు లేని అనాథునివలె అని అర్థాలు మారడం స్పష్టం.

కాటమరాజు బొల్లావు మనుమసిద్ధిరాజు సైనికులను సుగ్గాడి కుమ్మి కూల్చగా, వారు-

"దిక్కుమాలిన చావు తీగలలోన,
నక్కపే దిక్కాయె నట్టడవి గదెష"

అని విలపించారట (కాటమరాజు కథ). ఇక్కడ దిక్కు అనే పదానికి రెండు చోట్లా ఆశ్రయం అనే అర్థం.

పొద్దు, వైపు అనే అర్థాలలో వాడుకలో ఉండి, క్రమంగా ఆశ్రయం అనే అర్థం చాలా వరకు స్థిరపడిన దిక్కు శబ్దానికి ముస్లిం సంస్కృతిలో "దివాణం" అనే పదం ఉపస్కారంగా చేరింది. - దారీ తెన్నూ, మాటా మంతీలాగా. ఇలాంటివి ఎన్నయినా చెప్పవచ్చు. ముస్లింల పరిపాలన స్థిరపడిన రోజులలో మనకు ఫార్సీ, అరబ్బీ, తుర్కీ, హిందీ భాషల సంబంధం కలిగి కొత్త పదాలు, పలుకుబడులు పుట్టాయి. జంట పదాలలో మొదటిది తెనుగు పదం, రెండవది ఫార్సీ పదం వాడటం సంప్రదాయమైంది. సిగ్గూ శరమూ, దిక్కూ దివాణం - ఇలాంటివే. దివాణం అనేది "దివానె ఆమ్" అనేదాని తద్భవం.

మొగల్ చక్రవర్తుల కాలంలో రెండు దర్బార్లుండేవి. ఒకటి దీవానే ఖాస్. ఇది చక్రవర్తీ, మంత్రులూ మంతనాలు జరిపేది. రెండవది దీవానే ఆమ్. ఇది ప్రజల మొరలు విని చక్రవర్తి స్వయంగా తీర్పులు చెప్పేది. ఈ సంప్రదాయాన్నే మహారాష్ట్రులు, తెనుగు సంస్థానాధీశులు అనుసరించారు. దీవానే ఆమ్ మరాఠీలో దివాణే ఆమ్ అయి దివాణం అయింది. ★

పాఠక స్పందన

డాల్ సరస్సును రక్షించాలి

18-11-2001 ఆదివారం ప్రజాశక్తిలో ప్రచురించిన "కాలుష్యం కోరల్లో డాల్ సరస్సు" చాలా బాగుంది. ప్రపంచ ప్రసిద్ధిపొందిన పర్యాటక కేంద్రాలలో శ్రీనగర్‌కు దగ్గరలోని డాల్‌లేక్ ఒకటి. డాల్ సరస్సుకు ఉండే ప్రత్యేక స్థానం కాలుష్యం కోరల్లో కలిసిపోవడం విచారకరం. డాల్ సరస్సు పరిరక్షణకోసం వేంటనే చర్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. తద్వారా ప్రకృతి ప్రసాదించిన వరం "డాల్ సరస్సు"ను అందంగా తీర్చిదిద్దాలి.

- బట్టా రామకృష్ణ, సౌత్ మోపూరు గ్రామం, నెల్లూరు జిల్లా.

చక్కని వ్యాసం

నవంబర్ 18 సంచికలో జీవనశైలి శీర్షికన ప్రచురించిన 'ఎందుకింత చులకన' వ్యాసం చాలా బాగుంది. అలాగే 11నవంబర్ సంచికలో 'మోటార్ రేస్‌లో కొత్త కెరటం కరుణ్' గురించి చక్కగా వివరించారు.

- పుట్టా శ్రీనివాసరావు, లక్కవరపుకోట, విజయనగరం జిల్లా.

ఒకసారి వెళ్ళి చూడాలనిపిస్తోంది

నవంబర్ 11 ఆదివారం అనుబంధంలో టూరిస్ట్‌గైడ్ శీర్షికన ప్రచురించిన 'శిల్పకళానిలయాలు పానగల్లు - కొలనుపాక' బాగుంది. ఆవ్యాసంలో ప్రచురించిన పచ్చల సోమేశ్వరాలయం, ఛాయా సోమేశ్వరాలయం చిత్రాలు చూడముచ్చటగా వున్నాయి. ఒకసారి అక్కడకు వెళ్ళి చూడాలనిపిస్తోంది.

- మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణా జిల్లా.

మనలోమాట బాగుంది

నవంబర్ 11వ తేదీ సంచికలో మనలోమాట శీర్షికన ప్రచురించిన విలువలగురించి వివరించిన అంశాలు ఆసక్తిదాయకంగా వున్నాయి. అలాగే కవర్ స్టోరీలో ప్రపంచబాబు విధానాల గురించి తెలియపరచిన విషయాలు నమ్మలేని నిజాలు. అలాగే అదాలత్ కథలు, ఆరోగ్యం, బాలనేస్తాలు శీర్షికలు చాలా బాగున్నాయి.

- ఆనంద గజపతిరావు, తెట్టంగి, శ్రీకాకుళం జిల్లా.

ఫోటో : ఎస్. భరత్ భూషణ్, హైదరాబాద్.

Agri Gold Bio- Organic Fertilizers for High Yield & More Income

Bio-fertilizer products are the blessing of nature and today world over every country is stressing on organically

produced edible crops due to the far reaching damages of pesticides and inorganic fertilizers not only to the soil but also to the humanity for the food we eat directly transfers the above as residues.

These bio-fertilizer products are the natural factories that are

being gifted to the farming community to be set up in their farm lands to fix Nitrogen for which the power bill, the raw materials bill, the wages bill and other value addded ingredients bill are paid by nature, and more than this, it

helps conserve the non renewable fossil fuel and also prevent pollution that emnates by producing the inorganic Nitrogen.

These are the living bacterial symbiotically helpful cultures and fungal cultures, developed in our own labs, some products from recycled vegetable and fruit

waste which fix major nutrients, minor nutrients and trace elements in the soil which help restore the soil health that has eroded over the years by the harmful usage of 'Inorganic fertilizers and pesticides'. World over there is a growing

concern about this and we do share the concern in our own meagre capacity.

We now, here, pledge ourselves to be a part in the nation's effort to promote Ever Green Revolution as a Strategy for sustenance and stability for this vast

country without eroding the ecological balance.

Agri Gold

ALL NATURAL, ECO-FRIENDLY ORGANIC FERTILIZERS

AGRI GOLD ORGANICS PVT. LTD.,
40-1-21/21, 2nd floor, Catholic Complex, M.G. Road, VIJAYAWADA - 520 010. A.P. Ph 0866-473711, 481754 Fax : 0866-483711
e-mail : agrigold@md4.vsnl.net.in visit us at : www.agrigoldindia.com